www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

గురువారం | 24-8-2017 | పేజీలు: 16 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 14 సంచిక: 46 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: తదియ రా. 8.27 తదుపరి చవితి; నక్షత్రం: ఉత్తర మ. 2.00 తదుపరి హస్త; వర్జ్యం: రా. 10.37-12.15; దుర్ముహూర్తం: ఉ. 10.13-11.03, మ. 3.13-4.02; అమృతఘడియలు: ఉ. 6.50-8.25; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.32 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

Lalithaa
సోమాజిగూడ సర్కిల్,
హైదరాబాద్.
ఆదివారం, 27.8.2017

www.andhrajyothy.com
నిజామాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి
గురువారం 24-8-2017

భూమి ఎవరిది!

యాజమాన్యంపై సర్వే.. రికార్డుల శుద్ధి, ప్రక్షాళన: కేసీఆర్



పైలట్ ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లా దౌలాపూర్‌లో డీజీపీఎస్ యంత్రంతో సర్వే చేస్తున్న అధికారులు

15 నుంచి స్పెషల్ డ్రైవ్

డిసెంబరుకల్లా రికార్డులన్నీ శుద్ధి

ఈ 3 నెలలు ఇతర పనులు బంద్

తొలి దశలో వివాదాల్లేని భూములు

మలిదశలో వివాదాస్పద భూములు

గ్రామం యూనిట్‌గా సర్వే నిర్వహణ

మంత్రులు, ఎంపీలంతా రావాలి

నేను మూడూళ్ల బాధ్యత తీసుకుంటా

రాష్ట్రంలో భూదందా బంద్ కావాలి

సమగ్ర భూసర్వేపై సమీక్షలో సీఎం

భూసర్వే షెడ్యూలిదీ!

- సెప్టెంబరు 1 నుంచి 9 వరకు గ్రామ రైతు సంఘాల సమన్వయ సమితులు ఏర్పాటు చేయాలి. సాగుభూమి కలిగిన రైతులందరూ సభ్యులుగా కమిటీ, 11 మందితో సమన్వయ సమితి ఉంటాయి.
- సెప్టెంబరు 10 నుంచి 15 వరకు మండల స్థాయిలో రైతు సమన్వయ సమితుల సదస్సులు నిర్వహిస్తారు.
- సెప్టెంబరు 15 నుంచి డిసెంబరు 15 వరకు రెవెన్యూ గ్రామం యూనిట్‌గా భూ రికార్డుల ప్రక్షాళన జరుగుతుంది.
- రాష్ట్రం మొత్తాన్ని 11వేల యూనిట్లుగా విభజించారు. 3,600 బృందాలు ప్రక్షాళనలో పాల్గొంటాయి. రెవెన్యూ అధికారి, వ్యవసాయాధికారి, గ్రామ రైతు సంఘం సమన్వయంతో ఒక్కో గ్రామంలో ఒక్కో బృందం నెల రోజులుండి, గ్రామసభలు నిర్వహించి, రైతులందరి సహకారం, అంగీకారంతో రికార్డులను సరిచేస్తాయి. ఒక్కో బృందం 3 నెలల్లో 3 గ్రామాల్లో పని పూర్తి చేస్తుంది.
- కేసీఆర్‌తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా తలా మూడు గ్రామాల బాధ్యత తీసుకుంటారు.
- డిసెంబరు ఆఖరుకు రికార్డులన్నీ సరిచేసి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. దీని ఆధారంగానే 'రైతులకు పెట్టుబడి' సాయం ఇస్తారు.



భూముల సర్వేపై హైదరాబాద్‌లో సమీక్షా సమావేశంలో సీఎం కేసీఆర్, నర్సింగరావు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూవివాదాలకు శాశ్వతంగా తెరదించే విధంగా రాష్ట్రమంతటా సమగ్ర భూ సర్వే నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. భూమి రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్ అత్యంత పారదర్శకంగా, సరళంగా ఉండాలన్నారు. సమగ్ర భూసర్వే, రిజిస్ట్రేషన్ల విధానంలో మార్పులు, భూ రికార్డుల నిర్వహణపై బుధవారం ప్రగతిభవన్‌లో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. భూ రికార్డుల ప్రక్షాళనపై రఘునందన్ రావు కమిటీ చేసిన అధ్యయనంపై చర్చించారు. భూ రికార్డులు సక్రమంగా, సమగ్రంగా ఉంటేనే ప్రతిష్ఠాత్మక 'రైతులకు పెట్టుబడి పథకం' విజయవంతమవుతుందని సీఎం చెప్పారు. "వ్యవసాయాన్ని మాత్రమే నమ్ముకున్న రైతులు అప్పులలో కూరుకుపోతున్నారు. ఏ మాత్రం గిట్టుబాటు ఉండడం లేదు. భార్యకు కనీసం

మిగతా 6వ పేజీలో...

● నిండా నిండి..



నిండుగా నీటి నిల్వతో కళకళలాడుతున్న ఆల్మట్టి రిజర్వాయర్

అటు నుంచి అటే వెనక్కి!

ఆల్మట్టిని ఖాళీ చేస్తున్న కర్ణాటక

అనుమతి లేకుండా ఎక్కువ నీటి వాడకం

వరదొచ్చినా మళ్లీ ఆల్మట్టిలోనే నిల్వ

దిగువకు చుక్క నీరు రాకుండా ఎత్తులు

'సాగర్'కు గడ్డు రోజులు

నీరు లేక కళ తప్పిన రిజర్వాయర్

ఇంత తగ్గడం13 ఏళ్లలో ఇదే తొలిసారి

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): "ఆల్మట్టి నిండింది. నారాయణపూర్ నిండింది. ఆ పైన ఉన్న మహారాష్ట్రలో ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. మళ్లీ వరద వస్తే వచ్చే నీళ్లన్నీ తెలంగాణకే" అనే ఆశ ఆవిరయ్యేలా కనిపిస్తోంది! రాష్ట్రానికి నీటి గండం ముంచుకొస్తోంది. సాగు నీటి సంగతి సరే.. తాగు నీటికి సైతం కష్టాలు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది! కృష్ణా బేసిన్‌లో భారీ వర్షాలు,

మిగతా 11వ పేజీలో...



● ఎడారిలా ఎండి.. నీరు అడుగంటి వెలవెలబోతున్న నాగార్జున సాగర్ రిజర్వాయర్

ప్రైవేట్ బడుల్లోనూ

టెట్ తప్పనిసరి

టీచర్లపై ప్రభుత్వ యోచన 6

బీఎడ్, డీఎడ్ చేసిందెందరు?

టెట్ క్వాలిఫైడ్ ఎంత మంది?

లెక్కలు తీస్తున్న విద్యాశాఖ

ఓటెత్తిన నంద్యాల

81 శాతం భారీ పోలింగ్!

బారులు తీరిన మహిళలు

పట్టణంలో 74% పోలింగ్ 11

రూరల్‌లో 87.61%

గెలుపుపై ఇరు పార్టీల ధీమా

టీడీపీదే విజయం: లగడపాటి

చేదు మాత్ర ఒకేసారి వేస్తే నోరంతా చేదుగా అవుతుంది. రోజూ కొద్దికొద్దిగా అలవాటు చేస్తే చేదు తెలియదు. పెట్రో ధరల రోజువారీ సమీక్షతో కేంద్రం ఇప్పుడదే చేస్తోంది. 15 రోజులకొకసారి ఇచ్చే షాక్ ట్రీట్‌మెంట్‌కు బదులు.. రోజువారీ పైసల పెంపు పేరిట మెత్తని కత్తితో కోస్తోంది. పెట్రోలు ధర పైసాపైసా చొప్పున పెంచుతూ గత నెలరోజుల్లో రూ.4.36 మేర పెంచింది. అయినా ఎక్కడా ఆందోళనలు లేవు. విపక్షాల విమర్శలు లేవు. అసలు పెంపు గురించి ప్రజలు పట్టించుకోవడమే మానేశారు!!



సైలెంట్ బాదుడు

పెట్రోల్‌పై నెల రోజుల్లో రూ.4.36 పెంపు

నొప్పి తెలియకుండా రోజూ పైసల్లో పెంపు

డీలర్ల ఆందోళన తర్వాత పెరుగుదల షురూ

క్రూడాయిల్ ధర పెరగడం వల్లనే: కంపెనీలు

పట్టించుకోని ప్రజలు, రాజకీయ పార్టీలు

హైదరాబాద్, అమరావతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెట్రో ధరల విషయంలో కేంద్రం ప్రజలను నొప్పి తెలియకుండా బాదేస్తోంది! రోజుకు పైసా.. రెండు, మూడు పైసల చొప్పున పెంచుతూ నెల రోజుల వ్యవధిలో దాదాపు నాలుగున్నర రూపాయల మేర పెంచేసింది. రోజువారీ విధానాన్ని తీవ్రంగా

మిగతా 11వ పేజీలో...

కాళేశ్వరానికి ఓకే



పెద్దపల్లిలో మాజీ మంత్రి శ్రీధర్‌బాబును అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

అయితే పరిహారమిచ్చాకే పనులు చేపట్టాలి

ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితులు

పెద్దపల్లిలో టీఆర్ఎస్, కాంగ్రెస్ ఘర్షణ

పోలీసుల లాఠీచార్జి.. శ్రీధర్‌బాబు అరెస్టు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, పర్యావరణ ప్రభావంపై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ బుధవారం కూడా కొనసాగింది. పెద్దపల్లి, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో, సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా చోట్ల.. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించాల్సిందేనని కోరిన రైతులు.. తమ పరిహారం, పునరావాసం మాటేమిటని ప్రశ్నించారు. కాగా

మిగతా 11వ పేజీలో...

● మరో రైలు ప్రమాదం.. 100 మందికి గాయాలు



ఉత్తరప్రదేశ్ ఔరేయా జిల్లాలో డంపర్‌ను ఢీకొని పట్టాలు తప్పిన కైఫియత్ ఎక్స్‌ప్రెస్ బోగీలు

రైల్వే మంత్రి సురేశ్ ప్రభు రాజీనామా!

శాస్త్రి, నితీశ్, మమత బాటలో నైతిక బాధ్యత.. వేచి ఉండాలన్న మోదీ

రైల్వే బోర్డు చైర్మన్ మిత్తల్ ఔట్.. ఆయన స్థానంలో అశ్వినీ లోహానీ 14

ఆరుగురు ఔట్?

మంత్రుల ఉద్వాసనకు రంగం సిద్ధం

13 మందికి శాఖల మార్పు చేర్పులు

త్వరలోనే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ

కేబినెట్‌లోకి జేడీయూ, అన్నాడీఎంకే

గవర్నర్ల నియామకాలపైనా నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కేబినెట్ పూర్తిస్థాయి ప్రక్షాళనకు రంగం సిద్ధమైంది. ఆరుగురు కేంద్ర మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశం ఉంది. వారి సేవలను పార్టీకి ఉపయోగించుకోవాలని ప్రధాని మోదీ భావిస్తున్నారు. నితీశ్‌కుమార్


మిగతా 14వ పేజీలో...

క్రీమీలేయర్ 8 లక్షలు

ఓబీసీ సంపన్నశ్రేణి పరిమితి 2 లక్షలు పెంపు

ఓబీసీల వర్గీకరణపై అధ్యయనానికి కమిషన్

కేంద్ర కేబినెట్ నిర్ణయం.. అరుణ్ జైట్లీ వెల్లడి



న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఓబీసీలకు కేంద్ర కేబినెట్ బుధవారం చల్లని కబురు చెప్పింది. ఓబీసీ రిజర్వేషన్ల వర్తింపునకు కీలకమైన సంపన్న శ్రేణి ఆదాయ పరిమితిని ఆరు లక్షల రూపాయల నుంచి 8 లక్షల రూపాయలకు పెంచింది. దాంతో ఇక నుంచి ఓబీసీల్లో ఎనిమిది లక్షలకు మించిన ఆదాయమున్న వారే సంపన్న శ్రేణి కిందకు వస్తారు. వారికి మాత్రమే ఓబీసీ రిజర్వేషన్ వర్తించదు. మరోపక్క జాతీయ స్థాయిలో ఓబీసీల వర్గీకరణపై ముందడుగు పడింది. ఓబీసీ జాబితాలో ఉన్న కులాలను వర్గీకరించడానికి కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్

మిగతా 6వ పేజీలో...

త్వరలో రూ.200 నోట్లు

దాదాపు 50 కోట్ల నోట్ల విడుదల

2 వేల రద్దు భయం వద్దు: జైట్లీ 12

రైల్వేమంత్రి సురేష్‌ప్రభును వరుస కష్టాలు వెంటాడుతున్నాయి. ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి అధికారులకు శిక్షలు వేసి, ఆయన మాత్రం కుర్చీని వదల్లేదని విపక్షం ఆక్షేపించుకుంది. లాల్‌బహాదూర్ శాస్త్రినుంచి మాధవరావు సింధియా దాకా అనేక ఉదాహరణలు చూపి ఇప్పటికీ దిగవచ్చుకుంటూ రెచ్చగొట్టింది. బుధవారం ఉదయం కైఫియత్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో ఆయన దిగిరాక తప్పలేదు. ప్రధానిని కలిసి రాజీనామాకు సిద్ధమన్నారు. వరుస ప్రమాదాలతో ప్రభుత్వ పరువు పోయిందని ప్రధాని కూడా భావిస్తున్నట్టే కనిపిస్తున్నది. రైల్వేబోర్డు ఛైర్మన్‌గా ఉన్న మిట్టల్ ఇంకా ఏడాదికాలం ఉండగా తనకు తానుగా రాజీనామా చేసే అవకాశం లేదు. ఆయన స్థానంలో ఇప్పటివరకూ ఎయిరిండియా ఛైర్మన్‌గా ఉన్న లోహానీ వచ్చారంటే ఈ మార్పు ప్రధాని ఆదేశాల మేరకు జరిగినట్టే. బాధ్యతను ఇంతటితో సరిపెడతారా లేక సురేష్ ప్రభు రాజీనామాను కూడా మోదీ ఆమోదిస్తారా అన్నది అటుంచితే, ఈ వరుస ప్రమాదాలతో ప్రభుత్వంలో సలువు వచ్చినట్టే కనిపిస్తున్నది.

సురేష్‌ప్రభు నిజాయితీపరుడు, సమర్థుడు, కష్టపడే లక్షణం ఉన్నవారని గిట్టనివారు కూడా ఒప్పుకుంటారు. మోదీ తొలి మంత్రివర్గ విస్తరణలో గోవా నుంచి పారీకర్‌ను రక్షణమంత్రిగా, శివసేననుంచి సురేష్‌ప్రభును రైల్వేమంత్రిగా తెచ్చుకున్న విషయం తెలిసిందే. ఎన్నికల ప్రచారంలో రక్షణ వైఫల్యాలతోపాటు రైల్వే ప్రమాదాలను కూడా ప్రస్తావించిన మోదీ, రైల్వేశాఖ మరమ్మతుకు ప్రాధాన్యం ఇచ్చినందునే సురేష్‌ప్రభుకు ఈ బాధ్యత అప్పగించినట్టు అంతా భావించారు. ఇప్పుడు ప్రభు రాజీనామాను ఆమోదించడం వ్యక్తిగతంగా మోదీకి ఎంతో ఇబ్బంది. పాతికమంది మరణానికి కారణమైన ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం, వందమందిని గాయపరచిన కైఫియత్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం అధికారపక్షం ఇంతవరకూ చెబుతున్న గొప్పలను చిత్తుచేశాయి. తాను ఈ మూడేళ్లకాలంలో రైల్వేలకు చెమటనూ రక్తాన్ని ధారపోశానంటున్నారు ప్రభు. గత మూడేళ్లకాలంలో ప్రమాదాల సంఖ్య ఎంతో తగ్గిందంటున్న డేటాను రైల్వేమంత్రిత్వశాఖ మీడియా ద్వారా సోషల్ మీడియా ద్వారా ప్రచారంలో పెట్టింది. మూడేళ్లకాలంలో రైలు ప్రమాదాలు 135నుంచి 104కు తగ్గాయని, యూపీఏతో పోల్చితే సగటు వార్షిక ప్రమాదాల సంఖ్య 135నుంచి 115కు తగ్గాయన్నది దీని సారాంశం. అలాగే యూపీఏ తొలి, మలివిడత పాలనలోని మొదటి మూడేళ్లలో సంభవించిన మరణాల లెక్కలతో ఇప్పటి ప్రభుత్వ పనితీరును పోల్చే ప్రయత్నం కూడా విశేషంగా జరి

భద్రత ఎప్పుడు?

గింది. ఈ లెక్కలు కచ్చితంగా మోదీ ఏలుబడిలో, ప్రభు నాయకత్వంలో రైల్వేశాఖ మెరుగుపడిందన్న అభిప్రాయాన్నే కలిగిస్తాయి. ఈ డేటా సత్యమా, అర్ధసత్యమా, అసత్యమా అన్నది విపక్షాలకు వదిలేస్తే, ఇప్పుడు ప్రభు విడుదల చేసిన డేటాలోనే యూపీఏ తొలి, మలి విడత పాలనలో రైలు ప్రమాదాల సంఖ్యలోనూ, మరణాల సంఖ్యలోనూ తగ్గుదల బాగా కనిపిస్తుంది. రైల్వేవ్యవస్థను సమూలంగా సంస్కరిస్తున్నామని అంటున్నవారు డేటాతో రెండు ప్రభుత్వాలను పోల్చిచూడడం కంటే, ఈ మూడేళ్లకాలంలో సమస్త విభాగాలను ఎంతమేరకు మెరుగుపెట్టారో శ్వేతపత్రం ద్వారా తెలియచెబితే బాగుంటుంది.

కళింగ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం మానవతప్పిదమని అంటున్నారు. ఇది తప్పిదం కాదు, ఘోరమైన నిర్లక్ష్యం. విచారణ కమిటీలు రేపు ఏమిచెప్పినా, ఇద్దరు అధికారుల మధ్య జరిగిన సంభాషణ క్షేత్రస్థాయి నిర్లక్ష్యాన్ని ప్రజలకు తెలియచెప్పింది. ఆ ఆడియో ప్రచారంలోకి రాకపోయివుంటే ఇన్ని తలలు తెగేవి కావు. మరమ్మతు చేపడుతున్నట్టు ఎవరికీ తెలియకపోవడం, రైళ్లరాకపోకలను ఆ మార్గంలో నిలిపివేయకుండా పనులు చేయడం, కనీసం ఎర్ర జెండాలు ఉంచడం వంటి చర్యలు కూడా అక్కడ లేవు. సమాచారం ఇచ్చామని కొందరు, ఇవ్వలేదని మరికొందరు అంటున్నారంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉన్నదో తెలుస్తున్నది. అంతిమంగా రైలు డ్రైవర్‌కు సమాచారం లేకపోవడంతో ఆ ప్రాంతానికి రైలు దూసుకుంటూ వచ్చి ముప్పైమంది ప్రాణాలు తీసింది. యూపీఏ ప్రభుత్వం కంటే అదనంగా మరో 20వేల కోట్లు భద్రతకు ఖర్చుపెడుతున్నామంటున్న ప్రభుత్వం ఇటువంటి నిర్లక్ష్యాన్ని నివారించడానికి ప్రథమంగా కృషిచేయాలి. మానవ నిర్లక్ష్యానికి ఆస్కారంలేని విధంగా వ్యవస్థలను ఆధునీకరణ చేయాలి. రైల్వేసేఫ్టీ అథారిటీని ఏర్పాటుచేయాలనీ, ఇరవైవేలకోట్లతో అత్యాధునిక సిగ్నలింగ్ వ్యవస్థను, మరో 20వేల కోట్లతో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని కాకోద్కర్ కమిటీ ఐదేళ్లక్రితం చెప్పింది. ప్రధానంగా సిబ్బందిమీద పనిభారం పెరిగినందున ఖాళీపోస్టులను భర్తీచేయాలని కూడా సూచించింది. కానీ, రైల్వే బడ్జెట్‌ను విడిగా సమర్పించే వందేళ్ల ఆచారానికి స్వస్తిచెప్పడం, హైస్పీడ్ రైళ్ల గురించి ఆలోచనలు చేయడం, ప్రైవేటు భాగస్వామ్యం పేరిట పలు విభాగాలను వదిలించుకోవడం, స్టేషన్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం మీద ఉన్న శ్రద్ధ క్షేత్రస్థాయి దుస్థితిని సరిదిద్దడం మీద లేకుండాపోయింది. పరిగెడుతున్న రైల్లోకి పిజ్జా ఎగిరొస్తుంది కానీ, చచ్చిన ఎలుకలూ, బల్లులూ లేకుండా సామాన్యులకు తిండి అందించడం కష్టమైపోతున్నది. రైల్వేల పరిస్థితిని కాగ్ కడిగేయక్కరలేదు, కంటికి కనిపిస్తూనే ఉన్నది. డేటాతో తమ సమర్థతను సమర్థించుకుంటున్న పాలకులు గత దశాబ్దకాలంలో అత్యధిక మరణాలు సాధించిన ఏడాది ఇదేనని గుర్తించడం అవసరం. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో జరిగిన 29 ప్రమాదాల్లో 20 పట్టాలు తప్పడం వల్లనే జరిగాయి. ఇప్పటికైనా అవసరమేమిటో, కర్తవ్యమేమిటో పాలకులకు తెలిసొస్తే సంతోషం.

జనవాక్యం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్: editpage@andhrajyothy.com

విద్యా వ్యవస్థలో ప్రమాణాలకేదీ పట్టం?

భారతదేశంలో పాఠశాల విద్య తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. దేశంలో ఒకే ఉమ్మడి పాఠశాల వ్యవస్థను తీసుకురావాలని 1968లోనే కొఠారి కమిషన్ సిఫార్సు చేసింది. 1990లో ఆరంభం నుంచే కొత్త ఆర్థిక విధానాల్లో భాగంగా ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణ చోటుచేసుకుంది. సంపన్నులు పిల్లలను ప్రైవేటు బడులకు పంపుతుంటే, ప్రామాణిక విద్య అందని ప్రభుత్వ బడులకు పేదలు పిల్లల్ని పంపక తప్పని పరిస్థితి ఏర్పడింది. పాఠశాల విద్యలో తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకు పంపని వారు, ఉన్నత విద్యకు వచ్చేసరికి ఐఐటీ, ఐఐయం, ఎన్ఐటీ లాంటి సంస్థల్లో సీట్లు రావాలని కోరుకోవడం విడ్డూరం. మరి అవి కూడా ప్రభుత్వ సంస్థలే. ప్రభుత్వ పాఠశాలలకు పిల్లల్ని పంపని సంపన్నులు, సహజంగానే ఆ బడుల్లో నాణ్యమైన విద్య అవసరాన్ని గుర్తించడం లేదు. అసలు ఆ విషయాన్నే పట్టించుకోవడం లేదు. నవోదయ వంటి పాఠశాలల్లో చదువుకున్నవారూ, సాధారణ కుటుంబాలకు చెందిన కొంతమంది విద్యార్థులూ ప్రముఖ ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు పొందుతున్నారు. వారణాసిలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో ఈ సమస్య మరింత స్పష్టంగా వెల్లడైంది. అలాంటి విద్యార్థులను మెరుగ్గా తీర్చిదిద్దడానికి ప్రభుత్వపరంగా చొరవ చూపడం మంచిది. ఉన్నత విద్యకు సంబంధించి వరల్డ్ ఎకానమిక్ ఫోరం ర్యాంకింగుల్లో 140 దేశాల్లో మన దేశం 81వ స్థానంలో నిలిచింది. నలంద, తక్షశిల వంటి యూనివర్సిటీలు 500ఏళ్ల క్రితమే ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులను ఆకర్షించాయి. అలాంటి భారత విద్యావ్యవస్థ ప్రమాణాల పరంగా ఇంతగా పతనం కావడం జాలి గొలిపే పరిణామమే. ఈ పరిస్థితిని మార్చి, ఇండియాను విజ్ఞానయుత సమాజంగా మార్చడానికి వీలుగా ఉన్నత విద్యావ్యవస్థను తిరిగి పట్టాలెక్కించాల్సిన అవసరం ఉంది.

–శ్రీనివాస్ చిరిపోతుల, వెంకటేశ్వర్లపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

లెక్కతప్పిన ప్రొఫెసర్

ప్రొఫెసర్ హరగోపాల్ 'తెలంగాణాకు ద్రోహం అంటే..?' అన్న శీర్షికతో ఆగస్టు 19న ఆంధ్రజ్యోతి దినపత్రికలో వ్యాసం రాసారు. ఈ వ్యాసంలో కొన్ని పొంతన లేని విషయాలు, కొన్ని అవాస్తవాలు చోటు చేసుకున్నాయి. ఆయనపై గౌరవంతోనే ఈ వివరణ. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రెండు భాగాలుగా విభజించి జూరాల ప్రాజెక్టు నుంచి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఫేజ్–1గా; అలాగే కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని శ్రీశైలం ప్రాజెక్టు నుంచి చేపట్టి దానిని ఫేజ్–2గా అమలు చేయాలని హరగోపాల్ డిమాండ్ చేశారు. ఈ ఫేజ్ –1, ఫేజ్–2 ఏమిటో సాగునీటి శాఖలో పని చేస్తున్న ఇంజనీర్లుగా మాకైతే బోధపడలేదు. ఎందుకంటే ఫేజ్–2 గా అమలు చెయ్యమన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం శ్రీశైలం జలాశయం నుంచే నిర్మాణం అవుతున్నది. దాదాపు పూర్తి కావస్తున్నది. గత సంవత్సరం ఈ ప్రాజెక్టు నుంచి 1.60 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించినాము. 220 చెరువులను నింపినాము. గతంలో ఎన్నడూ లేనంత పంట దిగుబడి వచ్చింది. ఇక ఫేజ్–1 పథకం ఏమిటో మదించి అర్థంచేసుకునే ప్రయత్నం చేసినప్పుడు నారాయణ్ పేట్ – కోడంగల్ ఎత్తిపోతల పథకం గురించి ఆయన ప్రస్తావించి ఉంటారని మాకు తోచింది. నారాయణ్ పేట్ – కోడంగల్ సాగునీటి వసతి లేని దుర్భిక్ష ప్రాంతం కనుక నీరు ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. అయితే ఈ ప్రాజెక్టుకు నీటి లభ్యత ఎక్కడి నుంచి, ఎట్లా చూపించారో గమనిస్తే ఇది గత ప్రభుత్వం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రవేశపెట్టిన పథకం తప్ప నీరిచ్చే పథకం కాదని తెలిసిపోతుంది.

రాజీవ్ భీమా ప్రాజెక్టుకు 20 టీఎంసీల కృష్ణా నికరజలాల కేటాయింపు ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. 2.03 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు జలయజ్ఞంలో భాగంగా రాజీవ్ భీమా ప్రాజెక్టు అప్పటికే ప్రారంభమయ్యింది. ఇప్పుడు దాదాపు పూర్తి అయ్యే దశలో ఉన్నది. ఒక టీఎంసీకి 10 వేల ఎకరాలకు నీరు అందించే విధంగా భీమా ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. 20 టీఎంసీలు 2.03 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి సరిపోతుంది. భీమా ప్రాజెక్టు డ్యూటీని (ఒక టీఎంసీకి సాగయ్యే భూమి) ని 10,000 ఎకరాల నుంచి 15,000 ఎకరాలకు పెంచి 7.10 టీఎంసీల నీటిని సేవింగ్స్ కింద చూపించి నారాయణ్ పేట్ – కోడంగల్ పథకానికి కేటాయించారు. ఆ మేరకు భీమా కేటాయింపులను తగ్గించినారు. 12.90 టీఎంసీల నీటితోనే భీమా కింద 2.03 లక్షల ఆయకట్టు అవసరాలను తీర్చవచ్చునని ప్రతిపాదించినారు. అట్లా భీమా ఆయకట్టు రైతులకు చెందవలసిన 7.10 టీఎంసీల నీటిని నారాయణ్ పేట్ – కోడంగల్ ఎత్తిపోతల పథకానికి కేటాయించారు. భీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మాణమైన భూత్పూర్ జలాశయం నుంచి నారాయణ్ పేట్ – కోడంగల్ ఎత్తిపోతల పథకానికి నీటిని 4 దశల్లో ఎత్తిపోయడానికి ప్రతిపాదనలు తయారుచేసినారు.

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం రీడిజైన్‌లో భాగంగా గత ప్రభుత్వం ప్రతిపాదించినట్లు జూరాల నుండి కాక శ్రీశైలం జలాశయం నుంచే నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వం నిపుణులతో విస్తృతంగా చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకున్నది. ఆ ప్రకారం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. రోజుకు 1.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకోవడానికి, 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి జూరాల జలాశయంలో ఉండే 6 టీఎంసీల నికరనిల్వ సరిపోదని భావించి 215టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన భారీ జలాశయమైన శ్రీశైలంకు మార్చడం జరిగింది. ఈ మార్పుని తెలంగాణ ఇంజనీర్లు అందరూ స్వాగతించినారు. హర్షించినారు.

భీమా రైతులకు అందవలసిన నీటిని వారికి చెందకుండా, ఇటు ఇక్కడి అవసరాలకు సరిపోకుండా రూపొందించిన నారాయణ్ పేట్ – కోడంగల్ ప్రాజెక్టు ప్రతిపాదన అశాస్త్రీయమైనది. గతంలో దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని రూపొందించినప్పుడు ఒక టీఎంసీకి 15,000 ఎకరాలు ప్రతిపాదిస్తే అప్పటి ప్రభుత్వాన్ని ఇదేం అన్యాయమని దుమ్మెత్తి పోసింది మనమే కదా. మరి ఇప్పుడు అటువంటి అశాస్త్రీయమైన ప్రతిపాదనని అమలు చెయ్యమని డిమాండ్ చెయ్యడం సమంజసమేనా? భీమా ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతాంగానికి అన్యాయం చేసిన వాళ్లం కామా? భీమా రైతాంగానికే కాదు నారాయణ్ పేట్ – కోడంగల్ రైతాంగానికి అన్యాయం చేసినట్లు కాదా? ఇప్పటికే జూరాలపై అధిక భారం ఉన్నది. ఈ స్థితిలో మరో ప్రాజెక్టు భారాన్ని మోపడం సమంజసమా? 20 టీఎంసీల వినియోగంతో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి పనులు దాదాపు పూర్తి కావచ్చినాయి. ఈ నేపథ్యంలో నారాయణ్ పేట్ – కోడంగల్ పథకాన్ని అమలు చెయ్యమని డిమాండ్ చెయ్యడం అంటే భీమా రైతాంగానికి, నారాయణ్ పేట్ – కోడంగల్ రైతాంగానికి మధ్య వైషమ్యాలు సృష్టించడమే.



పాలమూరు జిల్లాకు కనీసం ఒక లక్ష ఎకరాల కన్నా ఎక్కువ సాగునీరు రాలేదని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. జూరాల కింద ఒక లక్ష ఎకరాలు, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ కింద 4.5 లక్షల ఎకరాలు నికరంగా సాగు అయినాయి. ఈ నాలుగు ఎత్తిపోతల పథకాల కింద దాదాపు 500 చెరువులు నింపినాము.

పాలమూరు పథకంలో నార్లాపూర్ నుంచి డిండి పేరిట నల్గొండకు నీళ్ళు తరలించే బదులు నాగార్జునసాగర్ నుంచి నీళ్ళు అందించాలని హరగోపాల్ చేసిన డిమాండ్‌ను పరిశీలిద్దాం. దీని వెనుక రాజకీయంగా ముందున్న నల్లగొండ వారు మహబూబ్ నగర్‌కు దక్కవలసిన నీటిని కొల్లగొట్టుక పోతారన్న భయం ఉన్నదనిపిస్తున్నది. డిండి నుంచి నల్లగొండకు నీటిని తరలించడం వలన పాలమూరు ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తాము బలంగా విశ్వసిస్తున్నామని ప్రొఫెసర్ మరో చోట పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు, నాగార్జున సాగర్, నల్లగొండ నియోజకవర్గాల్లోని 14 మండలాల్లో, మహబూబ్ నగర్ జిల్లాలో అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని 5 మండలాల్లో 3.41 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడానికి నక్కలగండి పథకాన్ని తొలుత ప్రతిపాదించారు. ఈ పథకానికి అవసరమయ్యే నీరు 30 టీఎంసీలు. అయితే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పై సమీక్ష జరుగుతున్న సమయంలోనే నక్కలగండి పథకం పై కూడా సమీక్ష జరిగింది. పాత నివేదికలోని ప్రతిపాదనలని కూలంకషంగా ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్షించిన అనంతరం నక్కలగండి ఎత్తిపోతల పథకాన్ని రీడిజైన్ చేయవలసి ఉన్నదని ప్రభుత్వం భావించింది. మహబూబ్ నగర్ జిల్లాకు అన్యాయం చేసి, నల్లగొండ జిల్లాకు లాభం చేకూర్చే పని ప్రభుత్వం చేస్తుందని అనుకోవడం సరి అయిన దృక్పథం కాదు. సాధ్యమైనంత మేరకు నల్లగొండ జిల్లాలోని ప్రాంతాలకు గోదావరి నీటిని అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉదాహరణకు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పాత నల్లగొండ జిల్లాలో ఉండే ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో 2.62 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. నార్లపూర్ నుంచి డిండీ ప్రాజెక్టుకు తరలించే మార్గంలో మహబూబ్ నగర్ జిల్లాలో మరో లక్ష ఎకరాలకు సాగునీరు అందే విధంగా మార్పులు చేసే అధ్యయనం జరుగుతున్నది. ఈ పరిస్థితుల్లో మహబూబ్ నగర్ జిల్లాకు అన్యాయం జరుగుతున్నది అనేది ఒక అపోహ మాత్రమేనని మా భావన.

కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడులాంటి ఇతర పాలమూరు పథకాలన్నింటికీ నీరందించడానికి నెట్టెంపాడు ద్వారా గట్టు హై లెవెల్ కాలువ చేపట్టాలన్న డిమాండ్‌లోని అర్థం పరమార్థం ఏమిటో హరగోపాల్‌కు సమాచారం అందించిన వారికి మాత్రమే అర్థం అవుతుంది. మాకు అర్థమైన సారాంశం ఏమిటంటే గట్టు హై లెవెల్ కాలువ డిమాండ్‌ని ప్రభుత్వం నేరవేర్చే పనిలోనే ఉన్నది. నిర్వాసితులకు (శ్రీశైలం నిర్వాసితులతో సహా) భూమికి భూమి, ఇల్లు, ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలి. ఇది ప్రభుత్వ పాలసీకి సంబంధించిన అంశం. అయితే 2013 పునరావాస చట్టం, తెలంగాణ సవరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు ప్రభుత్వం గతంలో కంటే మెరుగైన పరిహారం ఇస్తున్నది. కృష్ణా బేసిన్‌లో ఉండే తెలంగాణ ప్రాజెక్టులకు నికరజలాల కేటాయింపులు పెరగాలంటే రాష్ట్రంలో జలాల పునఃపంపిణీ జరగాలని ఆనాడు మనం భావించాం. రాష్ట్రం విడిపోయిన తర్వాత 299 టీఎంసీల నీటినే పునఃపంపిణీ చెయ్యమనడం యాంత్రికమైన డిమాండ్. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే కృష్ణా జలాల పునఃపంపిణీ నాలుగు రాష్ట్రాల మధ్య జరపాలని ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. గత రెండు ట్రిబ్యునళ్ల కేటాయింపుల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. సంవత్సరం లోపల కేంద్రం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో సుప్రీం కోర్టులో అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాద చట్టం సెక్షన్ 3 ప్రకారం నాలుగు రాష్ట్రాల మధ్య పునఃపంపిణీ కోసం ట్రిబ్యునల్ ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేసింది. ఆ కేసు కొనసాగుతున్నది. ఈ లోపు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సెక్షన్ 89 ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జాలాల పంపిణీ జరపాలని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్రం నివేదించింది. ట్రిబ్యునల్‌లో కూడా విచారణ కొనసాగుతున్నది. కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 450 నుంచి 500 టీఎంసీల నీటిని పొందడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. అది సాకారం అయితే పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రాజెక్టులకు నికర జలాలను కేటాయించుకోవడం సాధ్యపడుతుంది.

ఇకపోతే ప్రొఫెసర్‌గారు వ్యాసంలో ఒక చోట పాలమూరు జిల్లాకు కనీసం ఒక లక్ష ఎకరాల కన్నా ఎక్కువ సాగు నీరు రాలేదన్నారు. ప్రొఫెసర్ గారి లెక్క తప్పిందని చెప్పడానికి సాహసిస్తున్నాము. జూరాల కింద ఒక లక్ష ఎకరాలు, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ కింద 4.5 లక్షల ఎకరాలు నికరంగా సాగు అయినాయి. ఈ నాలుగు ఎత్తిపోతల పథకాల కింద దాదాపు 500 చెరువులు నింపినాము. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం మహబూబ్ నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, అధికారులను, కాంట్రాక్టర్లను డ్రైవ్ చేసి పూర్తి చేసినందువల్ల, మిషన్ కాకతీయలో చెరువులను బాగు చేసుకున్నందువల్ల మొత్తం 5.5 లక్షల ఎకరాలకు గత సంవత్సరం నికరంగా సాగునీరు అందించడం సాధ్యమయ్యింది. వీటి ఫలితాలు జిల్లాలో గత సంవత్సరం పంట దిగుబడితో రైతుల అనుభవంలోకి వచ్చాయి. చెరువుల్లో, కాలువల్లో నీరు రావడంతో జిల్లాలో ఒక స్పష్టమైన సామాజిక, ఆర్థిక మార్పు కనబడుతున్నది. తెలంగాణ ప్రభుత్వం మహబూబ్ నగర్ జిల్లా సాగునీటి కష్టాలని తొలగించడానికి కృతనిశ్చయంతో ఉన్నది. మూడు నాలుగు సంవత్సరాల్లో పాలమూరు జిల్లాలో పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ , జూరాల, ఆర్డీఎస్, తుమ్మిళ్ళ, గట్టు, చిన్న నీటి చెరువుల కింద మొత్తం 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇది తెలంగాణలో ఏ జిల్లాతో పోల్చి చూసినా అత్యధికం అనడానికి సందేహించనక్కరలేదు.

■ **శ్రీధర్‌రావు దేశ్‌పాండే** (కో ఛైర్మన్)
సల్లా విజయ్‌కుమార్ (సెక్రెటరీ)
తెలంగాణా ఇంజనీర్స్ జేఏసీ

సందర్భం



■ కె. శ్రీనివాస్

పాతికేళ్ల తరువాత మరోసారి...

అప్పుడే పాతికేళ్లయిందా అనిపిస్తున్నది. అప్పటికి తొలి ప్రదర్శనకు వందేళ్లు పూర్తి చేసుకున్న ఒక తెలుగునాటకం మరో పాతికేళ్ల తరువాత కూడా ప్రేమపూర్వక స్మరణకు, కృతజ్ఞతకు పాత్రం కావడం ఆశ్చర్యం గానూ ఉన్నది. గురజాడ అప్పారావు నాటకం 'కన్యాశుల్కం'ను మొదటిసారి 1892లో విజయనగరంలో 'జగన్నాథ విలాసినీ సభ' వారు ప్రదర్శించారు. ప్రథమ ప్రదర్శన శతవార్షికోత్సవాలను ఏడాది పాటు నెలనెలా 13 వ తేదీన నిర్వహించిన 'వెలుగు' సంస్థ 1992 ఆగస్టు 11, 12, 13 తేదీలలో ముగింపు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున జరిపింది. తెలుగు సాహిత్య కార్యక్రమాల కోవలో అత్యంత అరుదైన, అపురూపమైన ఉత్సవాలు అవి. ఆ సంరంభాన్ని ఆంధ్రజ్యోతికి రిపోర్టు చేయడానికి ప్రత్యేకంగా విజయవాడ నుంచి వెళ్లే అవకాశం నాకు దొరికింది.

తెలుగునేల మూలమూలల నుంచి రచయితలు, కవులు విజయనగరాన్ని ముంచెత్తారు. అప్పటికింకా ఏ ఆదరణా లేకుండా శిథిలంగా ఉండిపోయిన గురజాడ నివాసగృహం మేడ మీద సాహిత్యసభల్లో పాల్గొనడం ఒక ప్రత్యేకమైన అనుభవం. గురజాడకు నిత్యవ్యాఖ్యాతగా ఉండిన కె.వి. రమణారెడ్డిని గురజాడ ఇంట్లో చూడడం, వినడం ఒక అద్భుతం. అప్పుడే, విజయనగరం కథల గురువు చాసోను మిత్రుడు రాజీవ్ వెలిచేటితో కలిసి ఇంటర్వ్యూ చేశాను. ఎప్పుడో చదివిన పాతకథల రచయిత సోమంచి యజ్ఞన్నశాస్త్రిని అక్కడే చూశాను. 13వ తేదీన విజయనగరం వీధుల్లో రాచకొండ విశ్వనాథశాస్త్రి, పూసపాటి కృష్ణంరాజు, కాళీపట్నం రామారావు, శివారెడ్డి, ఓల్గా, ఇంకా అనేక మంది రచయితలతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నాను. ఆధునిక స్త్రీ చరిత్రను పునర్లిఖిస్తుంది అన్న గురజాడ మాటలను ప్లకార్డుపై నినాదంగా చూసి మురిసిపోయిన సందర్భం అది.

మరి మూడునెలల కాలానికి గురజాడ జయంతి సందర్భంగా, కన్యాశుల్కం 13 గంటల పూర్తి నిడివి నాటకాన్ని విజయనగరంలోనే ప్రదర్శించినప్పుడు, దాన్ని వీక్షించే అవకాశం కూడా దక్కింది. 'సాయంకాలమైంది నుంచి తెల్లారేదాకా' అంటూ, ఆ నాటక ప్రదర్శనపై ఆంధ్రజ్యోతి సాహిత్యవేదికలో సుదీర్ఘమైన నివేదిక రాశాను కూడా.

ఒక రచన తెలుగుసమాజం మీద గాఢమైన ప్రభావం వేయడం, ఆ ప్రభావాన్ని కాపాడుకుంటూ ముందుకు వెళ్లడం చిన్న విషయాలు కావు. ఒక రచయితనీ, అతని రచనలనీ నిరంతరం కొత్తగా అర్థం చేసుకోవడం, అతని భాష, పలుకుబడి, ఉటంకింపులు సాహిత్య, పత్రికాభాషల్లో భాగం కావడం, సాహిత్యస్పర్శ ఉన్న సమూహాల సంభాషణల్లో కూడా సర్వసాధారణంగా వినిపించడం అరుదైన ప్రత్యేకతలు. ప్రజాస్వామిక భావాలు, వాస్తవికతలోని అనేక పార్శ్వాలను విమర్శనాత్మకంగా వ్యాఖ్యానిస్తూ ఆధునికతలో సంలీనం చేయడం గురజాడను అనేక తరాలకు సమకాలీనుడిని చేశాయి.

సరిగ్గా కన్యాశుల్కం శతజయంతి సంరంభం జరుగుతున్న సమయంలోనే 'కన్యాశుల్కం ఎందుకు చదవాలి' అన్న చర్చ మొదలయింది. అప్పటికే దళిత, బహుజనవాదాల వైపు మరలిన బి.ఎస్. రాములు ఆ పేరుతో ఒక పెద్ద వ్యాసాన్ని రాశారు. కన్యాశుల్కం అందరికీ సంబంధించిన రచన కాదని, అందులో అనేక సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం లేదని, ప్రాబల్యవర్గాల సాహిత్య ఆధిపత్యం వల్లనే ఆ రచనకు బ్రహ్మరథం పడుతున్నారని రాములు విమర్శించారు. సమాజంలోను, సాహిత్యంలోను వీస్తున్న కొత్తగాలులతో పరిచయమూ, సంఘీభావమూ ఉన్నప్పటికీ, నాకు బి.ఎస్.రాములు వాదన షాకింగ్‌గా అనిపించింది. ఆయనతో నేను లేఖావ్యాసాల రూపంలో సుదీర్ఘంగా చర్చించాను కూడా. ఆ నాటి చర్చ ఫలితంగా, కన్యాశుల్కాన్ని కొత్త దృష్టితో చూడవలసిన అవసరం కనిపించింది.

గురజాడ కానీ, ఆయన రచనలు కానీ వివాదరహితమైనవి కావు. విప్లవోద్యమం తొలినాటి ఉధృతిలో, విగ్రహవిధ్వంసన స్ఫూర్తితో, గురజాడ, కందుకూరి మొదలైనవారి రాజకీయవైఖరు



అజ్ఞానం, లౌల్యం, స్వార్థం, భయం, కాపట్యం, విషాదం ఇవన్నీ ఒక చారిత్రిక విభాత సంధ్యలో ఎట్లా వ్యక్తమయ్యాయో చెప్పింది కన్యాశుల్కం నాటకం. పాతికేళ్ల కిందట నాకు అర్థమయిన గురజాడ కన్యాశుల్కం వేరు. ఇప్పుడు అర్థమయ్యేది వేరు. నాతో పాటు, మీతోపాటు అది కూడా మారుతూ వస్తున్నది. వర్తమానంలో నూటపాతికేళ్లు జీవించిన నాటకం, చరిత్రగా వేల ఏళ్లు జీవించగలదు.

లపై తీవ్రవిమర్శలే వచ్చాయి. వలసపాలకులపై సంఘసంస్కర్తలకు ఉండిన సదభిప్రాయం, ఆరాధన ఆ విమర్శలకు ప్రధాన ప్రాతిపదికలు. ఇక సంప్రదాయ శిబిరం నుంచి గురజాడ కవి కాదని, కన్యాశుల్కం నాటకం కాదని, అసలు ఆయన నాటకకర్తే కాదని రకరకాల వాదాలు వచ్చాయి. వీటన్నిటిని తట్టుకుని కూడా గురజాడ, ఆయన రచనలు నిలబడగలిగాయి. సామాజికమైన తీవ్ర విమర్శ ముందు గురజాడ నిలబడతాడా అన్నది ఆనాటి ప్రశ్న. తరువాతి కాలంలో తెలంగాణవాదం వచ్చిన తరువాత కూడా గురజాడ వైతాళికత్వం ప్రశ్నలను ఎదుర్కొన్నది. ప్రశ్నలన్నీ మంచివే. అవి చూపును విశాలం చేస్తాయి. మన దృష్టిని లోతులకు తీసుకువెడతాయి.

మనుషులందరూ చరిత్ర సృష్టించిన వ్యక్తులే. మానవ ప్రమేయంతో చరిత్ర నిరంతరం తనను తాను సవరించుకుంటూ ఉంటుంది. వ్యక్తిగత అభిమానాల కంటె, చరిత్ర నిగ్గుదేలిన వ్యక్తిత్వాలే మిగులుతాయి. ఆ కాలంలో జరిగిన అనేక చర్చల మాదిరిగానే గురజాడ మీది చర్చ కూడా తెలుగు సాహిత్య చరిత్ర గురించి స్థిరపడిన అంచనాలను పునస్సమీక్షించుకోవడానికి కారణమయింది. భిన్న అస్తిత్వాలున్న తెలుగు సమాజానికి, లేదా, అనేక సమాజాలుగా ఉన్న తెలుగువారికి ఒకే చరిత్ర, ఒకే సాహిత్యచరిత్ర, ఒకే కోవలోని వైతాళికులు అసాధ్యమన్న గ్రహింపు కూడా వచ్చింది. గురజాడ వారసత్వాన్ని ఆవాహన చేసుకుని, ఎదిగి వచ్చిన సాహిత్య స్రవంతులు కానీ, ఆయన ఆధునికతను, ప్రజాస్వామ్యభావాలను ప్రేరణగా తీసుకుని పైపైకి వెళ్లిన సామాజికార్థిక వర్గాలు కానీ అనంతర కాలంలో ప్రశ్నలను ఎదుర్కొనడానికి ఆయా శ్రేణుల మధ్య ప్రయోజనాల వైరుధ్యం ఏర్పడడమే కారణమనుకోవాలి. నిజానికి గురజాడ ఏ ప్రాంతానికి చెందినవాడో ఆ ప్రాంతానికి, ఆయన వారసత్వాన్ని అమితంగా సొంతం చేసుకున్నవారికీ నడుమ కూడా వైరుధ్యం ఉన్నది.

గురజాడ అప్పారావుకు ముందూ వెనుకా చేర్చే విశేషణాలను నిరాకరించినా, అప్రధానం చేసినా కూడా, ఆయన రచనలలోని పాఠ్యం మిగిలే ఉంటుంది. ఆ పాఠ్యంలో కూడా విస్మరణలూ, పాక్షికతలూ ఉండవచ్చు. కానీ ఆయన కవిత్వం, కథలు, నాటకాలు వ్యక్తం చేసిన వాస్తవికత, అందులో ఆయన ప్రతిభావంతంగా దర్శించిన వైరుధ్యాలూ తెలుగుసాహిత్యానికి విశేషమైనవి. ఆంగ్లేయపాలన తీసుకువచ్చిన కొత్త పరిస్థితులతో, సంప్రదాయ వాతావరణం ఘర్షణ పడుతూ, ఒదిగిపోతూ ఉన్న కాలం అది. సంప్రదాయ శిష్ట వర్గం నుంచే ఆధునిక ప్రాబల్య వర్గం రూపొందుతున్న సందర్భం. ఆచారాలు, సంప్రదాయాల విషయంలో ఆ వర్గం నిష్ఠను వదిలిపెట్టి లౌక్యాన్ని ఆశ్రయించింది. గిరీశం రాబోతున్న యుగం దూత. అతనికీ అగ్నిహోత్రావధాన్లుకీ పెద్ద తేడా లేదు. ఇంట్లో విధవ కూతురును పెట్టుకుని కూడా చిన్న కూతురును ముసలివాడికి కట్టబెట్టాలనుకున్న ఆ ఆచారమంతుడికి, కొడుకు వల్లెవేసే ఇంగ్లీషు ముక్కలంటే ఎంతో మురిపెం. ధర్మాన్నీ, కులం నిర్దేశించిన వ్యక్తిత్వాలను ఇంగ్లీషు పోలీసు వ్యవస్థకు, న్యాయవ్యవస్థకు లోబరచడానికి వారికి ఏ అభ్యంతరమూ లేదు. లిటిగెంటు రామప్పపంతులు అగ్రహారానికీ, కోర్టుకీ దళారీ అయితే, గిరీశం సంస్కారం పేరుతో స్వార్థం చూసుకునే జులాయి. ఈ మొత్తం రంగస్థలాన్ని తునాతునకలు చేయడానికి గురజాడ మధురవాణిని ఉపయోగించుకున్నాడు. దేనికీ కట్టుబాటు లేని, ఏ నైతికతా లేని మనుషులను మధురవాణి ప్రతి తుళ్లింతా, ప్రతి నవ్వూ నగ్నం చేశాయి. పాత్రలూ పాత్రధారులూ కాదిక్కడ, అజ్ఞానం, లౌల్యం, స్వార్థం, భయం, కాపట్యం, విషాదం ఇవన్నీ ఒక చారిత్రిక విభాత సంధ్యలో ఎట్లా వ్యక్తమయ్యాయో చెప్పింది కన్యాశుల్కం నాటకం. గురజాడ కాలంతోను, నాటి స్థానిక చారిత్రక పరిస్థితులతోను, పాత్రధారుల నేపథ్యాలతోను పరిచయమో, మమేకత్వమో ఉండనవసరం లేదు. ఆయా నిర్దిష్టతలనుంచి వ్యక్తమవుతున్న సర్వసామాన్య విలువలు కూడా ముఖ్యమే.

ఏ కిరీటమూ అక్కరలేదు, ఏ యుగకర్తృత్వమూ అవసరం లేదు. గురజాడ పేరుతో ఏ ఆధిపత్యాలనూ స్థిరపరచనక్కరలేదు. ఒక రచనగా దానికి ప్రాసంగికత ఉన్నది. దాని నుంచి నేర్చుకునేదీ ఇంకా ఉంటూనే ఉన్నది.

పాతికేళ్ల కిందట నాకు అర్థమయిన గురజాడ కన్యాశుల్కం వేరు. ఇప్పుడు అర్థమయ్యేది వేరు. నాతో పాటు, మీతోపాటు అది కూడా మారుతూ వస్తున్నది. వర్తమానంలో నూటపాతికేళ్లు జీవించిన నాటకం, చరిత్రగా వేల ఏళ్లు జీవించగలదు. ■


విప్లవ విజ్ఞుడూ వేదవిదుడూ

అర్థ శతాబ్దానికిపైగా దాశరథి రంగాచార్య సుదీర్ఘ సాహిత్య జీవితం విభిన్నంగా సాగింది. ఉత్తర దక్షిణ ధ్రువాలుగా ఉండే సంప్రదాయవాదం, మార్క్సిస్టు సిద్ధాంతాలు రంగాచార్య రచనల్లో సహజీవనం చేశాయి. నిరుపమానమైన రచనాశక్తితో ఆయన ఉభయవర్గాలను సమంగా మెప్పించగలిగారు. సంప్రదాయ సాహిత్యాన్ని మార్క్సిస్టు దృక్పథంతో వ్యాఖ్యానించి, భారతీయ తాత్త్వికతకు కొత్త ఊపిరులూదారు. కాల్పనిక, ఆధ్యాత్మిక రచనలు, భిన్న ప్రక్రియల్లో సాహితీ సృజన చేసినా, రంగాచార్య జీవితమంతా ఒకే సైద్ధాంతిక దృక్పథంతో సాగింది. ఇంత సుదీర్ఘ కాలం ఒకే దృక్పథంతో రచనలు చేసిన ప్రముఖ రచయితలు అరుదుగా కనిపిస్తారు.

రంగాచార్య సంప్రదాయంలో పుట్టారు. విప్లవంలో పెరిగారు. మార్క్సిస్టు సిద్ధాంతాలను ఒంటబట్టించుకున్నారు. మార్క్సిస్టు సిద్ధాంత పరిచయంతో, వర్ణ వ్యవస్థ ముసుగులో దాగిఉన్న భారతీయ సంప్రదాయ సాహిత్యం బోధించే సర్వమానవ శ్రేయస్సును అర్థంచేసుకున్నారు. తొలినాళ్లలో ఆయన కమ్యూనిస్టుగా సంప్రదాయ సాహిత్యాన్ని వ్యతిరేకించినా, తర్వాతి రోజుల్లో సంప్రదాయ సాహిత్యపు గొప్పదనాన్ని, అది కాంక్షించే విశ్వమానవ శ్రేయస్సునూ అర్థం చేసుకోగలిగారు. అలాగని మార్క్సిస్టు దృక్పథాన్ని వదులుకోలేదు. మార్క్సిస్టు దృక్పథంతోనే సంప్రదాయ సాహిత్యాన్ని ఒక నూతన దృక్కోణంతో దర్శించారు. మార్క్సిజంలోని వర్గదృష్టిని, సంప్రదాయంలోని వర్ణ దృష్టిని త్యజించి, విశ్వమానవ శ్రేయస్సును తన రచనలకు లక్ష్యంగా మార్చుకున్నారు.

విప్లవం నుంచి వేదం దాక సాగిన రంగాచార్య సాహిత్య ప్రస్థానాన్ని పరిశీలించినప్పుడు ఆయనలోని మార్క్సిస్టు దృక్పథాన్ని, తాత్త్విక చింతనను, వాటి ఆధారంగా ఆయన ప్రతిపాదించిన మానవతను ఎవరూ ప్రశ్నించే సాహసం చేయరు. కానీ, మార్క్సిస్టు దృక్పథం కలిగిన ఒక రచయిత, మానవుల మధ్య దేశ, భాష హద్దులు లేకుండా సర్వ మానవ శ్రేయస్సును, విశ్వజనీన మానవతను సాధించడం ఒక్క భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యం ద్వారా మాత్రమే సాధ్యమని నమ్మడం, ఆ సాహిత్యాన్ని అనువదించి ప్రచారం చేయడం అభ్యుదయ దృక్పథమా? కాదా? అనే సందేహం మాత్రం అందరి మెదళ్లను తొలుస్తుంది. అభ్యుదయవాదులు ఇది అభ్యుదయ దృక్పథం కాదనీ, సంప్రదాయ సాహిత్యంపై అభిమానం ఉండేవారు ఇది ఘంటాపథంగా అభ్యుదయ దృక్పథమని అంటారు.

రంగాచార్యకు మార్క్సిస్టు అవగాహన పుష్కలంగా ఉంది. భారతీయ తాత్త్వికచింతనపై పరిపూర్ణమైన అవగాహన, విశ్వాసం ఉంది. అయితే ఆయనకు భారతీయ తాత్త్వికతపై విశ్వాసం పెంపొందించింది మార్క్సిస్టు జ్ఞానమే. రంగాచార్యకు మార్క్సిస్టు పరిజ్ఞానమే లేకపోతే, భారతీయ తాత్త్వికతను, సాహిత్యాన్ని గుడ్డిగా అనుసరించడమో, వ్యతిరేకించడమో చేసేవారు. ఎందుకంటే ఉద్యమంలో ప్రవేశించిన తొలినాళ్లలో సంప్రదాయ సాహిత్యంపై విముఖత ఏర్పరుచుకున్నారు. కానీ మార్క్సిస్టు జ్ఞానం అలవడిన తర్వాత తప్పును తెలుసుకున్నారు. అయితే మార్క్సిజం, సంప్రదాయాల అంతస్సారం, అంతిమ లక్ష్యం మానవ శ్రేయస్సే. తమ లక్ష్య సాధనకు మార్క్సిజం వర్గవాదాన్ని ఆశ్రయిస్తే, సంప్రదాయం భక్తి మార్గాన్ని ఆశ్రయించింది. దురదృష్టవశాత్తు ఈ రెండూ అంతిమ లక్ష్యం మానవతను మరుగున పడేశాయి.



దాశరథి రంగాచార్య

'హిందూ మత గ్రంథాలు భారత సమాజంలో సర్వత్రా వర్ణ దృష్టిని నింపివేసినై. మార్క్సిస్టు గ్రంథాలు వాటి గాలి సోకినంత వరకు వర్గ దృష్టిని నింపివేసినై. రెండూ మనుషుల్ని ముతాలుగా చీల్చివేసినై. మనం మనిషిని మనిషిగా చూడాలంటే వర్ణదృష్టితోపాటు, వర్గదృష్టి త్యజించాలి' అంటారు రావిపూడి వెంకటాద్రి. రంగాచార్య అదే చేశారు. ఆయన మార్క్సిజం, వర్గవాదం నేపథ్యంతో నవలలు రాసినా, అందులో వాటి పాత్రను మితిమీరి వర్ణించే ప్రయత్నంచేయలేదు. అన్నింటా మానవతకే ప్రాధాన్యత ఇచ్చారు. రంగాచార్య తాత్త్వికతకు, మతానికి సంబంధం లేదని గ్రహించారు. అందుకే నవలల్లో కూడా భగవద్గీతను, వేదాలను, రామాయణ, భారత కథలను ప్రస్తావించగలిగారు. గీత చేసే ప్రబోధం మతపరమైనది కాదనీ, అది జీవిత విధానానికీ జీవిత తాత్వీకరణకు సంబంధించినదని గ్రహించిన అతికొద్దిమంది రచయితల్లో రంగాచార్య ఒకరు.

వర్ణ దృష్టిని తొలిగించి సంప్రదాయ సాహిత్యాన్ని మరోమారు అధ్యయనం చేశారు రంగాచార్య. ఆయనకు భారత తాత్త్వికత చాలా ఉన్నతంగా దర్శనమిచ్చింది. తాను దర్శించిన తాత్త్వికతను తన దృక్పథంతో పాఠకులకు అందించారు. భారతీయ తాత్త్వికత– పాపం, పుణ్యం, ధర్మం, అధర్మాల పేరుతో మానవుని మనీషిగా చేసేందుకు ప్రయత్నించింది. ఆధునిక శాస్త్రవేత్తల ప్రయత్నాలు కూడా ఆ పురుషార్థాలకు ఆ శక్తి ఉందని నిరూపిస్తున్నాయి. నేటి మనస్తత్త్వ శాస్త్రజ్ఞులు వ్యక్తి స్వధర్మాన్ని గుర్తెరగటమే అతని మనస్తత్త్వానికి కీలకమైన విషయంగా భావిస్తున్నారు. అది ఎరక్కపోవడమే అతని క్లేశానికి కారణం అంటున్నారు. రంగాచార్య సంప్రదాయ సాహిత్యం ఉద్దేశం కూడా ఇదే. అయితే ఆయన సంప్రదాయ సాహిత్యాన్ని, ఆనాటి సమకాలీన పరిస్థితులు, నేటి పరిస్థితుల నేపథ్యంలో వివరిస్తూ దాని గొప్పదనాన్ని, నేటి వ్యవస్థకు దాన్ని అవసరాన్ని నిరూపించే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో ఆయన పూర్తిగా సఫలీకృతుడయ్యాడు.

ఏ విప్లవమైనా, ఉద్యమమైనా, సిద్ధాంతమైనా, లోకంలో తలెత్తే మరే అంశమైనా మానవునికి న్యాయం జరగాలన్న తలంపుతోనే బయల్దేరుతుంది. మానవుని శ్రేయస్సును కాంక్షిస్తుంది. అయితే రంగాచార్య ప్రపంచ మానవుల శ్రేయస్సు కోసం భారతీయ తాత్త్వికతను ఆధారంగా చేసుకున్నారు. వేల సంవత్సరాలుగా భారతీయులను ఏకతాటిపై ఐక్యంగా నిలిపింది, మనమనుకుంటున్న సనాతన ధర్మమే. అయితే విదేశీయుల పాలనతో భారతీయ తాత్త్వికత అంధకారంలోకి నెట్టివేయబడింది. దాన్ని మరలా చైతన్యవంతం చేసే ప్రయత్నం చేశారు రంగాచార్య. కేవలం సంప్రదాయ గ్రంథాల రచన, అధ్యాత్మిక చింతన, దేవుడిపై విశ్వాసం ఉన్నంత మాత్రాన అది అభ్యుదయం కాదని చెప్పలేం. రష్యన్ విప్లవంలో కూడా తజికిస్థాన్ ప్రాంతంలో ముస్లిం రైతులు అల్లా పేరుతోనూ, ఖురాన్‌పేరుతోనూ జమీందారులపై తిరుగుబాటు చేశారు. భూమిని పంచుకున్నారు. ఆ ముస్లిం రైతులకు మతంపైనా, అల్లాపైనా విశ్వాసంఉంది కాబట్టి అది అభ్యుదయం కాదనటం పొరపాటని అంటారు ప్రసిద్ధ మార్క్సిస్టు విమర్శకులు మద్దుకూరి చంద్రశేఖరరావు. అభ్యుదయ దృక్పథమంటే అనుక్షణం అభివృద్ధి కాముకమైన ఉన్నతస్థాయిని చేరుకోవడానికి ప్రయత్నించడమే. రంగాచార్య రచనలన్నింటా మనిషి ఉన్నత స్థాయిని చేరుకోవాలనే ప్రయత్నం కనిపిస్తుంది. అందుకే, రంగాచార్యది మార్క్సిజం, సంప్రదాయం, మానవత కలగలిసిన అభ్యుదయ దృక్పథమని, విప్లవం నుంచి వేదం దాకా సాగిన ఆయన సాహిత్య జీవిత ప్రస్థానం పురోగమనం దిశగా సాగిందని ఘంటాపథంగా చెప్పవచ్చు.

■ **డాక్టర్ వి. జయప్రకాష్**

(నేడు దాశరథి రంగాచార్య జయంతి)



ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మాలమహానాడు ధర్నాలో అభివాదం చేస్తున్న స్వామి అగ్నివేశ్

దళితులపై దాడులు అప్రజాస్వామికం

- మాలమహానాడు ధర్నాలో అగ్నివేశ్

న్యూఢిల్లీ: దళితులపై దాడులు అప్రజాస్వామికమని స్వామి అగ్నివేశ్ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో దళితులపై జరుగుతున్న అన్యాయాలను నిరసిస్తూ జంతర్ మంతర్‌లో తెలంగాణ మాల మహానాడు బుధవారం చేపట్టిన నిరసనలో మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లు గడుస్తున్నా సామాజిక న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ పోలీసుల నిర్లక్ష్యం వల్ల దాడుల పెరుగుతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వీటిపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర విభజన తర్వాత దళిత, గిరిజన, మైనారటీలపై దౌర్జన్యాలు మరిన్ని పెరిగాయని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ నాయకుడు కొప్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణతోనే వర్గీకరణ సాధ్యం: మందకృష్ణ



నాగర్‌కర్నూల్ అర్బన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత రావాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అభిప్రాయపడ్డారు. నాగర్‌కర్నూల్‌లో బుధవారం మా ట్లాడుతూ ఉద్యమాల ఫలితంగా సాధించిన తెలంగాణ రాష్ట్రంలో దళితులను అణగతొక్కే ధోరణితో కేసీఆర్ పాలన సాగుతోందని ఆరోపించారు. రాజ్యాధికారంతోనే దళితుల బతుకుల బాగుపడతాయని అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి, మాట తప్పిన కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

విద్య కోసం భారీ నిధులు

పర్వతగిరి పర్యటనలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

- యంఆర్ టీకా వేయించుకోవాలి
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి
- ప్రతిపక్షాల చేతిలో కీలుబొమ్మ కోదండరాం
- వేణుగోపాలచారి
- చెరకు రైతుల

రుణామాఫీ అందేలా చూస్తా: ఎంపీ కవిత

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: విద్యను ఆధునికీకరించడానికి ఎన్ని నిధులనైనా కేటాయిస్తామని, దానిలో భాగంగానే సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు 525 గురుకులాలను ఏర్పాటు చేశామని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. బుధవారం వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరిలో మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో వసౌలిక వసతులను కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. 15 సంవత్సరాల్లోపు చిన్నారులకు తట్టు, రుబెల్లా లాంటి ప్రాణాంతక వ్యాధులు సోకకుండా ఉండేందుకు యంఆర్ టీకా వేయించాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్‌లో తట్టు, రుబెల్లా టీకా వేసి మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి వేణుగోపాలచారి మాట్లాడుతూ సన్న బియ్యంతో భోజనం అందించి ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యాబోధన చేస్తున్నదన్నారు. ఉద్యమాల కోసం జేఏసీ అధ్యక్షుడిగా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరాం ప్రస్తుతం ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనకు ఆజ్యం పోస్తున్నారని వేణుగోపాలచారి ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలతో పాటు కోదండరాంకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కోటి ఎకరాలకు నీరందించేందుకు మల్లన్న సాగర్ ప్రాజెక్టును చేపట్టగా అక్కడ వాస్తవ పరిస్థితులను చూసి కిమ్మనకుండా ఉన్నారని, కాళేశ్వరం గోదావరి నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా 16లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు స్థిరికరించగా దీనిని రాజకీయం చేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా అభివృద్ధి పథకాల అమలులో కేంద్ర ప్రభుత్వం నుంచి 17 అవార్డులు తెలంగాణ ప్రభుత్వం అందుకొని ఆదర్శంగా నిలిచిందన్నారు. కోదండరామ్‌కు ప్రతిపక్షాలతో లోపాయికారి ఒప్పందం మానుకొని ఆయన హుందాతనానికి తగినట్లు వ్యవహరించాలన్నారు. నిజాంషుగర్స్ పరిధిలోని చెరకు రైతులకు రుణమాఫీ కింద అందాల్సిన కోటి 25లక్షల రూపాయలను త్వరలో అందేలా చూస్తానని ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. బోధన్ మండలం మండలంలోని సాలూరలో మన ఊరు-మన ఎంపీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ గురించి సీఎం స్థాయిలో తాను వివరించానని ఆర్థికశాఖ నుంచి నిధులు మంజూరు కాగానే రైతులకు అందేలా చూస్తామన్నారు.



పర్వతగిరిలో అధికారులతో మాట్లాడుతున్న కడియం

విక్రయానికి సబ్సిడీ గొర్రెలు

- మహబూబాబాద్ జిల్లాలో పట్టివేత
- సిద్దిపేట జిల్లాలోనూ దళారుల అక్రమాలు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న గొర్రెల పథకం గాడి తప్పుతున్నది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని మహమూద్‌పట్నంలో సబ్సిడీపై పంపిణీ చేసిన గొర్రెలను బుధవారం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు. తొగరి నవీన్, ఐలయ్య,యాకబోయిన వెంకన్నలకు సబ్సిడీకింద మూడు యూనిట్ల గొర్రెలు అందాయి. ఈ యూనిట్లలోని 60 గొర్రెలను జత రూ.7వేల చొప్పున రూ.2,10,000లకు సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన శ్రీశైలంకు విక్రయించారు. గొర్రెలను వాహనంలో ఎక్కించుకుని వెళుతుండగా పోలీసులు గ్రామ శివారులోని మూడావత్‌తండా వద్ద పట్టుకున్నారు. కాగా, సిద్దిపేట జిల్లాలోనూ సబ్సిడీ గొర్రెల మాయాజాలం జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం.. ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల్లో రూ. 1.25లక్షలు చెల్లించి 21 గొర్రెలను యూనిట్‌గా కొనుగోలు చేసి ఇక్కడి రైతులకు సబ్సిడీగా అందిస్తున్నది. అయితే.. ఇతర రాష్ట్రాల దళారులు కొత్త ఎత్తులతో.. తెలంగాణలోని ఇతర గొర్రెల పెంపకందారుల వద్దకు వచ్చి గొర్రెలను బేరమాడుతున్నారు. మొత్తం 21 గొర్రెలను ఒక యూనిట్‌గా చేసుకొని అక్రమ వ్యాపారానికి శ్రీకారం చుట్టారు. మొత్తంగా రూ. 85 వేల నుంచి 90 వేల వరకు యూనిట్ గొర్రెలను కొనుగోలు చేసి ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తున్నారు. మళ్లీ అవే గొర్రెలను తెలంగాణ నుంచి వెళ్లిన గొర్రెల కాపరులకే రూ. 1.25లక్షలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, కొండపాక మండలాల్లో దళారులు రంగ ప్రవేశం చేసినట్లు ఆధారాలున్నాయి. కాగా, రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాల్మాకుల గ్రామంలో దాదాపు 14 సబ్సిడీ గొర్రెలు మృతి చెందినట్లు తెలుస్తోంది. అయితే.. 7 గొర్రెలు చనిపోయినట్లు సమాచారం ఉందని పశువైద్యాధికారిణి సురేఖ తెలిపారు. లబ్ధిదారులు ఒకేచోట ఎక్కువ మొత్తంలో గొర్రెలను ఉంచడంతోపాటు మేకలను కూడా గొర్రెల మందలో ఉంచడం వల్ల మేకలకు వచ్చే వ్యాధులు గొర్రెలకు సోకడంతో అవి చనిపోయాయని చెప్పారు.



సిద్దిపేట జిల్లా చేర్యాల నుంచి ఆంధ్రాకు తరలుతున్న గొర్రెలు

శంషాబాద్‌లో రూ.30 లక్షల గంజాయి పట్టివేత

- ఐదుగురి అరెస్టు.. పరారీలో మరో ముగ్గురు

శంషాబాద్ : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఔటర్‌రింగ్ రోడ్డుపై బుధవారం ప్రత్యేక పోలీసుల బృందం జరిపిన దాడుల్లో రూ.30లక్షల విలువ చేసే గంజాయి పట్టుబడింది. ఇటీవల రింగురోడ్డుపై గంజాయి రవాణా అవుతోందన్న సమాచారం మేరకు శంషాబాద్ డీసీపీ పద్మజ, ఎస్‌ఓటీ, టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందం ఔటర్‌పై నిఘా ఏర్పాటు చేశారు. బుధవారంరింగురోడ్డుపై వెళ్తున్న బొలేరో వాహనంలో తనిఖీ చేయగా, మొక్కజొన్న లోడు కనిపించింది. ఆ కంకులు తొలగించి చూస్తే కింద ప్యాక్ చేసిన గంజాయి మూటలు కనిపించాయి. వారిని విచారించగా.. తమ ముందు టాటా ఇండికా కారులో ఉన్న వారికి విషయం తెలుసని చెప్పారు. దీంతో ఆ వాహనాన్ని కూడ పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఈ గంజాయిని విశాఖపట్నం నుంచి నారాయణ్‌ఖేడ్‌కు తీసుకెళ్తున్నట్టు డీసీపీ తెలిపారు. ముగ్గురు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారని, ఐదుగురు నిందితులను అదుపులో తీసుకుని విచారించినట్లు పేర్కొన్నారు.



పట్టుబడిన గంజాయి సంచులు

రాజన్న హుండీకి రికార్డు స్థాయి ఆదాయం

- 27 రోజుల్లో రూ.కోటి 43 లక్షల రాబడి

వేములవాడ, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి ఆలయ ఖజానాకు హుండీ ద్వారా రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. బుధవారం 27 రోజుల హుండీ ఆదాయాన్ని ఆలయ ఓపెన్‌స్లాబ్ ప్రాంగణంలో లెక్కించా రు. రూ.కోటి 43 లక్షల 6 వేల 242 నగదు, 219 గ్రా ముల బంగారు, 10 కిలోల 200 గ్రాముల ఆభరణా లు లభించాయని ఈవో దూస రాజేశ్వర్ తెలిపారు.



హుండీలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు

- అంతర్ జిల్లాల పోలీసు సమావేశంలో నిజామాబాద్ సీపీ కార్తికేయ

ఖిల్లా: రానున్న రోజుల్లో జరిగే గణేష్, బక్రీద్ పండుగల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిపై నిఘా పెట్టి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ పోలీసు కమిషనర్ కార్తికేయ ఆదేశించారు. బుధవారం రాత్రి నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనుమానస్పదంగా సంచరించే వారిపై నిఘా పెట్టాలన్నారు. పండుగలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎటువంటి చర్యలు తీసుకోవాలో అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో కామారెడ్డి,నిర్మల్ జిల్లాల ఎస్పీలు ఎన్.శ్వేతారెడ్డి, బైంసా డీఎస్పీ ఎ.రాములు, బోధన్ ఏసీపీ కే.మోహన్, స్పెషల్‌బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ సీహెచ్.వెంకన్న, మూడు జిల్లాల ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ కార్తికేయ

కూతురిపై తండ్రి అత్యాచారం?

- గర్భం దాల్చిన బాలిక

జుక్కల్, ఆగస్టు 23: కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం గుండూరు గ్రామంలో ఓ వ్యక్తి తన కూతురి(14)పై అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచారు. ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థి కడుపు నొప్పితో బాధపడుతుండడంతో ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షలు చేయగా ఆమె గర్భవతి అని తేలింది. దీంతో ఉపాధ్యాయులు అవాక్కయ్యారు. దీనిపై జుక్కల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విద్యార్థినిని విచారించగా తండ్రే అత్యాచారం చేశాడని వెల్లడించింది. దీంతో తండ్రిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిసింది. దీనిపై జుక్కల్ ఎస్సైని వివరణ కోరగా అలాంటిదేమీ లేదంటూ సమాధానాన్ని దాట వేశారు.

బాలుడిపై లైంగిక వేధింపులు

- హాస్టల్ కుక్ అరెస్ట్

గార్ల: మహబూబాబాద్ జిల్లా బయ్యారం ఎస్టీ బాలుర హాస్టల్‌లో బాలుడిని లైంగికంగా వేధిస్తున్న కుక్‌ను బుధవారం అరెస్ట్ చేశారు. కాంట్రాక్ట్ కుక్‌గా పనిచేస్తున్న సూర్నపాక రాము అదే హాస్టల్‌లో ఏడో తరగతి చదువుతున్న బాలుడిని కొంత కాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. రాము వెకిలి చేష్టలకు భయపడిన బాలుడు విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థి ఆత్మహత్య



గోపీకృష్ణ

గద్వాల క్రైం : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థి గోపీ కృష్ణ (21) బుధవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. గోపీ కృష్ణ బెంగళూరులో అగ్రికల్చర్ బీఎస్సీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇటీవలే సెలవులకు గద్వాల వచ్చాడు. ఊరికి చేరుకున్న వెంటనే తనకు చదువుపై ఆసక్తి లేదని తల్లిదండ్రులకు చెప్పాడు. బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు.

పాక్షికంగా కూలిన రామప్ప పరివార శివాలయం

వెంకటాపురం(రామప్ప)(జయశంకర్ జిల్లా): సుప్రసిద్ధ రామప్ప దేవాలయం సమీపంలో ఉన్న పరివార శివాలయం బుధవారం పాక్షికంగా కూలిపోయింది. జయశంకర్ జిల్లాలోని వెంకటాపురం మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న శివాలయం రామప్ప దేవాలయానికి సమీపంలో ఉంది. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పూర్తిగా విస్మరించడంతో చెట్లు, పిచ్చిమొక్కలు, పుట్టలు పెరిగి ఒకవైపు వంగి ఉండేది. పురావస్తుశాఖ నిర్లక్ష్యం వల్ల ఆలయం కూలిపోయిందని స్థానికులు అంటున్నారు. భారీ వృక్షాలను తొలగించినట్లయితే ఆలయంలో పూజలు జరిగేవని అభిప్రాయపడ్డారు. గతంలో ఆలయంలోని శివలింగాన్ని గుప్తనిధుల కోసం పూర్తిగా తవ్వి పక్కన పడేశారని చెప్పారు. కొన్నిరోజుల క్రితం రామప్ప తూర్పు ప్రాకారం(ప్రహరీ) కూలిపోగా పరివార ఆలయాల పరిస్థితి కూడా అదేవిధంగా మారుతోంది. యునెస్కో గుర్తింపు కోసం నివేదిక పంపిన నేపథ్యంలో పరివార ఆలయాల రక్షణకు పురావస్తుశాఖ అధికారులు మరిన్ని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కూలిన శివాలయం

రెడ్లను మంచి చేసుకునేందుకు సీఎం తప్పుడు ప్రకటనలు

- ఎమ్మెల్యే చిన్నారెడ్డి

వనపర్తి: రెడ్డి సామాజిక వర్గాన్ని మచ్చిక చేసుకొనేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఎమ్మెల్యే చిన్నారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజబహద్దూర్ వెంకట్రామారెడ్డి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సీఎం చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ సహించబోదని స్పష్టం చేశారు. 2013లో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు పోలీసు అకాడమీ పేరును ఆర్‌బీవీఆర్ పోలీసు అకాడమీగా నామకరణం చేశారని, అయితే సీఎం కేసీఆర్ మాత్రం తాను అధికారంలోకి వచ్చిన తర్వాతనే మార్పిడి చేసినట్లు పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు.

సవాల్‌కు తోక ముడిచారు: వంశీచంద్ రెడ్డి

హైదరాబాద్: తనతో చర్చించేందుకు టీఆర్ఎస్ నేతలు తోక ముడిచారని, ఇక ప్రాజెక్టుల విషయంలో అసెంబ్లీలోనే తేల్చుకుంటానని ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ తనను సంస్కార హీనుడంటూ ముఖం చాటేస్తున్న జూపల్లి.. నిత్యం బూతులు మాట్లాడే సీఎంను ఏమని సంబోధిస్తారని ప్రశ్నించారు. తన ప్రాంతానికి నష్టం చేసేవారిని చెంచా అనక మరేమంటారని ఆయన ప్రశ్నించారు.

తెలంగాణలో నైజాం నియంతృత్వ పాలన

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- దొరల చేతిలో తెలంగాణ: గద్దర్



నల్లగొండ రూరల్, ఆగస్టు 23: తెలంగాణలో నైజాం నియంతృత్వ పాలన కొనసాగుతుందని, దీన్ని అంతమొందించడమే టీ-మాస్ లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం నల్లగొండలో తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆవిర్భావ సభను నిర్వహించారు. తమ్మినేని మాట్లాడుతూ కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలుచేయడం లేదని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు కోర్టులో కొట్టి వేసే వాటినే నోటిఫికేషన్‌లో వేస్తూ నిరుద్యోగులతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ మాట్లాడుతూ రాష్ట్రం ఫ్యూడల్ దొరల చేతుల్లోకి పోయిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అన్యాయం జరుగుతోందన్నారు. రైతులకు బేడీలు వేసి జైళ్లకు పంపిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యమేనా అని ప్రశ్నించారు.

స్వయం ఉపాధి నిధులివ్వండి: అజయ్‌మిశ్రా

హైదరాబాద్: నిర్దేశించిన గడువులోగా క్షేత్రస్థాయి పనులు(గ్రౌండింగ్) పూర్తి చేసి స్వయం ఉపాధి లబ్ధిదారులకు నిధులు అందజేయాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా జిల్లాల అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 2014-15, 2015-16కు సంబంధించి గ్రౌండింగ్ 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2017-18 సంవత్సరానికి సంబంధించి ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంకు సమ్మతి ఎంపిక సమయంలోనే నిధులు ఇవ్వాలని ఆదేశించారు. గుడుంబా పునరావాస పథకంలో లబ్దిదారులందరికీ 31 లోపు మొత్తం యూనిట్లను అందజేయాలని జాయింట్ కలెక్టర్‌లను ఆదేశించారు. షెడ్యూల్ కులాల నిరుద్యోగ మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను ఆదేశించారు.

సారథి లేకుండానే సర్వే..!

- **ఏడాదిగా భూపరిపాలన కమిషనర్ పోస్టు ఖాళీ**

హైదరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 8 దశాబ్దాల తర్వాత సమగ్ర భూ సర్వే జరగనుంది. 31 జిల్లాలు, 68 రెవెన్యూ డివిజన్లు, 584 మండలాలు, 10,888 రెవెన్యూ గ్రామాల్లో 81,353.92 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల భూమిలో జరిగే ఈ సర్వేను పర్యవేక్షించే బాధ్యత భూపరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ)దే. అయితే, ఆ పోస్టు ఏడాది కాలంగా ఖాళీగా ఉంది. గత మూడేళ్లలో ఒక్క ఏడాది మాత్రమే సీసీఎల్ఏకు పూర్తి స్థాయి అధికారి ఉన్నారు. రూ.1000 కోట్లకు పైగా ఖర్చుతో చేపట్టే ఈ సర్వే సారథి లేకుండా ఎంత మేర సఫలీకృతమవుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సర్వేను క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు, ఆర్డీవోలు పర్యవేక్షిస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు పర్యవేక్షిస్తారు. అయితే, వీరందరిని నియంత్రించే బాధ్యత సీసీఎల్ఏదే. అంతటి కీలకమైన ఈ పోస్టును ఖాళీగా ఉంచి సర్వే చేపడితే ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండవని రెవెన్యూ సంఘాలు అంటున్నాయి. 11 నెలల పాటు సీసీఎల్ఏగా బాధ్యతలు నిర్వహించిన రేమండ్ పీటర్ 'మాభూమి' వెబ్‌సైట్‌ను రూపొందించారు. వీఆర్‌వోలకు ట్యాబ్‌లు కొనుగోలు చేయడంతో పాటు పలు రాష్ట్రాల్లో సర్వే ఎలా జరుగుతోందనే అంశాలను పరిశీలించారు. సీసీఎల్ఏకు ఆ 11 నెలలే స్వర్ణయుగంగా చెప్పుకుంటారు. ఆ కాలంలో భూపరిపాలనలో పలు సంస్కరణలతో పాటు జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఏడాది క్రితం రేమండ్ పీటర్ పదవీ విరమణ చేసినప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా సీసీఎల్ఏ పోస్టును భర్తీ చేయాలని రెవెన్యూ సంఘాలు కోరుతున్నాయి.



పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులతో సమావేశమైన కేటీఆర్

పట్టణ అభివృద్ధిలో మహిళల పాత్ర పెంచుతాం

- **మెప్మా రిసోర్స్ పర్సన్లతో భేటీలో కేటీఆర్**

హైదరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణాల అభివృద్ధిలో మహిళల పాత్రను మరింత పెంచుతామని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చెప్పారు. మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ) కింద పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లు, ముఖ్యంగా మహిళా ఉద్యోగుల సాయంతో సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. మెప్మా ఉద్యోగులతో కేటీఆర్ బుధవారం సమావేశమయ్యారు. పట్టణ పేదల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, అందించాల్సిన సహాయ సహకారాలను తెలుసుకున్నారు. కేసీఆర్ కిట్లు, హరితహారం, బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణాలను ప్రకటించే కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అమలు తీరును ఆరా తీశారు. కాగా, ప్రభుత్వ కార్యక్రమాల అమలు కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నా దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామని ఉద్యోగులు మంత్రికి విన్నవించారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు.

వెనుకబడిన గ్రామాలపై దృష్టి: జూపల్లి

హైదరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన గ్రామాల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలన్నారు. అధికారులతో బుధవారం మంత్రి చర్చించారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఉపాధి పనులు ఆశించిన స్థాయిలోనే సాగుతున్నాయని, అయితే కొన్ని గ్రామాలు పూర్తిగా వెనుకబడ్డాయన్నారు. ప్రతి మండలంలో వెనకబడిన రెండు గ్రామాలను గుర్తించి పనులను పూర్తి చేయాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు.

కోదండ వాస్తవాలు తెలుసుకోవాలి: కర్నె

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని పేర్కొంటున్న టీజేఏసీ చైర్మన్ కోదండరాం... వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ సూచించారు. తెలంగాణ ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే ఢిల్లీలోనూ మరోసారి అబద్ధాల చిట్టాను వల్లెవేశారని విమర్శించారు. ఈ విషయమై టీఆర్ఎస్ఎల్పీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం విధించిన ఎఫ్ఆర్‌బీఎం పరిధికి లోబడే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తోందని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయటంకాదు... దమ్ముంటే నిరూపించాలని టీ.కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్కకు సవాల్ విసిరారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఎవరికి వారు సీఎం అభ్యర్థిగా ఊహించుకుంటూ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ బూర నర్సయ్యగౌడ్

లభ్యత మేర కృష్ణా జలాలు పంచాలి

- **కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ బూర**

న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): లభ్యతను బట్టి కృష్ణా జలాలను నాలుగు రాష్ట్రాలకు పంచాలని కోరుతూ కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతికి టీఆర్ఎస్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో ప్రాజెక్టులన్నీ జలకళతో ఉట్టిపడుతుంటే తెలంగాణ, ఏపీల్లోని శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర తాగునీటి అవసరాల దృష్ట్యా 20 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరినట్టు తెలిపారు.

25 నుంచి చివరి విడత డిగ్రీ కౌన్సెలింగ్

హైదరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 25వ తేదీ నుంచి చివరి విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. మూడో విడత సీట్ల కేటాయింపులో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కొంత మంది విద్యార్థులకు సీట్లు దక్కలేదు. సదరు విద్యార్థులకు నష్టం జరగకుండా మరోసారి అవకాశం ఇవ్వాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

పత్తి సాగు విస్తీర్ణంలో రికార్డు

సాగు విస్తీర్ణంలో పత్తి పంట గత రికార్డులను తిరగరాసింది. పంటల పరిస్థితిపై వ్యవసాయ శాఖ బుధవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో రైతులు అన్ని పంటలూ కలుపుకుని 36.21 లక్షల హెక్టార్ల మేర సాగు చేశారు. అందులో 50.37% పత్తి సాగే ఉంది. ఈ ఖరీఫ్‌లో 18.24 లక్షల హెక్టార్ల మేర పత్తి పంటను సాగు చేశారు. దీంతో ఈ ఏడాది ఇంతవరకు 45.05 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు.

భూమి ఎవరిది!



(మూడో పేజీ తరువాయి)

చీర కూడా కొనలేడు. స్కూల్ ఫీజు కూడా కట్టలేడు. పరువు కోసం తెల్లబట్టలేసులుని తిరుగుతారు కానీ పరిస్థితి ఏమీ బాగుండదు. పంట సీజన్ వస్తే అప్పుల కోసం తిరగని చోటుండదు. బ్యాంకుల చుట్టూ, మిత్రీ వ్యాపారుల చుట్టూ తిరిగి అప్పు పుట్టించుకొంటారు. అనేక కారణాల వల్ల పంట పోతే పెట్టుబడి పోయి అప్పు మిగులుతుంది. అప్పుకు వడ్డీ పెరుగుతుంది. బతుకు భారమవుతుంది. ఈ పరిస్థితి నుండి రైతును గట్టెక్కించాలని ఎప్పటి నుంచో ఆలోచిస్తున్నా. చాలామందితో మాట్లాడాను. చివరికి వ్యవసాయానికి పెట్టుబడి ప్రభుత్వమే సమకూరిస్తే అప్పుల తిప్పలు తప్పుతాయని నిర్ణయించాం. పంట పోయినా పెట్టుబడి కోల్పోయే ప్రమాదం ఉండదు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోరు. అందుకే ఎకరాకు ఏడాదికి రూ.8 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించుకున్నాం" అని సీఎం వివరించారు. 90 రోజుల పాటు రికార్డులను సరి చేయడం కోసం కార్యాచరణ చేపట్టాలని, ఆ మూడు నెలలు రెవెన్యూ యంత్రాంగానికి మరే పని ఉండదని స్పష్టం చేశారు. "భూ రికార్డులను ప్రక్షాళన చేయడం వల్ల ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయి. ఏ భూమి పరిస్థితి ఏమిటో తెలియడం వల్ల వివాదాలు, ఘర్షణలకు తావుండదు. ఇది నిజానికి పెద్ద సవాల్. చాలా పీటముళ్లుంటాయి. చిత్తశుద్ధి ఉంటే అసాధ్యం కాదు. అధికారులకు సముద్రం అంత ఓపిక ఉండాలి. రాష్ట్రంలో గుడుంబా, పేకాట బంద్ అయింది. రికార్డుల ప్రక్షాళన జరిగితే భూ దందాలు కూడా బంద్ అవుతాయి" అన్నారు.

గ్రామకంఠమూ కొలుస్తాం

సర్వేలో గ్రామంలో అటవీభూమి, ప్రభుత్వ భూమి, దేవాదాయ భూమి, ప్రజోపయోగ కార్యక్రమాల కోసం వినియోగిస్తున్న భూమి, ప్రభుత్వ భవనాల కింద ఉన్న భూమి, చెరువులు, కుంటల కింద ఉన్న భూమి తదితర వివరాలన్నీ సేకరించాలని ఆదేశించారు. వ్యవసాయ భూములు వ్యవసాయేతర అవసరాల కోసం బదలాయింపు జరిగితే ఆ వివరాలు, ప్రభుత్వం సేకరించిన భూవివరాలు, ప్రభుత్వం అసైన్ చేసిన భూ వివరాలు కూడా నమోదు చేయాలన్నారు. అసైన్డ్ భూముల్లో వ్యవసాయం చేసుకునే పేదలకు కూడా పెట్టుబడి పథకం కింద నిధులు అందివ్వనున్నట్లు సీఎం ప్రకటించారు. గ్రామకంఠాన్ని కూడా నిర్ధారించాలన్నారు. మొదటి దశలో వివాదాలు లేని భూములు రికార్డులను సరి చేయాలని, రెవెన్యూ గ్రామం పరిధిలోని ప్రతీ భూమి వివరాలను నమోదు చేయాలని చెప్పారు.

కోర్ బ్యాంకింగ్ లాగే రికార్డులు

"భూ రికార్డులన్నింటినీ సరిచేసిన తర్వాత ఆ వివరాలన్నీ ఆన్‌లైన్ లో పెట్టాలి. మళ్లీ భూ రికార్డులకు సంబంధించి ఏ చిన్నమార్పు జరిగినా అంతా ఆన్‌లైన్‌లో తెలిసిపోవాలి అని సీఎం అన్నారు. బ్యాంకులు అవలంభిస్తున్న కోర్ బ్యాంకింగ్ విధానం లాంటిది భూ రికార్డుల నిర్వహణలో అనుసరించాలన్నారు. "ఏటీఎం ద్వారా ఏ బ్యాంకులో, ఏ ప్రదేశంలో డబ్బులు విత్ డ్రా చేసుకున్నా వెంటనే ఆన్ లైన్ లో తెలిసిపోతుంది. వినియోగదారుడికి మెసేజ్ వస్తుంది. అలాగే భూ రికార్డులు కూడా ఉండాలి" అని స్పష్టం చేశారు. "పాస్ పుస్తకాల్లో ఎక్కడ మార్పు జరిగినా అంతటా తెలిసిపోవాలి. ప్రతిదీ పారదర్శకంగా జరగాలి. భూ రికార్డులను సరిచేయడానికి, ఆ తర్వాత వాటిని నిర్వహించడానికి, కోర్ బ్యాంకింగ్ లాంటి వ్యవస్థను నడపడానికి ప్రతీ రెవెన్యూ కార్యాలయంలో ఒక ఐటీ అధికారిని నియమించాలి" అన్నారు. "రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా రెవెన్యూ శాఖలో వెయ్యి మందిని నియమించాలి. ఎక్కువ సామర్థ్యం కలిగిన కంప్యూటర్లు, ఎక్కువ బ్యాండ్ విడ్త్ కలిగిన నెట్ కనెక్షన్ కల్పిస్తాం. రెవెన్యూ కార్యాలయాలన్నీ ఒకదానికొకటి అనుసంధానం అవుతాయి" అని చెప్పారు.

పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు

"రిజిస్ట్రేషన్లు కూడా పారదర్శకంగా జరగాలి. క్రయ విక్రయాలు జరిపే రైతులిద్దరూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాలి. రిజిస్ట్రార్‌కు ఇద్దరూ పాసు పుస్తకాలు ఇవ్వాలి. రిజిస్ట్రార్ రెండు పాస్ పుస్తకాలను తీసుకుని అమ్మే వారి పాస్ పుస్తకం నుంచి భూమిని తొలగించి కొన్నవారి పాస్ పుస్తకంలో వివరాలు చేర్చాలి" అని సీఎం ఆదేశించారు. "రిజిస్ట్రారే ఈ రెండు పాస్ పుస్తకాలను కొరియర్ ద్వారా తహసీల్దార్‌కు పంపించాలి. నాలుగు పనిదినాల్లో ఎమ్మార్వో క్రయ విక్రయాలకు సంబంధించిన వివరాలను రికార్డుల్లో మ్యుటేషన్ చేయాలి" అన్నారు. "పాస్ పుస్తకాలపై అటెస్ట్ చేసి, పేరు మార్పిడి చేసి, తిరిగి రిజిస్ట్రార్ కు పంపాలి... ఆ తర్వాత రిజిస్ట్రార్ తన రికార్డుల్లో నమోదు చేసుకుని కొరియర్ ద్వారా రైతులకు పంపాలి. అమ్మేవారు, కొనేవారు కేవలం ఒక్కసారి మాత్రమే రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చేలా విధానం ఉండాలి" అని చెప్పారు. "పాస్ పుస్తకాలు, పహణీల నిర్వహణ మరింత సరళం చేయాలి. అవసరం లేని కాలమ్స్ తీసేయాలి. కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వాలి. ప్రత్యేకమైన పెన్నులు మాత్రమే ఉపయోగించే విధంగా పాస్ పుస్తకాల పేజీలు ఉండాలి. నీటిలో పడినా తడవకుండా, పాడవకుండా ఉండే విధంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. పాస్ పుస్తకాల సైజు కూడా తగ్గించాలి" అని సీఎం ఆదేశించారు.

మండలానికో రిజిస్ట్రేషన్ కార్యాలయం

"స్టాంపుల చట్టాలను, రిజిస్ట్రేషన్ చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అవసరమైన మార్పులు చేయాలి. భవిష్యత్తులో ప్రతీ మండలానికి ఒక రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయాలి" అని సీఎం చెప్పారు. వీలైతే ఎమ్మార్వోకే రిజిస్ట్రేషన్ అధికారం ఇచ్చే అవకాశాలు పరిశీలించాలన్నారు. రెవెన్యూ కోర్టులు కూడా ఇన్ని ఉండాలా? కలెక్టర్ వద్ద ఒక్క కోర్టు సరిపోదా అనే కోణంలోనూ ఆలోచించాలని కోరారు. ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయకుండా నిషేధిత జాబితా కూడా తయారు చేయాలన్నారు.

రైతులకు ఆ మూడు కావాలి

"రైతులకు కావాల్సింది సాగునీరు, పెట్టుబడి, గిట్టుబాటు ధర. ఇప్పటికే రాష్ట్రంలో సాగునీరు అందివ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది నాటికి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా దాదాపు 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది" అని సీఎం చెప్పారు. పాలమూరు, సీతారామ ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుంది. అవసరమున్నంత ఉచిత విద్యుత్ అందడం వల్ల రైతులు భూగర్భ జలాలను గరిష్ఠ స్థాయిలో ఉపయోగించుకోగలుగుతున్నారు. తర్వాత దశలో గిట్టుబాటు ధర కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. రైతులను సంఘటితం చేసే పనికి ప్రభుత్వమే పూనుకుంది. రైతులు సంఘటితమై గిట్టుబాటు ధర పొందే ప్రణాళిక కూడా అమలు చేస్తున్నాం" అని సీఎం కేసీఆర్ చెప్పారు.

వివాదాలు 5-15% భూములకే

ఎలాంటి వివాదాలు లేని భూములు 85-95 ఉంటాయని అంచనా. అలాంటి భూముల రికార్డులన్నింటినీ ముందుగా ప్రక్షాళన చేస్తారు. పేరు మార్పిడీలు, క్రయ విక్రయాలు జరిగిన వివరాలన్నీ తీసుకుంటారు. రికార్డులకు తుదిరూపం ఇస్తారు. రెండో దశలో వివాదాస్పద భూములకు పరిష్కార మార్గాలు చూస్తారు. కోర్టు వివాదాలుంటే, తీర్పులను అనుసరించి యాజమాన్య హక్కులను నిర్ణయిస్తారు. గ్రామంలో ఒక రైతు భూమిని అమ్మగానే అతని పేరు రికార్డుల నుంచి తొలగించి, కొనుగోలు చేసిన రైతు పేరు అదే రోజు రికార్డులకు ఎక్కించాలి.

నేనూ మూడూళ్లకు వెళతా

"భూ రికార్డులను సరిచేసే కార్యక్రమం సెప్టెంబర్ 15న రాష్ట్రమంతటా పెద్ద ఎత్తున ప్రారంభం కావాలి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా తలా మూడు గ్రామాలను తీసుకుని స్వయంగా పాల్గొనాలి. నేను కూడా మూడు గ్రామాలు ఎంపిక చేసుకుంటా. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ ఉద్యోగులు, రైతు సంఘాలు చురుకైన పాత్ర పోషించాలి. సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు కూడా క్రియాశీల పాత్ర పోషించాలి. భూ రికార్డుల ప్రక్షాళనకు సంబంధించి కొంత మంది ఉద్యోగులను కూడా తాత్కాలిక పద్ధతిపై తీసుకుంటాం" అని ముఖ్యమంత్రి చెప్పారు.

రెండో దశలో భూభాగమంతా సర్వే

రెండో దశలో మొత్తం తెలంగాణ భూభాగాన్ని సర్వే చేయించి, కొత్త మ్యాపులు రూపొందిస్తామన్నారు. ఎప్పటికప్పుడు తెలంగాణ భూభాగంలో జరిగే మార్పులు కూడా వెంటనే నమోదయ్యేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సీఎం చెప్పారు. "1932-36 మధ్య నిజాం రాజ్యంలో భూ సర్వే జరిగింది. ఈ ఎనిమిది దశాబ్దాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అవన్నీ సరిగ్గా నమోదు కాలేదు. అందుకే భూ రికార్డుల నిర్వహణలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. వివాదాలకు కూడా కారణమవుతోంది. వ్యవసాయ శాఖ వద్ద వివరాలకు, రెవెన్యూ శాఖ వద్ద ఉన్న వివరాలకు పొంతన లేదు. దీంతో ప్రభుత్వం అందించాలనుకునే పెట్టుబడి ఏ ప్రాతిపదికన అందించాలో తెలియని పరిస్థితి నెలకొంది. పొరపాట్లు జరిగితే వేల కోట్ల రూపాయల కుంభకోణం అయ్యే అవకాశం ఉంది. మంచి చేయబోతే చెడు అవుతుంది. అందుకే ఏ భూమి ఎవరి ఆధీనంలో ఉందో, పెట్టుబడి ఎవరికి అందాలో ఖచ్చితంగా తెలియాలి. అందుకే భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం తీసుకుంటున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

ఆర్టీసీని ప్రగతిపథంలో నడిపిస్తాం

- **బస్సుల రాక తెలిపే విధానం త్వరలో అమల్లోకి**
- **ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ**
- **సిబ్బందికి 'హై మైలేజీ అవార్డుల' ప్రదానం**

రీజియన్ల వారీగా అవార్డులు..

రీజియన్	బస్సుల సంఖ్య	అవార్డులు
కరీంనగర్	144	288
ఆదిలాబాద్	46	92
ఖమ్మం	111	222
నిజామాబాద్	71	142
వరంగల్	84	168
రంగారెడ్డి	39	78
మహబూబ్‌నగర్	68	136
నల్గొండ	109	218
మెదక్	48	96
సికింద్రాబాద్	24	48
హైదరాబాద్	64	128

హైదరాబాద్ సిటీ/చిక్కడపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపించేందుకు అంకిత భావంతో పని చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ సోమారపు సత్యనారాయణ తెలిపారు. ఆధునిక టెక్నాలజీ సాయంతో ఏ బస్సు ఎన్ని నిమిషాల్లో వస్తుందో తెలిపే ఆరేడునెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. అశోక్‌లేలాండ్ తయారు చేసిన బస్సు ఇంజన్‌ల ద్వారా 10 లక్షల కిలోమీటర్లు దూరం ప్రయాణించి అద్భుతమైన ప్రగతిని చూపిన సందర్భంగా ఆర్టీసీ మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లను హై మైలేజ్ అవార్డులతో సత్కరించే కార్యక్రమాన్ని బుధవారం బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణమండపంలో నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఆశయాల మేరకు 55వేల మంది ఆర్టీసీ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని సోమారపు చెప్పారు. రాష్ట్రంలో బస్సుల్లేని 1400 గ్రామాలకు కూడా ఆ సౌకర్యం కల్పిస్తామన్నారు. గతంలో 5 డిపోలు మాత్రమే లాభాల్లో ఉండేవని ఇప్పుడు ఆ సంఖ్య 34కు చేరిందన్నారు. బస్సుల ఇంజన్ మెయింటనెన్స్ సక్రమంగా ఉంటే ఫలితాలు బాగుంటాయని, ఈ విషయంలో కరీంనగర్, ఖమ్మం, నల్గొండ రీజియన్లు హై మైలేజ్ సాధనలో అగ్రభాగాన నిలిచాయని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ రమణరావు అన్నారు.



ఉద్యోగులకు అవార్డులు అందచేస్తున్న ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ రమణరావు

క్రీమీలేయర్ 8 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చింది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వర్గీకరణ ప్రక్రియను ప్రారంభించడానికి రాజ్యాంగంలోని 340 అధికరణ ప్రకారం కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. కమిషన్ వర్గీకరణపై అధ్యయనం చేసి 12 వారాల్లో నివేదిక అందిస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మూడు అంశాలపై కమిషన్ అధ్యయనం చేయనుంది. ఓబీసీ జాబితాలో ఉన్న సామాజిక వర్గాల మధ్య రిజర్వేషన్‌లో అసమానతలు, వర్గీకరణ చేపట్టడానికి యంత్రాంగం, అర్హత, నిబంధనలు, శాస్త్రీయత తదితర అంశాల ఖరారు, ఏ కేటగిరీలో ఏ కులాన్ని చేర్చాలన్న దానిపై ప్రతిపాదనలు ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి, కర్ణాటక, హరియాణా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, బిహార్, మహారాష్ట్ర, తమిళనాడుల్లో ఇప్పటికే ఓబీసీ వర్గీకరణ అమల్లో ఉంది. అయితే, ఓబీసీ వర్గీకరణకు రాజ్యాంగబద్ధత, న్యాయబద్ధత లేదని, వర్గీకరణ చట్ట వ్యతిరేకమని, చట్టాల్లో లేదని 1992లో ఓ కేసులో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. క్రీమీలేయర్‌ను రెండు లక్షలు పెంచడం వల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పరంగా ఓబీసీలకు లబ్ధి చేకూరుతుందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మంత్రివర్గ భేటీ అనంతరం చెప్పారు. ఓబీసీ వర్గీకరణ చేపట్టాలని 2011లో జాతీయ బీసీ కమిషన్ సిఫారసు చేసిందని, తర్వాత 2012-13లో పార్లమెంటరీ స్థాయీ సంఘం కూడా ప్రతిపాదించిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో అంతర్ మంత్రిత్వ శాఖలతో సంప్రదింపులు చేసి వర్గీకరణకు అంగీకారం తెలిపామని స్పష్టం చేశారు. రిజర్వేషన్ వ్యవస్థను ప్రభుత్వం సమీక్ష చేయాలనుకుంటుందా అని ప్రశ్నించగా, అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని, రిజర్వేషన్ వ్యవస్థపై సమీక్ష చేయబోమని అరుణ్ జైట్లీ సమాధానమిచ్చారు. ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ నేతలు వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఈ నిర్ణయం మేలు కలిగిస్తుందని తెలిపారు.

ప్రైవేట్లోనూ టెట్ తప్పనిసరి

టీచర్లపై ప్రభుత్వ యోచన

హైదరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో టీచర్లు ఇకపై టెట్ అర్హత పరీక్ష పాసై ఉండాలనే నిబంధన విధించాలని విద్యాశాఖ యోచిస్తోంది. ప్రైవేటు స్కూళ్లలో నాణ్యమైన విద్య అందించాలంటే శిక్షణ గలిగిన టీచర్లు కావాలని, అందుకు టెట్ అర్హత నిబంధన పెట్టాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం శిక్షణ పొందని టీచర్లకు రెండేళ్ల పాటు శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించి బీఎడ్, డీఎడ్‌లకు సమానమైన ధ్రువపత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఉత్తరాదిలోని కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే రెగ్యులర్ టీచర్లు సైతం బీఎడ్, డీఎడ్ వంటి ఉపాధ్యాయ శిక్షణా కోర్సులు చేయలేదు. అందుకే తత్సమాన శిక్షణ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లందరూ ఉపాధ్యాయ శిక్షణా కోర్సులు చేసిన వారే. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన 11 వేల మంది విద్యా వాలంటీర్లు సైతం టెట్ క్వాలిఫైడ్ అభ్యర్థులే. దాంతో బోధనలో కొంత మెరుగుదల కనిపిస్తోంది. రాష్ట్రంలో టెట్ క్వాలిఫైడ్ టీచర్లు 3 లక్షల మంది ఉన్నప్పుడు ప్రైవేటు స్కూళ్లలో శిక్షణ లేని టీచర్లను నియమించాల్సిన అవసరం ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ప్రైవేటు స్కూళ్లలో 34 లక్షల మంది విద్యార్థులు ఉండగా స్కూల్ రికార్డుల ప్రకారం 90 వేల మంది టీచర్లే ఉన్నారు. అందులో 3900 మంది అన్‌ట్రైన్డ్ టీచర్లు ఉన్నట్లు ప్రైవేటు యాజమాన్యాలు చెబుతున్నాయి. నిజానికి ఈ స్కూళ్లలో రెండు లక్షల మంది టీచర్లు పని చేస్తున్నారని, మిగతా లక్షా పదివేల మంది పేర్లను విద్యాశాఖ దగ్గర చూపించడం లేదని అధికారులు చెబుతున్నారు. టెట్ నిబంధన తీసుకొస్తే ప్రయివేటు పాఠశాలలకు రెండే ఆప్షన్లు మిగులుతాయి. ఒకటి, అనధికారికంగా పని చేస్తున్న టీచర్లకు గుర్తింపునిచ్చి, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దూరవిద్య టీచర్ ట్రైనింగ్ శిక్షణ ఇప్పించడం. రెండోది టెట్ అర్హత సాధించిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం. ఈ రెండింటి వల్లా టీచర్ల కమ్యూనిటీకి మేలే జరుగుతుందని, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందని భావిస్తున్నారు. 34 లక్షల మంది విద్యార్థుల నుంచి పాఠశాలలు భారీగా ఫీజులు వసూలు చేస్తూ మౌలిక వసతులు సరిగా కల్పించటం లేదు. ఫిర్యాదులు చేస్తే 'మీ పిల్లల్ని ఎందుకు పంపిస్తున్నారు? అనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది' కాబట్టి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసేందుకు సాహసించడం లేదు. ప్రైవేటు స్కూళ్లలో ట్రైన్డ్ టీచర్లా? అన్ ట్రైన్డ్ వారా? అని చూడటం లేదు. కాగా కేంద్ర ప్రభుత్వం నవంబర్ 13న దేశ వ్యాప్తంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించనుంది. 3,5,8 తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేసేందుకు వారిని అన్ని అంశాల్లో పరీక్షించనున్నారు. తెలంగాణ నుంచి ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థల నుంచి 1.5 లక్షల మందిని ఎంపిక చేసి విద్యార్థుల సామర్థ్యాలకు పరీక్ష పెట్టనున్నారు. 2015-16లో ప్రైవేటు స్కూళ్లలో పని చేసిన టీచర్లు ఇప్పుడు పని చేస్తున్నారా? వారు ఏ స్కూళ్లలో ఉన్నారు? వారి పూర్తి వివరాలు మండలం వారీగా గుర్తించాలని విద్యాశాఖ జిల్లా డీఈవోలకు ఆదేశాలు జారీ చేయనుంది.

రెండేళ్ళ బాలికపై అత్యాచారం

మహేశ్వరం, ఆగస్టు 23: అభం శుభం తెలియని రెండేళ్లపాపపై అత్యాచారానికి పాల్పడ్డాడో దుర్మార్గుడు. ఈ దారుణం జరిగింది మొదలు.. ఘటనను తొక్కిపెట్టేందుకు బాధిత తల్లిదండ్రుల యజమాని, ఓ ప్రభుత్వ వైద్యుడు శతవిధాలా ప్రయత్నించారు. రంగారెడ్డిజిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలోని శ్రీప్రేమ సినిమా థియేటర్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలానికి చెందిన లక్ష్మయ్య దంపతులు కార్మికులుగా పనిచేస్తున్నారు. థియేటర్ వెనుక భాగంలోని ఓ గదే వారి నివాసం. వీరికి రెండేళ్ల పాప ఉంది. పక్కన మరో గదిలో మహబూబ్‌నగర్‌కు చెందిన నరసింహ (19) అనే యువకుడు ఉంటున్నాడు. ఈ నెల 13న రాత్రి నరసింహ.. పాపను తన గదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారికి తీవ్ర రక్త స్రావం కావడంతో తల్లిదండ్రులు.. థియేటర్ యజమాని సంతోష్‌లాలా తివారికి విషయం చెప్పుకొని బోరుమన్నారు. అయితే, విషయం ఎవరికీ చెప్పొద్దని, డాక్టరుకు కూడా ఏదో ఒకటి చెప్పి మేనేజ్ చేయాలని పాప తల్లిదండ్రులను తివారి బెదిరించాడు. తన కారులోనే పాపను తొలుత ఉస్మానియా ఆస్పత్రికి, అక్కడి నుంచి నిలోఫర్‌కు తరలించాడు. పాపపై అత్యాచారం జరిగిందని తెలిసీ నిలోఫర్ ఆస్పత్రిలోని వైద్యుడు ఉపేక్షించాడు. ఇటీవల పాప తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అరెస్టు చేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
navya@andhrajyothy.com
24-8-2017 • గురువారం



వృత్తిపరంగా ఆర్కిటెక్ట్... ప్రవృత్తిపరంగా పర్యావరణ ప్రియులు. ఎదురుగా ఏం జరుగుతున్నా నాకెందుకులే? అని చూసీచూడనట్టు వెళ్లిపోకుండా కొండంత సామాజిక స్పృహతో, వీలైనన్ని మార్గాల్లో పర్యావరణ హితానికి తన వంతు సహాయం అందిస్తున్నారు హైదరాబాద్‌కు చెందిన మామిడి గౌరీ శంకర్. వినాయక చవితికి మొక్కతో కూడిన మట్టి విగ్రహాల తయారీకి శ్రీకారం చుట్టారాయన. ఇలా 'ట్రీ గణేశ'తో వినూత్న రీతిలో పట్టణాల్ని సస్యశ్యామలం చేసే పని ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్. ఈ పర్యావరణహిత 'మొక్క వినాయక విగ్రహాల' వివరాలు, విశేషాలు... గౌరీ శంకర్ పంచుకున్నారిలా!




ట్రీ గణేశ

మొక్కవోని భక్తి

2003లో మొట్టమొదటిసారి మట్టి వినాయక విగ్రహాలు తయారు చేయాలనే ఆలోచన వచ్చింది. అప్పటికే కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఆ పనిలో ఉన్నా విస్తృతంగా జరగట్లేదని గ్రహించాను. ఇక అప్పట్లో ప్రతి వినాయకచవితికీ ట్యాంక్‌బండ్‌లో దాదాపు 40 వేల విగ్రహాల దాకా నిమజ్జనం జరిగేది. అయితే నిమజ్జనం చేసిన విగ్రహాలను అలాగే వదిలేస్తూ ఉండేవాళ్లు. ఆ విగ్రహాల్లోని రసాయనాల వల్ల ఎన్నో జలచరాలు చనిపోయేవి. ట్యాంక్‌బండ్‌లో 72 రకాల జాతుల చేపలుండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 12కి పడిపోయింది. దీన్నిబట్టి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల ఎంత నష్టం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. అలాగే ట్యాంక్‌బండ్ చుట్టూ 40 రకాల జాతుల పక్షులు నివాసం ఏర్పరుచుకుని ఉంటాయి. అలాగే గబ్బిలాలు కూడా! నిమజ్జనాల వల్ల పెరిగిపోయిన కాలుష్యం మూలంగా ఈ జీవులన్నీ వలస వెళ్లిపోయాయి. ఇలా రకరకాల జీవులన్నీ క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఈ పరిస్థితి నన్ను కదిలించింది. ఈ కాలుష్యాన్ని ఎలా తగ్గించాలనే ఆలోచన అప్పుడే మొదలైంది. నా ఆలోచనను బలపరుస్తూ కొన్ని ఎన్‌జీవోలూ ముందుకొచ్చాయి. మేమంతా కలిసి కుమ్మరి సంఘాలను కలిశాం. వాళ్లలో ప్రేరణ కలిగించినా, మట్టి విగ్రహాల ఆర్డర్లు వాళ్లకెవరిస్తారు? ఇదొక సమస్య. ఇంకో ప్రధాన సమస్య ప్రజల్లోనే ఉంది. మట్టి విగ్రహాల ఉపయోగం గురించి ఎంత అవగాహన తీసుకొచ్చినా సరిగ్గా పండగ ముందురోజు హడావిడిగా మార్కెట్‌కి వెళ్లి అందంగా కనిపించే ఏ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాన్నో కొని తెచ్చేసుకుంటారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలనే ఓ పక్క కుమ్మరి వాళ్లకు ఆర్డర్లు ఇప్పిస్తూ, ప్రభుత్వపరంగా ఋణాలు ఇప్పిస్తూ, మరోపక్క ప్రజల్లో మట్టి విగ్రహాల గురించి అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నాం.

షేర్ ఎ సర్వీస్

సహాయాన్ని పంచాలనుకునే వాళ్లుంటారు. ఆ సహాయం కోసం ఎదురు చూసేవాళ్లు ఉంటారు. కానీ వీళ్లిద్దరి అవసరాలు ఒకరికొకరికి తెలిసేదెలా? ఒకరికొకరు ఉపయోగపడేదెలా? ఈ రెండు పరిస్థితులను గమనించి వీళ్లిద్దరికీ మధ్య అనుసంధానకర్తగా నిలబడ్డారు గౌరీ శంకర్. ఈ ఆలోచనతో ఆయన రూపొందించిన సాఫ్ట్‌వేరే 'షేర్ ఎ సర్వీస్'.



సవాళ్లెన్నో!

మట్టి విగ్రహాలను తయారు చేయించటం ఓ ఎత్తైతే, వాటి ఆర్డర్లు తెప్పించటం, నిధులు సమకూర్చటం, తయారుచేసిన విగ్రహాలను నిల్వ చేయటం మరో ఎత్తు. మట్టి విగ్రహాలు త్వరగా పాడైపోతాయి. పైగా వాటిని ఆరుబయట పెట్టలేం. నీడపట్టున, తగిన ఉష్ణోగ్రతల్లో పరిమిత కాలం వరకే అవి చెక్కుచెదరకుండా ఉంటాయి. లేదంటే పగుళ్లొచ్చి, విరిగిపోతాయి. ఇన్ని సవాళ్లున్నా ప్రభుత్వం నుంచి మద్దతు రావటం ఇప్పుడు మాకెంతో ప్రోత్సాహాన్నిచ్చింది.

'ట్రీ గణేశ' నేలలోనే నిమజ్జనం!

నిమజ్జనంతో ఆ భగవంతుడి పట్ల మన బాధ్యతను సమగ్రంగా పూర్తి చేశామనే తృప్తి పొందుతాం. ఆ తృప్తి మళ్లీ పొందాలంటే ఇంకో సంవత్సరం రోజులపాటు ఆగాలి. కానీ ప్రతిరోజూ అదే భావన కలగాలంటే మనం చేసిన పని ప్రతిఫలం కళ్లకెదురుగా అభివృద్ధి చెందుతూ కనిపించాలి. ఈ దిశగా ఆలోచించి మట్టి వినాయకుడితోపాటు మొక్కనూ అందిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. దాంతో విగ్రహానికి వెనకవైపు మొక్క నాటే ఏర్పాటు చేయాలనుకున్నాం. అందుకోసం కాగితపు గ్లాసును విగ్రహం వెనకవైపున అతికించి మట్టితో కప్పేశాం. దాన్లో మొక్కను ఉంచి మట్టితో నింపేసి అందిస్తాం. తొమ్మిది రోజుల పూజలు ముగించిన తర్వాత విగ్రహాన్ని నీళ్లలో కాకుండా నేలలో గొయ్యి తీసి పూడ్చేయాలి. రోజూ ఆ ప్రదేశంలో మొక్కకు నీళ్లు పోస్తూ ఉంటే అది క్రమేపీ ఎదిగి పర్యావరణంలో భాగమవతుంది.

సాటిలేని మట్టి విగ్రహాలు

పర్యావరణ అనుకూలత ఒక్కటే కాదు, మట్టి విగ్రహాల వల్ల మరెన్నో ప్రయోజనాలున్నాయి. వీటి నిమజ్జనం కోసం నీళ్లు అవసరం లేదు కాబట్టి ఇంటి దగ్గర లేదంటే చుట్టుపక్కల పార్కులోనో నిమజ్జనం చేసుకోవచ్చు. ఇలా చేయటం ద్వారా నిమజ్జనం రోజున పరోక్షంగా కొంత వరకూ ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చు. మట్టి విగ్రహాలు అనగానే పెద్దవి తయారు చేయటం వీలవదు అనుకుంటారు. కానీ మేం ఆ అనుమానాలకు కళ్లెం వేస్తూ, హైదరాబాద్‌లోని దుర్గం చెరువులో 55 అడుగుల మట్టి వినాయకుడిని విజయవంతంగా నిమజ్జనం చేసి చూపించాం. అలాగే రవాణాకు వీలుండదు అనే అనుమానాలను చెదరగొట్టడం కోసం ఏకంగా ముంబయికే 16 అడుగుల విగ్రహాన్ని తరలించి అక్కడ నిమజ్జనం చేశాం. ఈ రకంగా రవాణాకు వీలుండేలా, నీటిలో నిమజ్జనం చేయగలిగే మట్టి విగ్రహాలనూ తయారు చేసి ప్రజల్లో ఓ నమ్మకాన్ని తీసుకురాగలిగాం.

ఐదు లక్షల విగ్రహాలు...ఐదు లక్షల మొక్కలు

హైదరాబాద్‌లో విగ్రహాల అమ్మకాల గురించి సర్వే చేస్తే ప్రతి ఏటా 5 లక్షల చిన్న వినాయక విగ్రహాలు అమ్ముడవుతున్నాయని తెలిసింది. ఆ ఐదు లక్షల విగ్రహాల స్థానంలో ట్రీ గణేశ విగ్రహాలను అందచేస్తే సిటీలో ఐదు లక్షల మొక్కలు నాటిన ఫలితం దక్కుతుంది. ఇలా ప్రతి సంవత్సరం ఐదు లక్షల చొప్పున మొక్కలు నాటుతూపోతే కాలుష్యం అదుపులోకొచ్చి పర్యావరణహితం జరుగుతుంది. ఇందుకోసం కాలనీలో ఉండేవాళ్లు వాళ్ల ప్రాంతంలోని పార్కుల్లో నాటుకోవచ్చు. వాకిళ్లలో, పెరట్లో, మొక్కలు లేని ప్రదేశాల్లో నాటి చెట్లను పెంచవచ్చు. మొక్కలు పెంచమని ఎవరికి చెప్పినా ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోరు. అదే దానికి ఆధ్యాత్మికతను జోడిస్తే కచ్చితంగా మొక్కల బాగోగులు చూసుకుంటారు. పైగా విగ్రహంతోపాటు ఇచ్చే మొక్క వినాయకుడి పూజలో వాడే పత్రినే మొక్కలుగా అందిస్తున్నాం! దాంతో వాటి మీద భక్తులకు ప్రత్యేక శ్రద్ధ ఏర్పడుతుంది. అవి పెరిగి పెద్దయ్యేవరకూ వాటితో ఓ అనుబంధాన్ని కలిగి ఉంటారు. 'ట్రీ గణేశ' ఆలోచన వెనకున్న మా స్వార్థం ఇదే!

చిన జీయర్ ఆశీర్వాదం

నిమజ్జనం వృథా కాకుండా ఉండాలంటే మరో రూపంలో ఉపయోగపడేలా విగ్రహాన్ని మార్చాలి. ఆ ఆలోచనతోనే విగ్రహానికి మొక్కను జోడించాం. అయితే నీళ్లలో కాకుండా నేలలో చేసే ఈ రకమైన నిమజ్జనం ప్రజలకు కొత్త. మొక్కతో కూడిన వినాయక విగ్రహం తయారీ ఎంత వరకూ శాస్త్రీయం? అనే అనుమానం భక్తులకు కలిగితే వాటిని తీర్చే సమాధానం మా దగ్గర ఉండాలి. అందుకే ఈ విషయం గురించి చిన జీయర్ స్వామిని కలిశాం. ఆయన మా అనుమానాలను తేలికగా కొట్టి పారేశారు. మొక్క రూపంలో ఓ కొత్త జీవికి ప్రాణం పోస్తున్నారు కాబట్టి ట్రీ గణేషను నేలలో నిమజ్జనం చేయటంలో తప్పు లేదని చెప్పారు.

• గోగుమళ్ల కవిత
ఫొటో: రాజ్ కుమార్

వినూత్నం

వినాయక చవితి అంటే.. దేవుడి విగ్రహం..
21 రకాల పత్రి.. పూజా పుస్తకం..
పూలు.. పండ్లు.. పాలవెల్లి! ఓహ్.. పెద్ద కోలాహలం!
పెరిగిన పట్టణీకరణ.. ఉరుకు పరుగుల జీవితంలో ఇవన్నీ తెలియడం కష్టం. ఒక్క చోట దొరకడమూ కష్టం. ఈ కష్టం తీర్చాలని లంకోతు వేణుగోపాల స్వామి అనే టెక్ నిపుణుడు చేసిన వినూత్న ఆన్‌లైన్ ఆరాధన.. వన్‌స్టాప్.. వినాయక చవితి షాపింగ్ ఇది..

మౌస్ క్లిక్‌తో పండుగే!

నాకు కొద్దిగా ఆధ్యాత్మికత భావాలు ఎక్కువ. పండుగలు చేసుకోవడమూ ఎక్కువే! మన పండుగల్లో అద్భుతమైన పండుగ వినాయక చవితి. ఆ రోజు ఎక్కడ చూసిన గణనాథుడి విగ్రహాలు మనల్ని పలకరిస్తాయి. అయితే గణనాథుడి దగ్గర ఉంచే 21 రకాల పత్రి గురించి చాలామందికి తెలీదు. దీంతో ఏవో ఒకటి తీసుకొచ్చి లంబోదరుణ్ణి ఆరాధిస్తారు. ముఖ్యంగా హైదరాబాద్ లాంటి నగరాల్లో విగ్రహాల నుంచి కుంకుమ వరకూ అన్నీ రసాయనలతో తయారు చేసినవే ఉంటాయి. ఇలా కాకుండా ఎకో ఫ్రెండ్లీగా వినాయకచవితిని జరపాలని భావించా. అలా 'ఆరాధ్యకిట్ డాట్ కామ్'ను స్థాపించి పర్యావరణ హితంగా వినాయక చవితి జరుపుకునేందుకు నా వంతు సహకరిస్తున్నా.


వినాయక చవితి కిట్

అనుభవాల నుంచే ఆలోచన..

మాది గుంటూరు. హైదరాబాద్‌లో వెబ్ డిజైనర్ అండ్ డెవలపర్‌గా పని చేస్తున్నా. మా ఊళ్లో నాకు ఊహ తెలిసినప్పటినుంచీ బంక మట్టితో వినాయకుడి బొమ్మను తయారు చేసుకునేవాణ్ణి. సొంతంగా పూజ చేసుకునేవాణ్ణి. హైదరాబాద్‌కి వచ్చాక ఇక్కడ చాలాసార్లు వినాయక చవితి పండుగల్ని చూశాను. చవితి ముందు రోజు రోడ్ల వెంబడీ ఉండే రద్దీని చూశాను. జనాలు ఎక్కువయ్యే కొద్దీ ప్లాస్టరాఫ్ ప్యారిస్ విగ్రహాల రేటు అధికంగా చెబుతారు. పత్రిలు కాకున్నా.. ఇవేనంటూ కొందరికి అంటకట్టడం చూశాను. మా ఆఫీసులో వినాయక చవితిని సెలబ్రేట్ చేసే కల్చర్ లేదు. గతేడాది నేను మట్టి విగ్రహాన్ని తయారు చేశాను. పత్రి కోసం తిరిగితే పది రకాలు మాత్రమే దొరికాయి. మిగతా పదకొండు ఎక్కడ దొరుకుతాయని తిరిగాను. అవి దొరకలేదు. దీంతో ఆన్‌లైన్‌లో మట్టి వినాయకుడి బొమ్మలను, ఇరవై ఒక్క రకాల పత్రి అమ్మితే బావుంటుంది అనుకున్నా. అది కూడా తక్కువ ధరకు ఉంటే బావుంటుందనిపించింది.



సంవత్సరం పాటు..

మట్టి వినాయకులను ఎక్కడ తయారు చేస్తారు.. 21 రకాల పత్రి ఎక్కడ దొరుకుతాయని ఆరా తీశాను. ఇదంతా తెలుసుకోవడానికి సంవత్సరం పట్టింది. 'ఆరాధ్యకిట్ డాట్ కామ్' అనే వెబ్‌సైట్‌ను డెవలప్ చేశాను. హైదరాబాద్‌లోని ధూల్‌పేట్‌లో మట్టి విగ్రహాలు చేయించాను. మూడు నెలల ముందు నుంచే వినాయక చవితికి విగ్రహాలు, పత్రి ఎలా అందించాలనేది ప్రణాళిక వేసుకున్నా. మౌస్ క్లిక్‌తో వినియోగదారుల ఇంటికి మట్టి వినాయకులను, పూజా సామాగ్రిని అందిస్తున్నా.

ఇదీ మా ప్రత్యేకత..

చాలామంది వినాయకచవితి ముందురోజు పూలకు, పూజా సామాగ్రికి, బొమ్మలకోసం.. ఇలా ఐదారు ప్లాస్టిక్ కవర్స్‌ను వాడతారు. అలా కాకుండా ఎకో ఫ్రెండ్లీ వినాయక చవితిని సెలబ్రేట్ చేయాలనుకున్నా. మట్టి విగ్రహంతో పాటు పత్రిలు, ఇతర పూజా సామాగ్రి దేనికదే ప్రత్యేకంగా జూట్ బ్యాగ్స్, కాటన్ బ్యాగ్స్‌లో ప్యాక్స్ చేయించాను. కుంకుమ, పసుపు లాంటివి కాగితాలతో ప్యాక్ చేయించాను. ఇవన్నీ ఎకో ఫ్రెండ్లీ. దీంతో పాటు పూజ ఎలా చేయాలనే ఓ పుస్తకాన్ని ఉంచాను. మా ఆరాధ్యకిట్. కామ్‌కు మంచి స్పందన వచ్చింది. వినాయక చవితి ముందు రోజు సాయంత్రానికే అందరికీ హోమ్ డెలివరీ చేస్తాను. అందుకు రెడీ అయ్యాను. ఈ ఏడాదికి కేవలం 300 విగ్రహాలను మాత్రమే అమ్మాను. మా కిట్ తీసుకున్నాక వినియోగదారుడికి తృప్తి కలగాలన్నదే నా కోరిక.

అదే నా లక్ష్యం..

నేను డబ్బు కోసం చూడలేదు. మంచి సర్వీస్ ఇవ్వాలనే ఒక స్టార్టప్ ప్రయత్నంలా ప్రారంభించా. అందుకే మా కిట్‌లో 18 రకాల పూజాసామాగ్రి, 21 రకాల పత్రి, ఎకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమ. దీంతో పాటు వర్చువల్ పూజ ఏర్పాటు చేశాను. వినాయక చవితి రోజు పూజారుల సమస్య ఉంటుంది. అందుకే ముందే ఓ బ్రాహ్మణుడితో వినాయక పూజని షూట్ చేశాను. ఇది యూట్యూబ్‌లో ఉంచుతున్నా. దీన్ని చూస్తూ పూజ చేస్తే సరిపోతుంది. ఆఫీసులో ఉద్యోగం చేసుకుంటూ ఈ వినాయక చవితిని నా వంతు ఎకోఫ్రెండ్లీగా చేస్తున్నాననే ఆనందం నాకుంది. వరలక్ష్మీ వ్రతానికీ చేయాలనుంది.

• రాళ్లపల్లి రాజావలి

స్వీట్ల వ్యాపారంలాగే ఆ ఇద్దరు స్నేహితుల మనసులు కూడా తీపే! అయితే అంతకంతకీ పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యం వాళ్లిద్దరి మనసుల్నీ చేదు చేసేసింది. మరీ ముఖ్యంగా గణపతుల నిమజ్జనంతో జరిగే నీటి కాలుష్యం వాళ్లని మట్టి విగ్రహాల తయారీకి పురిగొల్పింది. పదేళ్లుగా ఆ ఇద్దరు వ్యాపారులూ ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ఎకో ఫ్రెండ్లీ(పర్యావరణ హిత) మట్టి వినాయక విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఆలివ్ స్వీట్స్ వ్యాపారి దొరరాజు, 'ఎమరాల్డ్' స్వీట్ వ్యాపారి విజయ రామ్‌లను కదిలిస్తే ఎకో ఫ్రెండ్లీ వినాయక చవితి గురించి ఎన్నో తీపి కబుర్లు పంచుకుంటున్నారు.

ఎకోదంతమ్ ఉపాస్మహే!

చెరువును సేవ్ చేద్దాం రండి!

- విజయ రామ్

'పర్యావరణ సంక్షేమమే నా ధ్యేయం. ప్రతి చవితికీ ఎకో ఫ్రెండ్లీ గణపతి విగ్రహాలను తయారు చేయిస్తూ ఉంటాం. ఆ క్రమంలో ఐదు జిల్లాలకు చెందిన కుమ్మరి వాళ్లను చేరదీసి మట్టి విగ్రహాలను తయారుచేయిస్తూ మొత్తం 600 మందికి మా 'సేవ్' సంస్థ ద్వారా ఉపాధి భరోసా కల్పిస్తున్నాం' అంటున్నారు ఎమరాల్డ్ స్వీట్స్ వ్యాపారి విజయ రామ్. అలా 101 కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నారాయన. 'ఒకవేళ వాళ్లు తయారుచేసిన విగ్రహాల్లో ఏవైనా అమ్ముడుపోక మిగిలిపోతే వాటిని పండగ తర్వాత మేమే కొంటాం. ఇలాగే ప్రభుత్వమూ వాళ్లకి భరోసా కల్పిస్తే కుమ్మరుల జీవనం మెరుగవటంతోపాటు స్థానిక చెరువులూ కలుషితం కాకుండా ఉంటాయి. సేవ్ ఫౌండేషన్ ద్వారా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించటం, రోడ్ల విస్తరణలో తొలగించిన మొక్కల్ని తిరిగి నాటడం, ఇంకుడు గుంతల నిర్మాణం మొదలైన కార్యక్రమాలు చేపడుతున్నాం' అంటూ తన సేవ్ సంస్థ కార్యకలాపాల గురించి చెప్పుకొచ్చారు. 'హిందూ ధర్మంలో ఉన్న పండగలన్నీ కూడా ప్రకృతితో ముడిపడి ఉన్నవి, ప్రకృతిని పరిరక్షించేవే! కాబట్టే ప్రతి పండగలో పువ్వులు, మొక్కలు, నీరు భాగాలయ్యాయి. వినాయక చవితి పండగలో కూడా పత్రికి విశిష్టమైన స్థానం ఉంది. విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేసినప్పుడు దాంతోపాటు నీటిలో మునిగే విగ్రహం తాలూకు మట్టి, పత్రి చేపలకు ఆహారంగా ఉపయోగపడాలనే ఉద్దేశంతోనే ఈ సంప్రదాయం ఆచరణలోకొచ్చింది. కానీ ఇప్పుడు పరిస్థితి ఇందుకు పూర్తిగా విరుద్ధంగా తయారైంది. మట్టికి బదులు ప్లాస్టర్ ప్యారిస్ వాడటం వల్ల భూమికి, సహజ వనరులకు ఎంతో నష్టం కలిగిస్తున్నామనే స్పృహ కోల్పోయి పండగలు చేసుకుంటున్నాం. పట్టణాల్లోనే కాదు గ్రామాల్లో మనకు అన్నం పెట్టే, తాగు, సాగునీరు అందించే చెరువులు కూడా కలుషితమవుతున్నాయి. ఈ చెరువుల్లోని నీటినే పశువులు తాగుతున్నాయి. దాంతో వాటి పాలలో విషపూరితమైన కాడ్మియం, ఆర్సినిక్, కోబాల్ట్ తదితర రసాయనాలు చేరుకుని మన ఆరోగ్యాన్ని హరిస్తున్నాయి. ఇవన్నీ క్యాన్సర్ కారకాలే! నిజానికి పండగను ప్రకృతిలోని వస్తువులను ఉపయోగించే చేసుకోవాలి. ఇందుకోసం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను తయారుచేసే రాజస్థానీ కళాకారులకు స్థానిక కుమ్మరులను జోడించి ఈ కళను నేర్పించే ప్రయత్నంలో ఉన్నాం. ఫలితంగా వేసవి కాలంలో కుండలు చేసి మిగతా కాలమంతా చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ కుటుంబాలను పోషించుకునే కుమ్మరి వాళ్లకు పని దొరుకుతుంది.



పర్యావరణ మిత్రులు

మట్టితోనే మహా గణపతి

- దొరరాజు



పర్యావరణం మీద నాకు ఇంతటి ఆసక్తి ఏర్పడటానికి నేను చూసిన ఓ సంఘటన కారణం. మచిలీపట్నంలో ఓ ఆవుకు సర్జరీ చేసి పొట్టలోనుంచి 20 కిలోల ప్లాస్టిక్ సంచులు బయటికి తీశారు. ఈ సంఘటన నన్ను కలచి వేసింది. ఇంతలో 'ఎమరాల్డ్' స్వీట్స్ వ్యాపారి విజయ రామ్ నాకు పరిచయమయ్యారు. ఆయన కూడా ప్రకృతి, పర్యావరణ ప్రేమికుడు కావటంతో ఆయన తోడ్పాటు నా సంకల్పానికి బలాన్నిచ్చింది. 'మట్టి విగ్రహాలను తయారు చేద్దాం, హుస్సేన్ సాగర్‌ను కాపాడుదాం!' అనే నినాదం మొదలైంది మాతోనే! ఇలా 12 ఏళ్లుగా చేస్తున్నాను. పదేళ్లుగా దాదాపు 5 లక్షల మట్టి వినాయక విగ్రహాలను పంచాం. మొదట్లో వందలు, తర్వాత వేలల్లో, ఇప్పుడు దాదాపు 50 వేల విగ్రహాలను ప్రతి ఏడాదీ ఇస్తున్నాం. ఈ ఏడాది 30 వేల విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి. డిమాండ్‌ని బట్టి మిగతావి అప్పటికప్పుడు తయారు చేసి అందిస్తాం. ఈ విగ్రహాల తయారీ డిసెంబరు నుంచే మొదలుపెట్టాం. మట్టితో పెద్ద విగ్రహాలు కూడా తయారు చేయొచ్చు. ఈ విషయం నిరూపించటం కోసం 23 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహం ఈ ఏడాది పెట్టనున్నాం. రవాణా కష్టమనే అపోహలను తొలగించటం కోసం ఈ విగ్రహాన్ని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయాలని సంకల్పించాం.



గోరుపై ట్యాటూ టచ్!

కొందరికి ట్యాటూలు వేయించుకోవటం ఫ్యాషన్. మరికొందరికి అలవాటు. ఏదేమైనా ఫ్యాషన్ ప్రియులు ట్యాటూలంటే తెగ ఇష్టపడతారు. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ట్రెండ్ హల్‌చల్ చేస్తోంది. అదేంటంటే చేతి వేలు గోరుపై ఉండే భాగంలో ట్యాటూలు వేస్తున్నారు. చుక్కలు, బాణాలు, పూలు, చిన్న బొమ్మల ఆకారంలో మునివేళ్లపై ట్యాటూలు వేయించుకుంటున్నారు. పనిలో పనిగా ట్యాటూకి సరిపోయేట్లు గోళ్లరంగును మ్యాచింగ్‌గా వేసుకుంటున్నారు. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేసి మురిసిపోతున్నారు. డెర్మటాలజిస్ట్‌లు మాత్రం గోరుపై భాగంలో ఉండే చర్మం చాలా సున్నితమైనదనీ, ఇలాంటి ట్యాటూలకు దూరంగా ఉండటం మేలంటున్నారు.

యాంకెల్ సాక్స్ హవా!

షూలు వేసుకునేప్పుడు సాక్స్ వాడటం సహజం. అయితే తాజాగా షూలు, చెప్పులు లేకుండా సాక్స్ వేసుకోవటం ట్రెండ్‌గా మారింది. కొందరు ఫ్యాషన్ గాళ్స్ ఈ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. హాలీవుడ్‌లో పాప్ సింగర్ రిహానా, సూపర్ మోడల్ కెండెల్లా జెన్నర్ వరకూ ఈ సాక్స్‌లనే వాడుతున్నారు. ఫంక్షన్లకు కూడా హాజరవుతున్నారు. కాలు నేల మీద పెట్టకుండా రెడ్ కార్పెట్‌ల మీద నడిచే సెలబ్రిటీలు, ఫ్యాషన్ ప్రియులు విభిన్నమైన సాక్స్‌లు ధరిస్తున్నారు.



ఆదర్శం



కారడవిలో కాటన్ వారసులు

ఎక్కడి నుంచో వచ్చారు. అడవిలోనే అన్నీ అనుకున్నారు. పుడమితల్లికి పచ్చలహారం తొడగాలనుకున్నారు. రాములోరికి దండం పెట్టుకున్నారు. కాయకష్టాన్ని నమ్ముకున్నారు. ఫలితం.. ఆ పల్లెలో ఇప్పుడు అణువణువూ పచ్చదనమే! ఏడాది పొడుగునా జలసిరులే! ఎత్తయిన కొండల నడుమ తీర్చిదిద్దినట్టుండే ఆ ఊరు పేరు తడికవాగు. నట్టడవిలో ఉండే ఈ పల్లెను అందరూ ఆదర్శంగా తీసుకునేలా చేశారు ఇక్కడి ఆదివాసీలు.

మూడు దశాబ్దాల కిందట.. బతుకు భారమై.. విశాఖ ఏజెన్సీ నుంచి కొందరు ఆదివాసీలు ఇక్కడికి తరలివచ్చారు. గలగల పారుతున్న తడికవాగును చూసి.. అక్కడే కొత్త జీవితం ప్రారంభించాలని అనుకున్నారు. ఈ ప్రాంతం తూర్పు గోదావరి జిల్లాలోని ఏజెన్సీ మండల కేంద్రమైన చింతూరుకు 41 కిలోమీటర్ల దూరంలో ఉంది. అప్పటికి ఇక్కడ ఊరంటూ ఏదీ లేదు. ఈ ఆదివాసీలు తడికవాగు పరిసరాలను ఆవాసంగా మలుచుకున్న తర్వాత ఆ ప్రాంతానికి తడికవాగు అని పేరొచ్చింది.

ఆశలన్నీ ఆవిరి

ఎన్నో ఆశలతో వచ్చారిక్కడికి. తడికవాగులో జల సంపద చూసి అచ్చెరువొందారు. ఇక తమకు ఏ కష్టం రాదనుకున్నారు. అందరూ కలిసి పోడు వ్యవసాయం చేయడం ప్రారంభించారు. వర్షాలు చక్కగా కురిశాయి. చేనులో బంగారం పండింది. అందరూ పొంగిపోయారు. తమ కష్టాలన్నీ తీరాయని సంబరపడ్డారు. రెండో పంటకు సిద్ధమయ్యారు. ఈసారి వాన చుక్క పడలేదు. పంట చేతికి రాలేదు. పూట గడవడం కూడా కష్టంగా మారింది. రోజులు గడుస్తున్నాయి. బతుకు బండిని బలవంతంగా ఈడ్చుకొచ్చారు. సంతతి పెరిగింది. ఖర్చులూ పెరుగుతూ వచ్చాయి. వ్యవసాయాన్ని కాదనుకుంటే కూలి పనులు చేసుకోవాలి. 40 కిలోమీటర్లు వెళ్తే గానీ కూలి దొరకదు. కన్న ఊరును వీళ్లు కాదనుకున్నారు.. ఉన్న ఊరు వీళ్లను కాదంటోంది. దిక్కు తోచని స్థితిలో కాలం వెళ్లదీశారు. మంచి భవిష్యత్తు ఉంటుందని ఇక్కడికి వలస వచ్చిన కుటుంబాల్లో కొన్ని.. 'ఇదీ ఒక బతుకేనా' అనుకొని మళ్లీ వలస బాటపట్టారు. ఒక్కొక్కరుగా ఊరి విడిచి వెళ్లిపోసాగారు.

తడికవాగును నమ్ముకొని..

ప్రకృతి విధించిన శాపం నుంచి బయటపడేందుకు ఎవరికి తోచిన ఆలోచన వాళ్లు చేశారు. ఒకరోజు తడికవాగు ఒడ్డున కూర్చొని అలా ఆలోచిస్తున్న గమ్మిల బాలరాజుకు బుర్రలో ఏదో మెదిలింది. కళ్లల్లో సంతోషం తొంగిచూసింది. పరుగు పరుగున ఊళ్లోకి వెళ్లాడు. అందరినీ ఒకచోటికి రమ్మన్నాడు. బాలరాజు అంటే ఊళ్లో అందరికీ నమ్మకం. ఆయన మాటను ఎవరూ జవదాటరు. ఆ నమ్మకమే వారి జీవితాలను మార్చేసింది. వానలు కురిసినా.. కురవకపోయినా.. కొండలూ, కోనలూ దాటుకుంటూ వచ్చే తడికవాగు ఏడాది పొడుగునా పారుతూనే ఉంటుంది. ఆ వాగునే జీవనాధారంగా భావించాడు బాలరాజు. అదే విషయాన్ని తనవారికి తెలియజేశాడు. "తడికవాగు ప్రవాహానికి అడ్డుకట్ట వేసి (చెక్ డ్యామ్ నిర్మించి)



తడికవాగులో చెక్ డ్యామ్

నీటిని పంట పొలాలకు మళ్లించగలిగితే మన కష్టాలు తీరుతాయ"ని నమ్మకంగా చెప్పాడు బాలరాజు. అందరూ సరేనన్నారు.

> ### ఆజన్మాంతం కాషాయ వస్త్రాలే
>
> **తడికవాగు ఆదివాసీలు ఎంతటి శ్రమజీవులో అంతటి భక్తిపరులు. ఊరి నడిబొడ్డున అందరూ కలిసి రామాలయం నిర్మించుకున్నారు. రోజు ఉదయాన్నే గ్రామస్థులందరూ రామాలయానికి వెళ్తారు. రామయ్య దర్శనం తర్వాతే పొలం పనులకు వెళ్తారు. ఏటా ఏప్రిల్‌లో రాములోరికి ఉత్సవాలూ నిర్వహిస్తారు. ఊళ్లోని వారందరూ కాషాయ వస్త్రాలే ధరిస్తారు. 'అబద్ధం ఆడరాదు' అన్నది వారి కఠిన నిర్ణయం. అబద్ధం చెబితే ఏదో ఒక నష్టం వాటిల్లుతుందని విశ్వసిస్తారు. వీళ్లు కేవలం శాకాహారులే. మాంసం అనే మాటను కూడా సహించరు.**

రూపాయి ఖర్చు లేకుండా..

మరుసటి రోజుకు ప్రణాళిక సిద్ధమైంది. బాలరాజు నాయకత్వంలో పిల్లా-జెల్లా, ముసలి-ముతక అందరూ పలుగు-పార పట్టుకుని రంగంలోకి దిగారు. గ్రామంలోని రాములోరి గుడికి వెళ్లి దండం పెట్టుకుని పనిలోపడ్డారు. మొదట చెక్ డ్యామ్ నిర్మించదలచిన ప్రదేశం నుంచి తమ పొలాలకు పిల్ల కాల్వలు తవ్వారు. తన, మన అనే తారతమ్యం లేకుండా.. అందరి పొలాలకూ కాల్వలు తవ్వారు. కాల్వల పని పూర్తవ్వగానే చెక్ డ్యామ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తడికవాగుకు ఒకవైపు అడ్డంగా బండరాళ్లతో చెక్‌డ్యామ్ ఏర్పాటు చేశారు. ఊరంతా కలిసి నాలుగు నెలలు శ్రమిస్తే గానీ.. ఈ పనులన్నీ పూర్తవ్వలేదు. ఊరు దశను మార్చేసే జలయజ్ఞం కోసం వీరు ఒక్క రూపాయి వెచ్చించలేదు. సిమెంట్ కూడా వినియోగించలేదు. కేవలం కాయకష్టాన్ని మాత్రమే నమ్ముకున్నారు. 'మన ఊరు- మన భవిష్యత్తు' అని మనసారా భావించారు. చెక్‌డ్యామ్ నిర్మాణం విజయవంతంగా పూర్తి చేశారు.

పులకరించిన పుడమి

చెక్ డ్యామ్ మొదలుపెట్టే నాటికి తడికవాగు గ్రామంలో మిగిలింది పది కుటుంబాలే! ముప్ఫయ్ ఎకరాలు సాగులో ఉండేది. చెక్ డ్యామ్ పూర్తయ్యాక ఆ ఊరు దశ మారిపోయింది. నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో మాగాణం మురిసిపోయింది. నేల ఈనిందా అన్నట్టుగా పంటలు



పండాయి. వలస వెళ్లిన వాళ్లు మళ్లీ ఊళ్లోకి వచ్చారు. వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. కాయగూరలు పండిస్తున్నారు. పంటలు అడవి జంతువుల బారిన పడకుండా.. ఎవరి పొలాల్లో వారు మంచెలు ఏర్పాటు చేసుకొని కాపలా ఉంటున్నారు. దిగుబడి బాగా రాసాగింది. రెండు పూటలా తిండి పుట్టింది. ఇప్పుడు ఆ గ్రామం ఎత్తయిన కొండల నడుమ ఉన్న పచ్చలదీవిలా కనిపిస్తోంది. పిల్లగాలులతో ఆహ్లాదంగా అలరిస్తోంది. ఇప్పుడు వేసవిలో కూడా పంటలు పండించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు తడికవాగు వాసులు. " చెక్ డ్యాం ఏర్పాటు తర్వాత పంటలు బాగా పండుతున్నాయి. ఇప్పుడు మాకు సాగునీటికి కొదువ

> ### ఎప్పుడూ పనే!
>
> ఎక్కడి నుంచో పొట్ట చేత పట్టుకొని వచ్చిన ఆదివాసీలు పదుగురికీ ఆదర్శంగా నిలిచారు. ఈ గ్రామంలో పెద్దవారికి అక్షరజ్ఞానం లేదు. గిరిజన భాష మాట్లాడుతారు. వచ్చీరాని తెలుగులో పలకరిస్తారు. ఊళ్లోకి కొత్తగా ఎవరైనా వస్తే.. 'స్వామి' అని మర్యాదగా పిలుస్తారు. రెండు చేతులు జోడించి నమస్కరిస్తారు. అతిథి మర్యాదల్లో ఏ లోటూ రానివ్వరు. ఎప్పుడే ఏదో ఒక పని చేస్తూ ఉంటారు. సమయాన్ని అస్సలు వృథా చెయ్యరు.

లేదు. వేసవిలోనూ పంటలు పండించాలన్నది మా లక్ష్యం. అందుకు తగ్గట్టుగా కృషి చేస్తున్నాం" అంటారు బాలరాజు. ఇంతటి సంతోషంలోనూ తడికవాగు వాసులకు ఒక కష్టం ఉంది. అదే తాగునీరు. వానకాలంలో వాగు నీరు తాగడం వల్ల అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. "మా కష్టం మేం పడ్డాం. పొలాలకు నీళ్లొచ్చినయ్! మా దాహం మాత్రం తీరుతలేదు. వాగు నీళ్లు తాగితే రోగాలొస్తున్నయ్. ప్రభుత్వం స్పందించి మాకు ఒక బోరు వేయిస్తే.. వాళ్ల పేరు చెప్పుకుంటం" అంటోంది తడికవాగుకు చెందిన సుమిత్ర. కారడవిలో గొంతెండిపోతున్న పుడమితల్లి దాహం తీర్చిన కాటన్‌దొర వారసులు వీళ్లు. ఈ ఆదివాసీల గొంతు తడిపేందుకు సర్కార్ ముందు కురావాలని కోరుకుందాం.

చూసి తీరాల్సిందే!

రేపటి నుంచి గణేశ్ ఉత్సవాలు మొదలవుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో గణనాథులు కొలువుతీరనున్నారు. ఈ సమయంలో ప్రసిద్ధిగాంచిన కొన్ని గణేశ ఆలయాలనూ, ఈ నవరాత్రుల కోసం వెలసిన మండపాలను చూసి వచ్చేందుకు ప్లాన్ చేసుకోవచ్చు. ఈ మండపాల్లో కొలువుతీరే గణనాథులను ఒక్కసారైనా చూసి తరించాల్సిందే!



హైదరాబాద్

హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలు ఎంత వైభవంగా జరుగుతాయో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. నగరమంతా దాదాపు 60 వేలకు పైగా గణేశ్ మండపాలు కొలువుతీరుతాయి. ఖైరతాబాద్ గణేశ్ అన్నింటికన్నా ముఖ్యమైనది. హైదరాబాద్‌లో కొలువుతీరే గణనాథులన్నింటిలో కెల్లా ఖైరతాబాద్ గణనాథుడి విగ్రహం ఎత్తు ఎక్కువ. గణేశుని చేతిలో పెట్టే ప్రసాదానికి కూడా విశిష్టత ఉంటుంది. బాలాపూర్, దుర్గం చెరువు, గౌలిపుర, చైతన్యపురి ప్రాంతాల్లో కొలువుతీరే గణనాథులను కూడా చూడాల్సిందే. ఇక్కడ గణేశుని చెంత ఉంచిన ప్రసాదాన్ని చివరి రోజున వేలం నిర్వహిస్తారు. ఈ ప్రసాదం వేలంలో కొన్ని లక్షల ధర పలుకుతుంది.

ముంబయ్

ఇక్కడ గణేశ్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. గణేశ్ ఉత్సవాలను ఛత్రపతి శివాజీ కూడా ఘనంగా నిర్వహించే వాడంటారు. ఆయన స్ఫూర్తి ఇక్కడ కనిపిస్తుంది. ముంబయ్‌లో లాల్‌బౌచా రాజా, ముంబైచా రాజా, సిద్ధివినాయక టెంపుల్, ఖేట్‌వాడీ గణ్‌రాజ్ మండపాలు ప్రధానమైన మండపాలు. ఏడు నుంచి పదిరోజుల పాటు జరిగే గణేశ్ ఉత్సవాలు కన్నుల పండువగా ఉంటాయి. నిమజ్జనం రోజున ముంబయ్ వీధులన్నీ భక్తులతో నిండిపోతాయి. గణేశ్ ప్రతిమలతో సాగరతీరం శోభాయమానంగా ఉంటుంది.

గణపతిపూలె

మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలోని రత్నగిరి జిల్లాలో ఉన్న చిన్న పట్టణం ఇది. ఇక్కడ 400 ఏళ్లనాటి స్వయంభూ గణపతి ఆలయం ఉంది. గణేశ్ చతుర్థిని పురస్కరించుకుని ఇక్కడ పదిరోజుల పాటు పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు. గణేశ్ చతుర్థి పర్వదినాన ఏటా వేల మంది ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు. వినాయక నవరాత్రుల సమయంలో సందర్శించి తీరాల్సిన ప్రదేశం ఇది.



పుణె

గణేశ్ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగే నగరాల్లో ఇదొకటి. ఇక్కడ కస్బ గణపతి, తంబ్డి జోగేశ్వరి గణపతి, గురూజీ తాలిం, తుల్సీ బాగ్ గణపతి, కేసరివాడ గణపతి మూర్తులను తప్పక సందర్శించాల్సిందే. పుణె సంస్కృతీ, సంప్రదాయాలు ఈ పండుగలో వెల్లివిరుస్తాయి. క్లాసికల్ డ్యాన్స్, సంగీత పోటీలు, డ్రామా ఫెస్టివల్స్, ఆటోమొబైల్ ర్యాలీలు, సంప్రదాయ ఆటలతో ఈ పదిరోజులు నగరమంతా సందడిగా ఉంటుంది.

కాణిపాకం

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో ఉన్న గ్రామం ఇది. ఇక్కడ వరసిద్ధి వినాయకుడు కొలువై ఉన్నాడు. ఇక్కడి ఆలయంలోని వినాయకుని ప్రతిమ పెరుగుతూ ఉంటుందని చెబుతారు. 11వ శతాబ్దంలో చోళులు నిర్మించిన ఈ ఆలయాన్ని గణేశ్ చతుర్థి సమయంలో దర్శించి తీరాల్సిందే. గణేశ్ చతుర్థి రోజున బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి. 21 రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతాయి.

డైలీ సుడోకు - 162

				9				
2	7			5	6	1		
		6	7		1			5
			9			7	1	
9								8
	1	7			3			
3			4		2	6		
		4	1	3			5	9
				6				

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 161 సమాధానం

[illegible]

లైఫ్ లెసన్

అలనాటి చంద్రుడు.. పలనాటి వీరుడు!

పల్నాటి యుద్ధంలో అసువులు బాసిన అందగాడు బాలచంద్రుడు. బ్రహ్మనాయుడి భార్య ఐతాంబ. వారికి చాలా కాలం పిల్లల్లేరు. ఎన్నెన్నో నోములు, నోచారు. అలా లేకలేక పుట్టినవాడు బాల చంద్రుడు. అప్పట్లో ఈ కుటుంబం ఉండేది నేటి ప్రకాశం జిల్లా మేడపి ప్రాంతం.

బాలచంద్రుడికి అయిదేళ్లుండగా.. ఒకసారి జాతకాలు చూపించారు. ఈ పిల్లాడి వల్ల తండ్రికి మృత్యుగండం అని తేల్చేశారు జ్యోతిష్యులు. బెంబేలెత్తి పోయాడు బ్రహ్మనాయుడు. కన్నబంధం కన్నా తన ప్రాణ భయం మిన్న. తన కుడి భుజం కన్నమదాసుని పిలిచాడు. కన్న కొడుకునే చంపేయమన్నాడు.


కానీ కన్నమదాసుకి మనసొప్పలేదు. పాలబుగ్గల చంటి పిల్లాణ్ణి చూస్తూ చూస్తూ ఎలా వధించడం? అందుకే ఆ బాలుడిని బ్రహ్మనాయుడి తమ్ముడు పేరినాయుడి ఇంట ఉంచాడు. అక్కడే పెరిగి పెద్దవాడయ్యాడు. యుద్ధనీతి, అస్త్రశస్త్ర విన్యాసం, విలువిద్య, గుర్రపుస్వారీ అన్నీ నేర్చుకున్నాడు.

ఇంతలో పెళ్లీడుకొచ్చాడు బాలచంద్రుడు.

మాచర్లలో గండు కన్నమనాయుడు అనే ధనవంతుడు ఉన్నాడు. ఆయన కూతురు మాంచాల. పెళ్లీడుకొచ్చింది. ఆ విషయం కన్నమదాసుకి తెలిసింది. ఓ రోజు బ్రహ్మనాయుడి కొలువుకి రమ్మని కన్నమనాయుడికి దాసు సలహా ఇచ్చాడు. మరోవైపు- అక్కడే నూనుగు మీసాల నూత్న యవ్వనుడు బాలచంద్రుడిని ప్రవేశ పెట్టాడు. ఎవరా అని అంతా ఆశ్చర్యపోయారు. జరిగిందంతా అరక్షణంలో చెప్పాడు కన్నమదాసు.

కోపంతో బ్రహ్మనాయుడు ఊగిపోయాడు. అంతా సర్ది చెప్పారు. అయ్యిందేదో మంచికే కదా అన్నారు. ఆపై మాంచాల, బాలచంద్రుడి పెళ్లి జరిగింది. అంతలో పలనాటి యుద్ధం వచ్చింది.

బ్రహ్మనాయుడు కారెంపూడి వెళ్లాడు కదనానికి. రాణి వాసానికి రక్షకుడిగా బాలచంద్రుడిని నియమించారు. తానూ యుద్ధానికి వెళ్లాలని ఉత్సాహపడ్డాడు. కానీ లాభం లేకపోయింది.



'పల్నాటి యుద్ధం' సినిమాలో బాలచంద్రుడిగా అక్కినేని

కాలక్షేపం కోసం- అనపోతు, బోర్నీడు, చంద్రన్న, మంచన్న, తేర్కుడు లాంటి స్నేహితులతో గడిపేవాడు. గుమ్మడికాయలాట, చెరకు పందాల ఆట ఆడేవారు.

ఓరోజు బొంగరాలాటకి సిద్ధమయ్యారు. అంతా మొల్లరావి చెట్టు దగ్గర గుమిగూడారు ఆడడానికి. ఆడామగా, ఆబాల గోపాలమూ తరలివచ్చారు చూడడానికి. గాల్లోకి విసిరాడు. అది వెళ్లి వెళ్లి చత్రాతిని తాకి- పైకెళ్లి- సర్రున కిందకిదిగి- అన్నమ్మ అనే స్త్రీ కాలికి తగిలింది. ఆమె మూర్ఛపోయింది.

బాలచంద్రుడు కంగారుగా ఆమె దగ్గరికి వెళ్లాడు. సపర్యలు చేశాడు. తన పచ్చవన్నెల పట్టు వస్త్రాల్ని చింపి ఆమె కాలుకి కట్టాడు. కొంతసేపటికి ఆమె తేరుకొని కనులు తెరిచింది. కానీ ఏమీ అర్థం కాక- బాలచంద్రుడిని తిట్టింది- "నీ తండ్రి కారంపూడి పోరుకి వెళితే ఇక్కడ నీకు బొంగరాలాటా? కాంతలయెడ ఇంత పొగరా? సిగ్గులేదా?" అని నోరు పారేసుకొంది.

ఆ పలుకులు ములుకుల్లా గుచ్చుకొన్నాయి బాలచంద్రుడికి. నేరుగా తల్లి దగ్గరకు వెళ్లాడు. తానూ యుద్ధానికి వెళ్తానన్నాడు. ఆమె ససేమిరా అంది.

"భయపడుతున్నావా అమ్మా. మరి నేను నేర్చుకున్న యుద్ధ విద్యలు దేనికి?" అని ప్రశ్నించాడు. ఐతాంబకి అర్థమైంది. ఇక అతడిని ఆపలేమని. అందుకే భార్య మాంచాలకి చెప్పి యుద్ధానికి వెళ్లమంది. అందుకోసం మాచర్లకి పయనమవమంది. ఆలిని చూస్తే ఆవేశం తగ్గి మెత్తపడతాడేమోనన్నది ఆమె ఆశ. అతడు అత్తారింటికి వెళ్లే లోపు- బాలచంద్రుడి మనసుని మార్చమని- కోడలు మాంచాలకి కబురంపింది ఐతాంబ.

ఎదురుగా బాలచంద్రుడు. చాన్నాళ్లకి వచ్చిన ప్రాణకాంతుడు. మాంచాల సంబరపడిపోయింది. అంతలోనే నిరుత్సాహం. మనోనాథుడిని సమరానికి పంపాలా?

వీర గంధం తెచ్చి వీరుడిగా సాగనంపాలా? పిరికితనం నూరిపోయాలా? సతమతమైంది మాంచాల. అత్తగారి మాట ఒకవైపు. భర్త పోరాటం మరోవైపు తేల్చుకోలేక పోయింది.

వెంటనే తల్లి రేఖాంబ దగ్గరకి వెళ్లింది. ఏది ధర్మమో చెప్పమంది.

"యుద్ధం చెయ్యడం మానవ కర్తవ్యం. ప్రాణాలు ఇక్కడ శాశ్వతం కాదు. మరణం ఎప్పుడూ పొంచి ఉంటుంది. దానిని తప్పించే శక్తి ఎవరికీ లేదు. భావి మానవుల హృద్భవనాలలో నీ భర్త స్ఫూర్తిని నింపు".

ఈ మాటలు బలంగా పని చేశాయి మాంచాలపై.

చిరునవ్వు వెలసింది బాలచంద్రుడి పెదాలపై.

నిర్మలత్వం వెల్లివెరిసింది మాంచాల మోముపై.

ఆమె వీరాంగనయై బాలచంద్రుడికి శౌర్య తిలకం దిద్ది సమరానికి సాగనంపింది.

యుద్ధంలో బాలచంద్రుడు మరణించి ఉండొచ్చు. కానీ పౌరుషంతో పోరాడి నేటికీ జీవించి ఉన్నాడు.

- ఆకెళ్ల రాఘవేంద్ర





మిర్యాల రవీందర్‌రెడ్డి, బోయపాటి శ్రీను, రకుల్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్

నేను నమ్మితేనే చేస్తా

- బోయపాటి శ్రీను

"నాకు సంపూర్ణ నమ్మకం కలిగితేనే ఏ సినిమానైనా చేస్తా. ఎన్ని తరాలు మారినా కుటుంబ విలువలు, భావోద్వేగాల్లో మార్పు రాదు. 'జయజానకి నాయక' సక్సెస్‌కు ప్రధాన కారణం అదే" అని బోయపాటి శ్రీను అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్ జంటగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన చిత్రం 'జయ జానకి నాయక'. ఈ సినిమా సక్సెస్‌మీట్ హైదరాబాద్‌లో బుధవారం జరిగింది. దర్శకుడు మాట్లాడుతూ "ఎవరికీ చెడు చేయకూడదనుకునే మనస్తత్వం నాది. ఈ సినిమాలో హీరోని హైప్ చేశాను. భవిష్యత్తులో అతను ఏదైనా తత్తరపడినా మరలా అతనితో సినిమా చేస్తానని మాటిచ్చాను. అలాగే మంచి నిర్మాతలు పరిశ్రమకు ఎంతో అవసరం. ఈ నిర్మాతతోనూ భవిష్యత్తులో కలిసి ప్రయాణం చేస్తాను. 'జయ జానకి నాయక'కు థియేటర్లు అన్నీ ఫుల్స్ కావడం ఆనందంగా ఉంది" అని చెప్పారు. "అన్నీ వర్గాల ప్రేక్షకులకూ రీచ్ అయింది మా చిత్రం. మంచి లవ్‌స్టోరీ, చక్కటి డ్రామా, సెంటిమెంట్ అన్నీ ఉన్నాయి" అని నిర్మాత తెలిపారు. హీరో మాట్లాడుతూ "లైఫ్ ఛేంజింగ్ చిత్రమిది. ప్రతి గుండెనీ టచ్ చేసింది. రెండు సినిమాల తర్వాత ఏదైనా తత్తరపాటు ఉన్నా తాను చూసుకుంటానని ధైర్యం చెప్పిన బోయపాటిగారికి ధన్యవాదాలు" అని అన్నారు. "మన ప్రమేయం లేకుండా జరిగే తప్పులను తలచుకుని అమ్మాయిలు కుంగిపోనవసరం లేదు.. బంగారు భవిష్యత్తు కోసం అడుగులు వేయొచ్చు.. అనే చక్కటి సందేశాన్ని ఈ సినిమా ద్వారా ఇచ్చాం" అని రకుల్ చెప్పారు.

రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రియమణి పెళ్లి



హీరోయిన్ ప్రియమణి దాంపత్యజీవనంలోకి అడుగుపెట్టారు. ముంబైకు చెందిన ఈవెంట్ మేనేజర్ ముస్తఫా ఇస్మాయిల్ రాజ్‌ను ఎటువంటి ఆడంబరం లేకుండా వివాహం చేసుకున్నారు. ముందుగా ప్రకటించినట్లుగా బుధవారం జయనగర్‌లోని రిజిస్ట్రార్ ఆఫీసులో దండలు మార్చుకుని వివాహం చేసుకున్నారు. గత ఏడాది ప్రియమణి ముస్తఫా ఇస్మాయిల్ రాజ్‌తో నిశ్చితార్థం జరిగింది. కేవలం ఇరువురు కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రులు మాత్రమే హాజరయ్యారు. గురువారం కొత్తనూరులోని ఎల్లెన్ కన్వెన్షన్‌హాల్‌లో రిసెప్షన్ జరుగనుంది. ఇటీవల కాలంలో సినిమాతారల పెళ్ళి అంటే అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. కానీ ప్రియమణి సాధారణంగా పెళ్ళి చేసుకుని ఆదర్శమార్గం చూపారు. పెళ్ళి అయిన రెండు రోజులలోనే సినిమా షూటింగ్‌లో పాల్గొంటానని ఆమె ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

- ఆంధ్రజ్యోతి, బెంగళూరు





సైలెంట్ బాదుడు

(మూడో పేజీ తరువాయి)

వ్యతిరేకిస్తున్న డీలర్ల ప్రయోజనాలు కాపాడేందుకే.. వారికి లాభాలు వచ్చేందుకే ఇలా రోజుకు కొంత మొత్తం చొప్పున వినియోగదారులపై ధరల భారాన్ని మోపుతున్నట్లు ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ పద్ధతి రాకముందు ప్రతి పదిహేను రోజులకొకసారి చమురు సంస్థలు పెట్రో ధరలను సమీక్షించి కొత్త ధరలను ఖరారు చేసేవి. రెండు నెలల క్రితం దీన్ని రోజువారీ విధానానికి మార్చారు. ఇది తొలుత వినియోగదారులకు లాభదాయకంగానే ఉంది. రోజుకు పావలా నుంచి అర్ధరూపాయి దాకా తగ్గుతూ రావడంతో వినియోగదారులు కూడా ఈ విధానంపై సంతృప్తి వ్యక్తంచేశారు. కానీ, గత నలభై రోజులుగా పెరుగుదలే తప్ప తగ్గుదల నమోదవట్లేదు. అయితే, చమురు కంపెనీలు మాత్రం.. ముడిచమురు ధరలు పెరగడమే ఈ పెరుగుదలకు కారణమని చెబుతున్నాయి. ప్రస్తుతం క్రూడాయిల్ ధర బ్యారెల్ 52 డాలర్లుగా ఉందని.. మున్ముందు మరింత పెరిగే అవకాశం ఉందనే అంచనాలున్నాయి.

ఏపీలో ఇలా..

జూన్ 1న ఏపీలో పెట్రోలు ధర రూ.73.1, డీజిల్ ధర రూ.63.02 ఉంది. ఆ తర్వాత జూన్ 16న చివరిసారిగా పక్షంరోజుల సమీక్ష జరిగినప్పుడు పెట్రోలు రూ.71.57, డీజిల్ రూ.61.33గా ఉంది. ఆ తర్వాత రోజునుంచి ధరలు ప్రతిరోజూ మారుతూ వస్తున్నాయి. ఆ తర్వాత జులై 1 నాటికి పెట్రోలు రూ.69.09, డీజిల్ రూ.60.32కు చేరింది. దాంతో పోలిస్తే బుధవారం నాటి ధరలను పరిశీలిస్తే... పెట్రోలు రూ.5.61, డీజిల్ రూ.3.76 ధరలు పెరిగి, పెట్రోలు ధర రూ.74.7, డీజిల్ రూ.64.08గా ఉన్నాయి. రోజువారీ ధరల సమీక్షలో భాగంగా పెట్రోలు ధర చివరిసారిగా జూలై 14న మాత్రమే రెండు పైసలు తగ్గింది. ఆ తర్వాత ఇప్పటివరకూ 40 రోజుల పాటు ఒక్క పైసా కూడా పెట్రోలు ధర తగ్గకపోవడం గమనార్హం. డీజిల్ ధరలో మాత్రం హెచ్చుతగ్గులు అప్పుడప్పుడూ కనిపిస్తున్నాయి. ఏపీలో ఒక్కో లీటరుకు రూ.4 అదనపు వ్యాట్ భారం పడుతోంది. దీనివల్ల ఏపీ కంటే హైదరాబాద్‌లో డీజిల్‌పై రూ.1.9, పెట్రోలుపై రూ.1.76 ధరలు తక్కువగా ఉన్నాయి.

హైదరాబాద్‌లో నేటి పెట్రో ధరలు ఇలా

డీజిల్		పెట్రోల్	
పాత ధర	రూ.61.97 పై	పాతధర	రూ.72.77 పై
కొత్త ధర	రూ.61.98 పై	కొత్త ధర	రూ.72.93 పై
పెరుగుదల	00.01పైసలు	పెరుగుదల	0.16పైసలు

నంద్యాలలో 81% భారీ పోలింగ్!

- **28న ఓట్ల లెక్కింపు.. మధ్యాహ్నానికి ఫలితం**

కర్నూలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అందరి దృష్టినీ ఆకర్షించిన ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల ఉప ఎన్నికల సమరం ముగిసింది. బుధవారం ఉదయం ఓటర్లు పోలింగ్ బూత్‌ల ముందు బారులు తీరారు. పట్టణానికి మించి పల్లెల్లో మరింత జోరుగా పోలింగ్ బూత్‌ల బాట పట్టారు. మొత్తంగా నంద్యాల నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ఏకంగా 81% ఓటింగ్ నమోదైంది. కడపటి వార్తలు అందేసరికి.. పట్టణంలో 42 వార్డుల పరిధిలో 74.06 శాతం, నంద్యాల రూరల్‌లో 87.61 శాతం.. టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానంద రెడ్డి, వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డిల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. 28న ఫలితం వెలువడనుంది.

టీడీపీదే విజయం!: లగడపాటి

నంద్యాల ఉప ఎన్నికలో విజయం తెలుగుదేశం పార్టీదేనని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ జోస్యం చెప్పారు. బుధవారం సాయంత్రం పోలింగ్ ముగిశాక.. ఓటింగ్ సరళిపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఓటింగ్ శాతం పెరిగినందున.. ఫలితంలో మార్పు వస్తుందని, వైసీపీ విజయం సాధిస్తుందనడం సరికాదన్నారు.



సోమాజిగూడలో ఆదిలాబాద్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎడం బాపూజీ ఇంట్లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆస్తులు ఐదు కోట్లు

ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలతో ఏసీబీ దాడులు

హైదరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే ఆరోపణలపై ఆదిలాబాద్ జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బి.బాపూజీ ఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. బాపూజీ ఇల్లు, ఆఫీసుతోపాటు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో బుధవారం ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఉదయం నుంచి కొనసాగిన తనిఖీల్లో బాపూజీకి రూ.5 కోట్లు విలువైన ఆస్తులున్నట్లు గుర్తించారు. ఆయన ఆఫీసులో రికార్డులను పరిశీలించి కొన్నింటిని స్వాధీనం చేసుకున్నారు. వరంగల్, కరీంనగర్ జిల్లాలకు కూడా బాపూజీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నందున ఆయా జిల్లాల్లోని ఆఫీసుల్లోనూ తనిఖీలు కొనసాగాయి. పక్కా సమాచారం మేరకు సోదాలు చేశామని ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ పాపాలాల్ వెల్లడించారు. బాపూజీని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో అధికారులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఇవీ ఆస్తులు...

- బంజ్లగూడలో రూ.1.2 కోట్ల విల్లా
- సోమాజిగూడలో రూ.10.25 లక్షల విలువైన ఫ్లాట్
- హయత్‌నగర్‌లో రూ.2.44 లక్షల విలువైన రెండు ఓపెన్ ప్లాట్లు
- రూ.12 లక్షల విలువైన ఆభరణాలు.
- రూ.2.04 లక్షల నగదు.
- రూ.8.80 లక్షల బ్యాంకు బ్యాలెన్స్
- రూ.8.5 లక్షల విలువైన ఫోర్డ్ కారు.
- రూ.45 వేలు విలువైన హీరో హోండా బైక్.



'సాగర్'కు గడ్డు కాలం

నీరు లేక కళ తప్పిన రిజర్వాయర్

ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

15 సంవత్సరాలుగా నీటి విడుదల వివరాలు

సంవత్సరం	నీటివిడుదల నెల	నీటి మట్టం (అడుగుల్లో)
2001	ఆగస్టు 20	509.80
2002	సెప్టెంబర్2	510.40
2003	నీటి విడుదల జరగలేదు	
2004	ఆగస్టు 20	517.00
2005	ఆగస్టు1	506.60
2006	జూలై1	559.50
2007	జూలై27	587.80
2008	జూలై13	534.10
2009	ఆగస్టు26	504.30
2010	ఆగస్టు14	518.90
2011	జూలై11	553.60
2012	సెప్టెంబర్, డిసెంబరులో తాగునీటి అవసరాలకు మాత్రమే	
2013	ఆగస్టు 2	540.10
2014	ఆగస్టు 6	514.90
2015	నీటివిడుదల చేయలేదు	512.70
2016	నీటి విడుదల చేయలేదు	504.10
2017	నీటి విడుదల చేయలేదు	500.20 (ప్రస్తుతం)

నాగార్జునసాగర్, ఆగస్టు 23: రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఐదు జిల్లాల పరిధిలో సాగు, తాగు నీటిని అందిస్తున్న నాగార్జునసాగర్‌కు గడ్డు రోజులొచ్చాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటి జాడలేక ప్రాజెక్టు కళ తప్పింది. ఏటా ఆగస్టులో జలకళ సంతరించుకునే సాగర్ సెప్టెంబరు నెల సమీపిస్తున్నా నీరు లేక వెలవెలబోతోంది. 13 ఏళ్లుగా ఎన్నడూ లేనంతగా నీటి నిల్వలు తగ్గిపోవడంతో ఆయకట్టు రైతాంగం పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఏటా ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం సాగర్‌లో చేరుతుండటంతో ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సరిపడా నీరుండేది. అయితే.. మూడేళ్ల నుంచి అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రిజర్వాయర్‌లోకి నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఫలితంగా కృష్ణా పరివాహక ప్రాంతంలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి ఏర్పడింది. రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలకు ఎగువన ఉన్న ఆల్మట్టిలో 2లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం ఆల్మట్టి నుంచి వచ్చే నీటిని విద్యుత్తు ఉత్పత్తికి వినియోగిస్తున్నారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు వరద నీటితో నిండితేనే ఖరీఫ్ పంటకు నీటిని విడుదల చేయడం సాధ్యమవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో సాగర్ కుడి, ఎడమ, కాల్వల పరిధిలోని 21లక్షల ఎకరాలకు సాగునీరు అందడం కష్టంగానే కనిపిస్తోంది. కాగా, సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు (312 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం కనిష్ఠ స్థాయి 500. 30 అడుగులుగా ఉంది. ఇది 115.78 టీఎంసీలకు సమానం. ప్రాజెక్టులోకి నీరు రాకపోవడంతో 2 రాష్ట్రాల్లో తాగు, సాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అటు నుంచి అటే వెనక్కి!

(మూడో పేజీ తరువాయి)

వరదలు వచ్చినా.. రాష్ట్రానికి చుక్క నీరు వచ్చే వీలు లేకుండా కర్ణాటక అమలుచేస్తున్న వ్యూహమే ఇందుకు కారణం. కృష్ణా నదిపై కర్ణాటకలో ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ వంటి ప్రాజెక్టులు 15 రోజుల క్రితమే పూర్తి స్థాయిలో నిండాయి. దీంతో భవిష్యత్తులో వచ్చే వరద నీరు నేరుగా దిగువ ప్రాంతంలోని శ్రీశైలంలోకి వస్తుందని రాష్ట్ర ఇంజనీర్లు అంచనా వేశారు. అయితే ఈ అంచనాకు భిన్నంగా కర్ణాటక ప్రభుత్వం తమ వ్యూహాన్ని అమలు పరుస్తున్నది. ప్రస్తుతం ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని వేగంగా ఖాళీ చేస్తోంది. వారం రోజుల్లోనే సుమారు 15 టీఎంసీల నీటిని ఇతర ప్రాంతాలకు తరలించింది. దాంతో గతంలో పూర్తిగా నిండిన ప్రాజెక్టులు ప్రస్తుతం కొంత ఖాళీ అయ్యాయి. 129 టీఎంసీల సామర్థ్యం గల ఆల్మట్టిలో ప్రస్తుతం 121 టీఎంసీల నీరే ఉంది. అలాగే 37 టీఎంసీల సామర్థ్యం ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 34 టీఎంసీల నీరే ఉంది. మరో వారం పది రోజుల్లో మరో 15 టీఎంసీల నీటిని ఈ ప్రాజెక్టుల్లో నింపుకునే వీలుంది.

ఇలా మళ్లిస్తున్నారు..

కర్ణాటక రాష్ట్రం ఆల్మట్టి ద్వారా ఏఎల్‌బీసి మూడు దశల నుంచి, ముల్వాడ, హెర్కల్ వంటి లిఫ్టుల ద్వారా నీటిని మళ్లించి ఇప్పటికే నిర్మించిన రిజర్వాయర్లలో నింపుతోంది. అలాగే నారాయణపూర్ నుంచి మూడు దశల్లో ఉన్న నారాయణపూర్ లెఫ్ట్ బ్యాంకు కెనాల్, ఇంది లిఫ్టు, రాంపూర్ లిఫ్టు, బీమా, మల్లబాద్ వంటి లిఫ్టుల ద్వారా నీటిని తరలిస్తున్నారు. ఈ లిఫ్టులు, కాల్వలను ఆధారం చేసుకుని కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే పలు రిజర్వాయర్లను చేపట్టింది. ఇలా ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి తరలించే నీటిని పొలాలకు సరఫరా చేయడమే కాకుండా రిజర్వాయర్లలో కూడా నిల్వ చేస్తున్నారు. దీని ప్రభావం దిగువ ప్రాంతంలోని మన ప్రాజెక్టులపై పడుతున్నది.

పెరిగిన నీటి వాడకం!

పాత ట్రైబ్యునల్ తీర్పు ప్రకారం.. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి ఏడాదికి కర్ణాటక ప్రభుత్వం 173 టీఎంసీల నీటిని మాత్రమే ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ తీర్పులో ఈ వాడకాన్ని 303 టీఎంసీల వరకు పెంచారు. అయితే.. ఈ తీర్పును సవాల్ చేస్తూ మన రాష్ట్రం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దాంతో కొత్త తీర్పు ఇంకా అమల్లోకి రాలేదు. అంటే.. ప్రస్తుతం కర్ణాటక ప్రభుత్వం 173 టీఎంసీల నీటిని మాత్రమే ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. అయితే.. అందుకు భిన్నంగా కర్ణాటక నీటి వాడకాన్ని భారీగా పెంచింది. ఈ సీజన్‌లో ఇప్పటికే 50 టీఎంసీలను ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా మళ్లించిదని, ఇలాగే కొనసాగితే ఏడాది 350 టీఎంసీలు ఉపయోగించుకునే అవకాశం ఉందని తెలంగాణ ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

శ్రీశైలం, సాగర్ ఆయకట్టుకు దెబ్బే

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుకు సంబంధించి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ దెబ్బ తిన్నట్టేనని అధికారులు భావిస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల నుంచి సాగునీటిని విడుదల చేయాలంటే.. కనీసం 70 టీఎంసీల నీరు ఎగువ నుంచి రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆ అవకాశం కనిపించడం లేదు. దాంతో సాగర్ ఎడమగట్టు కాల్వ పరిధిలోని సుమారు 6.5 లక్షల ఎకరాలతో పాటు కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టుల పరిధిలోని సుమారు 13 లక్షల ఎకరాల ఆయకట్టుపై ప్రభావం పడనుంది. ఒక వేళ భవిష్యత్తులో వరదలు వచ్చి ప్రాజెక్టులు నిండినా.. రబీకి సాగునీటిని ఇచ్చే అవకాశం ఉంటుంది.

కాళేశ్వరానికి ఓకే



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సమ్మతిస్తూ చేతులు లేపి ఆమోదం తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, భూ నిర్వాసితులు, రైతులు

(మూడో పేజీ తరువాయి)

పెద్దపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ రసాభాసగా మారింది. భూ నిర్వాసితుల తరఫున మాట్లాడిన కాంగ్రెస్ నేతలు.. ప్రభుత్వ తీరును తప్పుబట్టడంతో వివాదం చెలరేగింది. టీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల బాహాబాహీకి దారితీసింది. ఈ కార్యక్రమంలో తొలుత అధికార పార్టీకి చెందినవారు మాట్లాడగా, నిర్వాసితుల తరఫున ఆ సంఘం అధ్యక్షుడు ఉప్పట్ల శ్రీనివాస్ మాట్లాడారు. అదే సమయంలో కాంగ్రెస్ నేత డి.శ్రీధర్ బాబు సభా ప్రాంగణంలోకి రాగా, కాం గ్రెస్ కార్యకర్తలు సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఆ వెంటనే టీఆర్ఎస్ కార్యకర్తలు శ్రీధర్ బాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయడంతో వివాదం ముదిరింది. హాల్లో ఉన్న కుర్చీలు తీసి ఒకరిపై ఒకరు విసురుకున్నారు. ఉప్పట్ల శ్రీనివాస్‌పై దాడి చేసి చితకబాదారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. దీన్ని నిరసిస్తూ శ్రీధర్‌బాబు.. సభాప్రాంగణం ఎదుట బైఠాయించారు. పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడంతో కాంగ్రెస్ శ్రేణులు సభ నుంచి వాకౌట్ చేసి పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్ ప్రభాకర్ రెడ్డి, ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, మధుకర్, ఎమ్మెల్సీ టి.భానుప్రసాదరావు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్ కెనాల్.. నిర్మాణానికి సమ్మతమే

కాళేశ్వరం ప్రాజెక్టు సబ్ కెనాల్ నిర్మాణం, పర్యావరణ ప్రభావంపై సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో సానుకూలత వ్యక్తమైంది. అయితే ఆయా గ్రామాల రైతులు మాట్లాడకపోవడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ నేతలు సర్వేను వ్యతిరేకించినా కెనాల్ నిర్మాణానికి సమ్మతి తెలిపారు. కలెక్టర్ మాణిక్‌రాజ్, ఎంపీ పాటిల్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫరిదుద్దీన్ పాల్గొన్నారు.

నష్ట పరిహారం సంగతేంటి?

కామారెడ్డి జిల్లాలో 22వ ప్యాకేజీ కింద నిర్మించనున్న మోతె, కాచాపూర్, తిమ్మకపల్లి, కాటేవాడి, దొంతేపల్లి, రిజర్వాయర్లకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులు తమకు నష్టపరిహారం చెల్లించాకే భూములు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పిస్తామని జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, హన్మంత్‌షిందే భరోసా ఇచ్చారు.

శ్రీధర్‌బాబు అరెస్టు అక్రమం

- **కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణలో..**
- **ప్రభుత్వ వైఖరి కుట్రపూరితం: భట్టి విక్రమార్క**
- **బల ప్రదర్శనగా.. ప్రజాభిప్రాయ సేకరణ : జీవన్‌రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ విషయంలో టీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. రైతుల తరపున ప్రశ్నిస్తే పోలీసులతో దాడి చేయిస్తోందన్నారు. బుధవారం ఆ పార్టీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డిలతో కలిసి అసెంబ్లీ ఆవరణలోని మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణలో రైతుల తరపున మాట్లాడిన మాజీ మంత్రి శ్రీధర్‌బాబును, ఇతర కాంగ్రెస్ నేతలను అరెస్టు చేయడం అన్యాయమని, అణచివేత చర్యలకు పాల్పడడం సరికాదని అన్నారు. దీనిపై ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లుగా టీఆర్ఎస్ వ్యవహరిస్తోందని పొంగులేటి అన్నారు. అధికారం ఉంది కదా అని విర్రవీగడం మంచిది కాదని హితవు పలికారు. కేసీఆర్‌కు నిజంగానే ప్రాజెక్టులపై చిత్తశుద్ధి ఉంటే ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయ హోదా సంపాదించారేమో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. కాగా కాళేశ్వరంపై ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ టీఆర్ఎస్ బల ప్రదర్శన కార్యక్రమంగా మారిందనీ సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వాసితులతో బలవంతంగా సంతకాలు పెట్టిస్తోందన్నారు. 2013 చట్టం ప్రకారం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.



రాహుల్‌తో కుంతియా, ఉత్తమ్ తదితరులు

దూసుకెళ్లండి

- **టీఆర్ఎస్‌పై పోరు చేయండి**
- **ఉత్తమ్‌కు దిశానిర్దేశం చేసిన రాహుల్**
- **టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పొన్నం?**

న్యూఢిల్లీ, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో ప్రస్తుతం ఉన్న ఉత్సాహాన్ని కొనసాగించి ముందుకు దూసుకెళ్లాలని ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ధర్నా చౌక్‌పై నిరసన, నేరెళ్ల ఘటనపై రాష్ట్రపతికి ఫిర్యాదు కార్యక్రమాలతో ఢిల్లీకి వచ్చిన ఉత్తమ్, కాంగ్రెస్ నాయకులు మంగళవారం రాత్రి రాహుల్‌ను విడివిడిగా కలిశారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ కుంతియా, కార్యదర్శి సతీశ్ జార్కొలి, ఉత్తమ్‌తో దాదాపు 30 నిమిషాల పాటు రాహుల్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి సోదరుల వ్యాఖ్యలతో పార్టీలో చెలరేగిన వివాదాలపై ఉత్తమ్ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పార్టీ క్రమశిక్షణకు ఎవరైనా లోబడే ఉండాలని, అందుకు తగినట్లుగా మార్పులు తీసుకురావాలని కుంతియాను రాహుల్ ఆదేశించినట్టు తెలుస్తోంది. పార్టీలో అందరిని సంప్రదించి కలుపుకొని ముందుకు పోవాలని, అందరి సమస్యలు పరిష్కరించాలని, అవసరం అనుకుంటే తనదాక తీసుకురావాలని రాహుల్ సూచించారు. కాగా, పార్టీ మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, బలరామ్‌నాయక్, సురేశ్ షెట్కర్, సిరిసిల్ల రాజయ్య బృందం కూడా రాహుల్‌ను కలిసింది. పార్టీ పదవుల్లో బీసీలకు అధిక ప్రాతినిధ్యం కల్పించాలని, అందులో భాగంగా పొన్నం ప్రభాకర్‌ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించాలని రాహుల్ వద్ద ప్రతిపాదన తీసుకొచ్చినట్లు సమాచారం. కాగా, పార్టీ సోషల్ మీడియా సమన్వయకర్తగా దీపక్ జాన్‌ను నియమించారు.

కేసీఆర్‌కు దమ్ముంటే.. ప్రాజెక్టుల రీడిజైన్‌పై చర్చకు రావాలి

- **మోసకారి సీఎంగా చరిత్రలో నిలిచిపోతారు: పొన్నాల**



వరంగల్ సిటీ, ఆగస్టు 23: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దమ్ముంటే రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల రీడిజైన్‌పై బహిరంగ చర్చకు రావాలని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య సవాల్ చేశారు. హన్మకొండలోని తన నివాసంలో బుధవారం పొన్నాల విలేకరులతో మాట్లాడుతూ.. మోసాలు, అక్రమాల్లో కేసీఆర్‌ను మించినవారు లేరని అన్నారు. మిషన్ భగీరథలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రకటనలకే పరిమితమైంద విమర్శించారు. అబద్ధాల సీఎంగా కేసీఆర్ చరిత్రలో నిలుస్తారని అన్నారు. రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీగా గతంలోనే పేరు నమోదు కాగా, తమ ఘనతగా కేసీఆర్ చెప్పుకోవడం హస్యాస్పదమన్నారు. ఎకరం భూమి సాగుతో కోటి రూపాయల సంపాదన కేసీఆర్‌కే సాధ్యమని ఎద్దేవా చేశారు. వరంగల్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్న కేసీఆర్ హామీ ఏమైందని మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు.



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసిన అఖిల పక్షం నేతలు

నేరెళ్ల ఘటనపై రాష్ట్రపతికి అఖిలపక్షం ఫిర్యాదు

న్యూఢిల్లీ/సిరిసిల్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన నేరెళ్ల ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు అఖిలపక్ష బృందం ఫిర్యాదు చేసింది. రాష్ట్రపతి భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ-టీఎస్ అధ్యక్షుడు ఎల్.రమణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, టీజేఏసీ చైర్మన్ కోదండరాంతో కూడిన బృందం బుధవారం రాష్ట్రపతితో భేటీ అయింది. నేరెళ్లలో ఇసుక మాఫియా ఆగడాలు పెరిగిపోతున్నాయని, దానికి టీఆర్ఎస్ ప్రభుత్వం మద్దతు ఇస్తోందని, అమాయకులపై పోలీసులు దాడులు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఉత్తమ్ మాట్లాడుతూ ఇసుక మాఫియాను కాపాడేందుకు రాష్ట్రంలో మానహక్కుల ఉల్లంఘన జరుగుతోందని అన్నారు. దళితుల హక్కులపై జరుగుతున్న దాడులను ఆపడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతికి ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. కోదండరాం మాట్లాడుతూ.. నేరెళ్ల బాధితులకు ఇప్పటి వరకు న్యాయం జరగలేదని, బాధితులను కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోలేదన్నారు. రమణ మాట్లాడుతూ.. దళితులంటే ప్రభుత్వానికి చిన్నచూపు ఉందన్నారు. ఘటనకు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నైరాశ్యంతోనే కేటీఆర్ 'సోషల్' దాడి

- **సీఎంకు అవార్డిచ్చింది ప్రైవేటు సంస్థా? కాదా?**
- **కేటీఆర్‌కు దాసోజు శ్రావణ్ బహిరంగ లేఖ**




హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మంత్రి కేటీఆర్ నైరాశ్యంతోనే తనపై సోషల్ మీడియా ద్వారా దాడి చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రావణ్‌కుమార్ అన్నారు. తనకు సంబంధించిన కొన్ని పాత ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో ప్రదర్శిస్తూ వారి మోసపూరిత చర్యలను, వక్రబుద్ధిని బయట పెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి ఒక అనామక సంస్థ, విత్తన కంపెనీల లాబీయింగ్ చేసే సంస్థ అవార్డు ఇవ్వడమేంటని, దానికి సీఎం ఎలా అర్హుడవుతారని లేఖలో ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా కాకుండా ఎకరానికి కోటి రూపాయలు తీసుకునే రైతుగా ఈ అవార్డు తీసుకుంటే ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదని, కానీ.. వ్యవసాయ పాలసీ మేకర్‌గా సీఎం హోదాలో తీసుకుంటే తప్పకుండా అభ్యంతరం వ్యక్తం చేస్తామని స్పష్టం చేశారు. మంత్రి కేటీఆర్‌కు కొందరు డిజిటల్ జీతగాళ్లుగా మారి జుగుప్సాకరమైన పోస్టింగులు పెడుతూ, మానసిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌తో తన అనుబంధం తాలూకు ఫొటోలను భద్రపరుచుకున్నందుకు సంతోషంగా ఉందని, అదే సమయంలో తెలంగాణ సాధనకు , కేసీఆర్‌ను బలపరిచేందుకు తాను చేసిన త్యాగాన్ని కూడా గుర్తు పెట్టుకుంటే బాగుండేదని అన్నారు. అధికారం కోసం తెలంగాణ రాగానే టీఆర్ఎస్ పంచన చేరిన చాలా మంది ద్రోహులు, బంగారు తెలంగాణ బ్యాచ్ గతంలో ఏం మాట్లాడారో గుర్తున్నాయా? అని అన్నారు. అధికార మత్తులో.. బయటి వ్యక్తుల ఆలోచనలు, భావనలు తెలుసుకోలేని మూర్ఖులుగా, అంధులుగా మారిపోయారని ఆరోపించారు. ఎప్పటికైనా ధర్మం గెలుస్తుందని, ప్రజలు టీఆర్ఎస్ కుట్రలు, కుతంత్రాలను అర్థం చేసుకొని తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

గతి లాభంలో 258 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గతి లిమిటెడ్ కన్సాలిడేటెడ్ నికర లాభం 258 శాతం పెరిగి 18.3 కోట్ల రూపాయలకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ 5.1 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ రాబడులు 425.5 కోట్ల రూపాయల నుంచి 426.7 కోట్ల రూపాయలకు పెరిగాయి. బిటిబి సెగ్మెంట్‌లో పరిమాణం పరంగా 5.6 శాతం వృద్ధి నమోదైంది. రిటైల్ సెగ్మెంట్‌లో 19 శాతం వృద్ధి నెలకొంది. 2011 సంవత్సరంలో జారీ చేసిన ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్ల (ఎఫ్‌సిసిబి) మార్పిడి/విమోచనం జరిగినట్టు కంపెనీ తెలిపింది. దీంతో కంపెనీ మొత్తం రుణ భారం 390 కోట్ల రూపాయలకు తగ్గింది. వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) అమలు వల్ల సానుకూల వృద్ధి నెలకొనుందని పేర్కొంది. ఎఫ్‌సిసిబి ముగింపు చెప్పుకోదగిన అంశమని, దీని వల్ల ఇన్వెస్టర్ల విశ్వాసం మరింతగా పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుందని కంపెనీ వ్యవస్థాపక సిఇఒ మహేంద్ర అగర్వాల్ తెలిపారు. బిటిబి వ్యాపార పరిమాణంలో వృద్ధి వల్ల మంచి ప్రోత్సాహకం లభించినట్టయిందని చెప్పారు. తాము త్వరిత గతిన జిఎస్‌టికి మారినట్టు తెలిపారు. అన్ని రంగాల్లోని కస్టమర్లు జిఎస్‌టికి మారిపోయి తమ సప్లయ్ చెయిన్‌ను మెరుగుపరచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు.

ఇక ఉండేది పెద్ద బ్యాంకులే..

కన్సాలిడేషన్‌కు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్



• విధివిధానాల రూపకల్పనకు ప్రత్యామ్నాయ యంత్రాంగం

న్యూఢిల్లీ: దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల(పిఎస్‌బి) స్వరూపం మారిపోనుంది. ఇప్పుడున్న 21 పిఎస్‌బిలకు బదులు పోటీని తట్టుకునేలా వాటిని విలీనం చేసి ఆర్థికంగా బలమైన ఐదారు పిఎస్‌బిలు ఏర్పాటు చేసేందుకు మోదీ సర్కార్ చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ యంత్రాంగం (ఎఎం) పేరుతో ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రధాని అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విలేకరులతో చెప్పారు. ఈ విధానం ద్వారా ఆర్థికంగా బలహీనంగా ఉన్న పిఎస్‌బిలను ఆర్థికంగా బలమైన మరో పిఎస్‌బిలో విలీనం చేస్తారు. 'పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ రుణ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ రంగంలో బలమైన, పోటీని తట్టుకునే బ్యాంకుల ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇలా ఏర్పాటు చేసే పిఎస్‌బిలు ఆటుపోట్లను తట్టుకోవడమేగాక ప్రభుత్వం ఆధారపడకుండా సొంతంగానే నిధులు సమీకరించుకునే సామర్థ్యం కలిగి ఉంటాయి' అని జైట్లీ చెప్పారు. పూర్తిగా వాణిజ్య అంశాల ప్రాతిపదికనైనే ఈ బ్యాంకులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్‌బిఐ సంప్రదింపులతో ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

బ్యాంకుల నుంచే ప్రతిపాదనలు

ఈ విలీనాల విషయంలో తన చేతికి మట్టి అంటకుండా ప్రభుత్వం జాగ్రత్త పడుతోంది. ఆయా బ్యాంకుల డైరెక్టర్ల బోర్డుల నుంచే ఎఎం కమిటీకి విలీన ప్రతిపాదన రావాలి. ఆ తర్వాత కమిటీ ఆ ప్రతిపాదనను పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది. ఈ నిర్ణయాన్ని ఆయా బ్యాంకులు అమలులో ఉన్న చట్టాలు, సెబి నిబంధనలకు అనుగుణంగా అమలు చేయాల్సి ఉంటుంది. ఎఎం కమిటీలో ఉండే సభ్యులను ప్రధాని మోదీనే ఎంపిక చేస్తారని సమాచారం. ఇప్పుడున్న అనేక పిఎస్‌బిలు విలీనం ద్వారానే బలమైన పెద్ద బ్యాంకులను ఏర్పాటు చేయనున్నట్టు జైట్లీ చెప్పారు. 'ఈ నిర్ణయం జాతీయం చేసిన బ్యాంకుల పటిష్ఠతకు ఎంతో దోహదం చేస్తుంది. దీంతో పోటీకి తట్టుకునే బలమైన పిఎస్‌బిల ఏర్పాటుకు తోడ్పడుతుంది' అన్నారు. ఎఎం ద్వారా విలీనాల ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని భావిస్తున్నట్టు చెప్పారు. ప్రత్యామ్నాయ వ్యవస్థ పనితీరుపై మంత్రుల కమిటీ పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు.

త్వరలో రూ.200 నోటు

త్వరలో రూ.200 నోట్లు జారీ చేయబోతున్నట్టు అరుణ్ జైట్లీ చెప్పారు. దీంతో చిల్లర నోట్ల సమస్య కొంత వరకు తీరే అవకాశం ఉందన్నారు. రూ.200 నోట్ల ప్రింటింగ్ ఎప్పటి నుంచి చేపట్టాలనే విషయంపై ఆర్‌బిఐ నిర్ణయం తీసుకుంటుందన్నారు. అయితే ఈ నెలాఖరులో లేదా వచ్చే నెల మొదటి వారం ఆర్‌బిఐ దాదాపు 50 కోట్ల నోట్లను విడుదల చేస్తుందని భావిస్తున్నారు. దేశంలో రూ.200 డినామినేషన్‌లో నోట్లు విడుదల చేయడం ఇదే మొదటిసారి. అలాగే రూ.2,000 నోట్ల ముద్రణ ఆపేస్తారన్న భయాలను జైట్లీ కొట్టి పారేశారు. అలాంటి ప్రతిపాదనేదీ పరిశీలనలో లేదన్నారు.

ఎప్పటి నుంచి!

ఈ విలీనాల ప్రక్రియ ఎప్పటి నుంచి ప్రారంభమవుతుందనే దానిపై జైట్లీ స్పష్టత ఇవ్వలేదు. విలీనాల ప్రతిపాదనల కోసం బ్యాంకుల బోర్డులపై ఒత్తిడి చేస్తారా? అనే ప్రశ్నకూ సమాధానం దాట వేశారు. ప్రభుత్వరంగంలో పటిష్ఠమైన కొన్ని బ్యాంకులు ఉంటే చాలని 1991లోనే భావించినా అందుకు కార్యాచరణ 2016లో ప్రారంభమైందన్నారు.

మేము ఒప్పుకోం: ఉద్యోగ సంఘాలు

బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు మాత్రం పిఎస్‌బిల విలీన ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించాయి. పిఎస్‌బిల ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దకుండా విలీనాలు ఏ మాత్రం పరిష్కారం కావని అఖిల భారత బ్యాంకింగ్ ఉద్యోగుల సంఘం (ఎఐబిఇఎ) ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో అన్నారు.

ముగిపు పటిష్ఠం

టెక్ వ్యూ

నిఫ్టీ రికవరీలో ప్రారంభమై కీలక స్థాయి 9800 వద్ద చివరి వరకు సుదీర్ఘ కన్సాలిడేషన్ సాధించిన అనంతరం 86 పాయింట్ల బలమైన రికవరీతో డే గరిష్ఠ స్థాయిలో ముగిసింది. ఈ రికవరీతో ఇండెక్స్ తక్షణ ముప్పు నుంచి బయటపడింది. కాని ఇంకా ర్యాలీలో ప్రవేశించాల్సి ఉంది. మరోసారి ట్రెండ్ నిర్ణాయక స్థాయిలకు చేరువవుతోంది. తదుపరి దిశకు గురువారంనాటి ముగింపు కీలకం. ఇప్పటికీ 20 డిఎంఏ కన్నా దిగువనే ఉంది. ఆ పైన మాత్రమే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ ఏర్పడుతుంది.

గురువారం స్థాయిలివే: నిరోధం: 9900 మద్దతు : 9800

- స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశించాలంటే ప్రధాన నిరోధం 9900 పైన బలంగా క్లోజ్ కావాలి.
- ప్రధాన మద్దతు స్థాయి 9800కన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్‌లో ప్రవేశిస్తుంది.
- బ్యాంక్ నిఫ్టీ ప్రధాన స్థాయి 24000 పైన బలంగా క్లోజ్ కావడం ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది.

సూచన: స్వల్పకాలిక ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా

సాధారణంగా మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి: భాద్రపద శుద్ధ తదియ **నక్షత్రం:** ఉత్తర

ఆర్ద్ర, స్వాతి, శతభిషం నక్షత్ర జాతకులు, తుల, కుంభ రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ: 9852.50 (+86.95) ట్రెండ్ మార్పు వేళలు: 2

ధోరణి: గ్రహగతులను బట్టి నిస్తేజంగా ప్రారంభమై 9.40 నుంచి 2.30 మధ్యలో మెరుగ్గా ట్రేడవుతూ ఆ తర్వాత ముగింపు వరకు ఒక మోస్తరు నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం: 9.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 2.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.45 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు: 9890, 9925

మద్దతు స్థాయిలు: 9810, 9775

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి

www.thefinancialastrologer.blogspot.in

బులియన్


బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	ప్రొద్దుటూరు	ముంబై	చెన్నై
24 క్యారెట్లు	30,040	30,000	29,850	29,150	--
క్రితం ముగింపు	30,060	--	29,850	29,080	--
22 క్యారెట్లు	29,440	27,750	27,680	29,000	27,700
క్రితం ముగింపు	29,460	--	27,720	28,930	27,720
వెండి (కిలో)	40,100	40,200	40,000	39,035	--
క్రితం ముగింపు	40,100	--	40,000	38,870	--

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	82.00	గోదావరి	84.00
కరీంనగర్	82.00	విజయవాడ	84.00
వరంగల్	82.00	గుంటూరు	84.00
మహబూబ్‌నగర్	82.00	ఒంగోలు	86.00
కర్నూలు	82.00	చిత్తూరు	86.00
విశాఖపట్నం	79.00	నెల్లూరు	86.00

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	355.00	వరంగల్	357.00
విజయవాడ	359.00	చెన్నై	397.00
గోదావరి	359.00	నమక్కల్	387.00
బెంగళూరు	382.00	చిత్తూరు	390.00
విశాఖపట్నం	362.00	ముంబై	400.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో...)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.29	67.59
పౌండ్	74.74	86.67
యూరో	68.55	79.52
ఆస్ట్రేలియా డాలర్	45.99	53.24
బహ్రెయిన్ దినార్	157.95	180.91
కువైట్ దినార్	175.46	218.49
ఒమని రియాల్	154.55	176.86
సౌదీ రియాల్	15.50	18.37
సింగపూర్ డాలర్	42.78	50.68
యుఎఇ దిరమ్	15.86	18.54

బ్యాంకింగ్ కిక్..


సెన్సెక్స్ 276 పాయింట్లు అప్

ముంబై: బ్యాంకుల కన్సాలిడేషన్‌కు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ఉత్సాహంలో ఇన్వెస్టర్లు బ్యాంక్ స్టాక్‌ల కొనుగోలుకు పరుగులు తీయడం మార్కెట్‌లో స్తబ్ధతను వదిలించింది. బ్యాంక్ షేర్ల మద్దతుతో ఇండెక్స్‌లు దూసుకుపోయాయి. నిఫ్టీ మరోసారి కీలక స్థాయి 9800 పైన ముగిసింది. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి కూడా ఎలాంటి ప్రతికూల సంకేతాలు లేకపోవడం మార్కెట్ జోరుకు ఆసరా ఇచ్చింది. నందన్ నీలేకని మరోసారి ఇన్ఫోసిస్ పగ్గాలు చేపట్టవచ్చన్న వార్తలు ఇన్ఫోసిస్ షేరులో ర్యాలీకి కారణమయ్యాయి. ఇదీ మార్కెట్‌కు కలిసి వచ్చింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, అలహాబాద్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లకు డిమాండు గణనీయంగా పెరిగింది. ఈ షేర్లన్నీ ఒక మోస్తరు లాభాలు ఆర్జించాయి. మొత్తం మీద రోజంతా పూర్తిగా పాజిటివ్ జోన్‌లో ఉన్న సెన్సెక్స్ 276.16 పాయింట్లు లాభపడి 31593.39 పాయింట్ల వద్ద ముగియగా నిఫ్టీ 86.95 పాయింట్లు లాభపడి 9852.50 పాయింట్ల వద్ద క్లోజయింది. చివరి గంటలో కొనుగోళ్లు మార్కెట్‌ను పరుగులు పెట్టించాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

- విలువ ఆధారిత కొనుగోళ్ల కారణంగా ఇన్ఫోసిస్ షేరు 1.98 శాతం లాభపడింది. అదానీ పోర్ట్స్, భారతి ఎయిర్‌టెల్, డాక్టర్ రెడ్డీస్, టాటా స్టీల్, టాటా మోటార్స్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్, ఎన్‌టిపిసి, ఆర్‌ఐఎల్ లాభపడిన షేర్లతో ఉన్నాయి. మంచి కొనుగోళ్ల మద్దతుతో సెక్టోరల్ ఇండెక్స్‌లు కూడా లాభాల్లో ముగిశాయి.

ఫోర్టిస్ హెల్త్‌కేర్ పరుగు

రాకేష్ ఝున్‌ఝున్‌వాలా భార్య రేఖ పెట్టుబడి పెట్టడంతో ఫోర్టిస్ హెల్త్‌కేర్ షేరు 8 శాతం లాభపడింది. ఓపెన్ మార్కెట్లో రేఖ 45 లక్షల ఫోర్టిస్ షేర్లను 60 కోట్ల రూపాయలకు కొనుగోలు చేశారు.



- ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ జిఐసికి 40 శాతం వాటాలు విక్రయించే అంశంపై పరిశీలనకు డిఎల్‌ఎఫ్ డైరెక్టర్ల బోర్డు శుక్రవారం సమావేశం కాబోతున్నదన్న వార్తలతో డిఎల్‌ఎఫ్ షేరు 6 శాతం పెరిగింది. డీల్ విలువ 13 వేల కోట్ల రూపాయలు. ప్రాపర్టీలను అద్దెకు ఇచ్చే విభాగంలో జిఐసికి 40 శాతం వాటా విక్రయించాలన్నది ప్రతిపాదన.

3 సంస్థలపై పదేళ్ల నిషేధం

భారీ రాబడుల ఆశ చూపుతూ తప్పుడు మార్గంలో నిధులు సమీకరించినందుకు ఒక కంపెనీ పైన, ఇద్దరు ఇన్వెస్టర్ల పైన 10 సంవత్సరాల నిషేధాన్ని సెబి విధించింది. శ్రీ గణేశ్ స్టాక్స్ అండ్ షేర్స్ కంపెనీని, వెంకటేశన్ చంద్రన్, ఆయన భార్య విజయభారతిలను పదేళ్ల పాటు మార్కెట్‌లో ట్రేడింగ్ చేయడాన్ని నిషేధిస్తూ సెబి ఉత్తర్వులు జారీ చేసింది. క్లయింట్ల నుంచి సేకరించిన సొమ్మును 90 రోజుల్లోగా వాపసు చేయాలని ఆదేశించింది.

రిలయన్స్ క్యాపిటల్ ఇసాప్‌లు

ఆర్థిక సర్వీసుల సంస్థ రిలయన్స్ క్యాపిటల్ ఉద్యోగులకు 300 కోట్ల రూపాయల విలువ గల ఇసాప్‌లు ప్రకటించింది. ప్రతిభావంతులైన ఉద్యోగులు కంపెనీ వదిలిపోకుండా నిలబెట్టుకోవడం లక్ష్యంగా ఇసాప్‌లు ప్రకటిస్తారు. వివిధ విభాగాల్లో ఎంపిక చేసిన 500 మంది ఉద్యోగులకు ఇసాప్‌లు ఇవ్వనున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్మోల్ అంబానీ ప్రకటించారు. రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఎఎంసి, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్, రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, రిలయన్స్ సెక్యూరిటీస్‌కు చెందిన సభ్యులకు ఈ స్కీమ్‌లో భాగంగా 9.21 లక్షల షేర్లు ఇస్తారు. దీనికి కంపెనీల బోర్డులు ఇప్పటికే ఆమోదం తెలిపాయి.

అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ 1.12 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రిప్షన్

ఆక్వాకల్చర్ ఉత్పత్తుల రంగంలోని అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ పబ్లిక్ ఇష్యూ రెండో రోజున 1.46 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది. 152 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంగా కంపెనీ 62.10 లక్షల షేర్లు మార్కెట్‌లో విక్రయిస్తోంది. రెండోరోజు మార్కెట్ ముగిసే సమయానికి 90,72,080 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. ఇష్యూ గురువారం ముగుస్తుంది. షేరు ధర శ్రేణి 171-175 రూపాయలు. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ సోమవారం 87 లక్షల రూపాయలు సమీకరించింది. వారికి విక్రయించిన 24.90 లక్షల షేర్లను కూడా కలిపితే మొత్తం ఆఫర్ 87 లక్షల షేర్లు.

బిఎస్‌ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ACI INFOCOM 6.2(5.95)500
ADITYA SPIN. 8.16(8.57)1150
AGRO TECH FO 542.5(529.55)1512
AISHWARYA TE 4.6(4.4)7250
ALPHAGEO (I) 760.55(755.55)1393
ALU FLUORIDE 58(55.9)9513
AMAR RAJA BA 765.4(758.55)21233
ANDHRA BANK 51.4(49.85)315348
ANDHRA CEMEN 8.66(8.57)8388
ANDHRA PETRO 31.75(30.3)247719
ANJANI PORTL 206(206.25)1209
ASTRA MICRO 123.9(121.9)26618
AUROB.PHARMA 698.5(695.45)97759
AVANTEL LTD 237(239.25)1632
AVANTI FEEDS 1946.75(1923.35)15109
B.N.RATHI SE 30.75(30.4)1403
BALAJI AMINE 310.7(310.55)1973
BAMBINO AGRO 174.4(176.25)1013
BARTRONICSIN 14(13.85)21278
BHAGIRA.CHEM 205.6(194.95)39082
BHAGYA INL 21.5(21.4)1038
BHARATFIN 888.35(850.2)228056
BNR UDYOG 45.95(44.35)92596
CAMBRIDGE 74.95(73.5)2007
CAT TECHN. .6(.63)351
CCHHL 13.04(12.97)6964
CCL PRODUCTS 276.2(274.8)568
CELESTIAL 21.45(21.25)21870
CIL SECURITS 28.05(28.35)5503
COROM INTER 422.65(421.75)8341
CUBEX TUBING 16.2(16.1)530
CYIENT 519.45(513.55)1224
DANLAW TECH. 48.3(48.45)1742
DECAN CEMENT 1121.95(1115.15)4301
DHAN ROTO SP 21.15(22.15)2000
DIAMONPOWER 20.55(21.45)7242
DIVI'S LAB. 638.95(630.25)55759
DIVYA.GRANIT 98.5(96.95)310
DQ ENT 12.75(12.7)12966
DR.REDDY'S 2029.5(1984.85)54946
EMPEE SUGARS 5.05(5.05)1852
EVEREST ORG. 98.9(95.5)5341
FACOR ALLOYS 3.69(3.62)82980
FIRSTOBJ 15.25(15.6)4147
GATI LTD. 113.9(107.85)365013
GAYATRI BIO 8.84(9.3)4152
GAYATRI PROJ 170.9(161.7)20510
GENNEX LAB 3.94(3.98)81829
GMR INFRASTR 17.15(17.05)1039827
GODAVARI DRU 36.7(37.35)1397
GOLDST INFRA 130.55(130.05)102727
GOLDSTONE EN 11.13(11.45)5109
GRANULES (I) 127.9(127.2)92459
GVK POWERINF 11.75(12.36)1303668
HBL P SYS 44.5(43.7)20272
HERITGFOOD 1315.35(1299.25)1627
HINDUSTN BIO .83(.86)839
I.C.S.A. IND 2.61(2.69)1307
INCAP LTD. 56.9(59.85)3039
IPAPPM 293.05(294.75)1083
IVRCL LTD 4.89(4.94)133954
KAKATIYA CEM 343.6(337.4)4559
KALLAM SPG. 31.9(32.6)128076
KARAN WOO-SN 1.05(1)101
KAVERI SEED 543.55(531.05)80380
KCP LTD 102.1(103.6)11278
KERNEX MICRO 36.35(35)3330
KNR CONST 216.2(213.85)2334
KREBS BIOCHM 93.65(93.7)1208
LANCO INFRA .89(.86)1736279
LOKESH MACH 81.35(78)19513
MADHUCON PRJ 29.35(28.85)19872
MOLD-TEK TEC 49.75(49.75)11750
MOSCHIP SEMI 47.05(46.95)34137
MSR INDIA 36.3(38.2)9452
N C L IND. 230.3(232.5)23231
NAGAR.AGRICH 33.9(34.1)10100
NATCO PHARM 726.2(733.05)29819
NCC 86.2(84.15)209370
NEHA INTER. 5.13(4.7)55873
NETTLINX LTD 80.8(88.95)5474
NEULAND LAB. 1227.7(1250.7)1031
NILE LTD. 602.4(589.6)6406
NTL 4.03(4.02)6500
OIL COUNTRY 45(42.95)8945
PADMALAYA TE 6.91(7.09)77746
PALRED 96.9(96.2)865
PANYAM CEMEN 58.5(57.95)4504
PENNAR STEEL 59.7(55.85)192826
PFL INFOTECH 5.77(5.77)100
PHYTOCHEM I. 45.35(46.8)7377
PITTI LAMIN. 58.85(58.75)10017
POKARNA LTD 1201.85(1160.8)368
PRAJAY ENGS. 8.03(7.65)4712
PREMIER EXPL 450.95(441.5)870
PRISM CEMENT 110.85(107.85)17974
RAIN 144.7(137.4)380965
RAJ PACKAGIN 56.5(57.2)1165
RAJVIR IND 42.4(42.4)1
REG.CERAMIC 5.44(5.58)1654
RESTILE CER. 5.06(5.14)2745
SAGAR CEM. 824(810)1157
SAMKRG PIST. 255.5(259.7)4500
SAMPRE NUTRI 40.4(38.5)3140
SANGHI IND. 82(82.3)55434
SATVAH.ISPAT 34.55(35.55)25935
SAVEN TECHNO 23(22.8)8400
SMPL 1.55(1.54)20750
SMS PHARMACE 82.6(73)205292
SREE RAYALA 126.6(125.7)576
STEEL EXCH 83.15(83.8)118551
SUJANA INDUS .97(.96)37739
SURANATP 4.65(4.63)6841
SURYACHAKRA 1.04(1.09)93349
SURYAMBA SP 59.4(62)1007
SURYLAK.COTT 97.55(96.05)4966
SUVEN LIFE S 162.45(161.45)12287
TAJ GVK HOTL 155.8(153.6)14998
TANLA 32.6(32.65)27911
TRANSCORP IN 19.5(19.2)11711
TRANSGENE BI 2.28(2.3)10224
TRANSPORT CO 272.65(272.55)8444
USHER AGRO 6.54(6.68)26698
VICEROY HOTE 17.25(16.7)14948
VIJAY TEXTIL 62.15(59.4)32788
VIMTA LABS 130.25(129.8)2361
VIRAT CRANE 37(38)1000
VIRINCHI 69.35(69.7)125992
VISAKA IND. 537.2(515.15)27054
VISTA PHARMA 33.05(34.05)22031
VIVIMED LABS 103.6(100.3)103932
VST INDUS. 2719.45(2719.75)211
WATERBASE 121.9(121.2)172770
XLENERGY 1.7(1.85)9095
YBRANTDIGI 6.86(6.35)5580872
ZEN TECH 51.9(51.45)25573
ZENOTECH 47.55(45.3)2490

ఎన్‌ఎస్‌ఇ-500 NSE

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 517.25(516.75)31541
AARTIIND 854.65(859.9)60239
ABAN 173.75(172.65)923171
ABB 1349.85(1357.4)44354
ABFRL 169.45(170.9)140253
ABGSHIP 11.05(11.2)18000
ACC 1801.9(1789.3)220709
ADANIENT 110.05(106.3)4677977
ADANIPORTS 385(375.65)3003871
ADANIPOWER 28.35(27.75)7906237
ADANITRANS 109.05(108.05)150312
AEGISCHEM 185.6(189.2)1277413
AHLUCONT 283.4(283.9)133322
AIAENG 1333.85(1384.65)95219
AJANTPHARM 1191.75(1153.45)210759
AKZOINDIA 1759(1749.2)1643
ALBK 67.1(64.1)6238152
ALLCARGO 164.9(161)199548
ALOKTEXT 3.1(3.05)2166515
AMARAJABAT 767.3(758.4)796297
AMBUJACEM 276.65(273.15)1018756
AMTEKAUTO 25.65(25.4)555383
ANANTRAJ 55.9(54.8)562676
ANDHRABANK 51.45(49.9)3240503
APARINDS 770.3(765.1)52385
APLLTD 505.75(511.5)14018
APOLLOHOSP 1092.6(1098.5)1081455
APOLLOTYRE 259.8(259.65)3009326
ARVIND 363.7(361)1164303
ASHIANA 168.05(165.1)15276
ASHOKA 183.3(186.1)58154
ASHOKLEY 102.7(100.35)6311204
ASIANPAINT 1141.3(1129.45)513036
ASTRAL 646.45(644.3)90189
ASTRAZEN 899.35(885.55)3781
ATUL 2024.2(2002.25)14874
AUROPHARMA 698.65(695.7)1618248
AVANTIFEED 1946.95(1923.85)74017
AXISBANK 502.65(499.2)3288488
BAJAJ-AUTO 2754.65(2740.55)117188
BAJAJCORP 396.5(398.45)14531
BAJAJELEC 339.5(333.3)375455
BAJAJFINSV 5351.3(5234.6)194647
BAJAJHIND 14.45(14.5)1752445
BAJAJHLDNG 2634.85(2609.9)9423
BALKRISIND 1586.35(1479.45)1182898
BALLARPUR 13.65(13.3)593863
BALMLAWRIE 240.5(237.8)92085
BALRAMCHIN 164.9(164.6)869286
BANKBARODA 140.95(139.35)18892523
BANKINDIA 143.8(139.15)6957028
BASF 1435.45(1424.35)9445
BATAINDIA 678.15(683.2)878071
BBTC 910.2(903.9)49805
BEML 1804.05(1789.45)1420688
BERGEPAINT 237.2(237.15)1023303
BFUTILITIE 325.6(317.05)166333
BGRENERGY 137.2(128.35)561848
BHARATFIN 888.2(850.2)2380476
BHARATFORG 1165.95(1136.65)513781
BHARTIARTL 431.9(422.1)4285266
BHEL 127.55(125.65)2932872
BHUSANSTL 70.1(68.5)561253
BIOCON 330.1(328.4)1393830
BIRLACORPN 953.95(949.1)21593
BLISSGVS 169.85(167.35)133209
BLUEDART 4123.75(4078.25)8815
BLUESTARCO 732.55(731.6)64373
BOMDYEING 79.3(74)2964994
BOSCHLTD 21882.4(21898.6)6174
BPCL 509.7(510.35)3071333
BRFL 141.7(137.65)38011
BRIGADE 262.2(262.15)19354
BRITANNIA 4247.15(4198.85)118712
CADILAHC 462.65(468.5)630195
CANBK 336.15(326.7)2203164
CANFINHOME 2785.25(2703.65)243266
CAPF 717.05(694.9)493771
CARERATING 1498.4(1497.05)15934
CASTEXTECH 6.05(6.15)403160
CASTROLIND 389.45(387.8)581453
CCL 276.15(276)13084
CEATLTD 1671.8(1628.8)720484
CENTRALBK 73.8(73.3)466294
CENTURYPLY 259.9(253.8)649712
CENTURYTEX 1206.45(1179.7)1019928
CERA 2961.6(2786.05)11736
CESC 939.95(933.9)287435
CHAMBLFERT 144.1(141.5)1443900
CHENNPETRO 405.5(403.25)464561
CHOLAFIN 1147.1(1141.95)76656
CIPLA 559.15(559.25)848822
CLNINDIA 588.15(586.8)12866
COALINDIA 241.1(240.55)3693013
COLPAL 1087.15(1084.75)140835
CONCOR 1258(1276.4)1286392
COROMANDEL 421.35(420.4)68221
CORPBANK 45.45(44.45)197297
COX&KINGS 262.15(261.45)232039
CRISIL 1865.3(1845.3)4870
CUB 158.4(156.55)226893
CUMMINSIND 880.75(898.55)242557
CYIENT 520.95(515.25)12541
DABUR 298.85(301.1)1160867
DALMIABHA 2592.8(2556.05)53291
DBCORP 370.35(379.5)26862
DBREALTY 36.05(35.1)308986
DCBBANK 183.5(177.75)1169742
DCMSHRIRAM 386.45(381)56107
DEEPAKFERT 379.9(378.6)183244
DELTACORP 182.25(173.2)7502832
DEN 90.7(84.05)938023
DENABANK 31.35(30.4)1229236
DHANUKA 704.55(708.95)14657
DHFL 467.75(455.8)4611259
DISHTV 80.3(79.4)3960840
DIVISLAB 638.4(629.2)743570
DLF 185.95(175.3)28066784
DREDGECORP 596.85(591.5)76923
DRREDDY 2030.95(1984.15)809996
DYNAMATECH 2149.25(2133.6)1310
ECLERX 1278.3(1254.4)12740
EDELWEISS 242.4(241)2077374
EICHERMOT 30648.25(30977.15)37637
EIDPARRY 322.95(319.9)87147
EIHOTEL 132.15(133.5)91997
ELECTCAST 29.4(29.2)530655
ELGIEQUIP 219.5(220.05)7319
EMAMILTD 1087.6(1103.05)119764
ENGINERSIN 151.15(149.8)735091
EROSMEDIA 184.4(175.05)1963948
ESCORTS 613.15(600.25)878847
ESSDEE 31.6(31.8)21840
ESSELPACK 261.1(257.95)76579
EVEREADY 296.4(297.65)16757
EXIDEIND 198.85(197.15)2358101
FCONSUMER 46.1(44.3)14702246
FDC 169.6(170.3)13917
FEDERALBNK 106.65(105.3)5236293
FINCABLES 531.85(531.25)24677
FINPIPE 600.55(590.1)23774
FLFL 371.8(358.95)706879
FORTIS 152.6(141.55)31289450
FSL 33.55(33.55)699062
GAIL 385.45(377.75)3267018
GATI 114.15(107.9)2088802
GDL 229.65(230.55)41936
GEPIL 663.9(661.1)5229
GESHIP 388.9(389.9)36748
GET&D 384.8(384)84666
GILLETTE 5283.2(5280.8)4631
GLAXO 2390.6(2365.35)9525
GLENMARK 599.85(601)828019
GLOBOFFS 33.55(33.2)17074
GMDCLTD 138.7(136.95)448062
GMRINFRA 17.2(17)19674455
GODFRYPHLP 1051.9(1054.6)222224
GODREJCP 904.95(886.2)2069849
GODREJIND 600.3(577.65)454889
GODREJPROP 510.35(510.05)39940
GPPL 132.1(132.5)214632
GRANULES 128.35(127.4)744181
GREAVESCOT 144.85(144.9)93163
GREENPLY 274(272.05)19566
GRINDWELL 399.55(393.85)9587
GRUH 501.7(508.4)197206
GSFC 137.75(131.8)2423398
GSKCONS 5347.55(5383.5)4769
GSPL 197.5(188.95)2760897
GUJFLUORO 752(751.2)23924
GUJGASLTD 793.45(771.05)92645
GULFOILLUB 801.7(803.9)3753
GVKPIL 11.75(12.35)3042881
HATHWAY 32.15(32.15)1627720
HAVELLS 475.45(473.05)533946
HCC 34.3(33.45)3498364
HCL-INSYS 45.15(47)3632337
HCLTECH 880(875.85)754889
HDFC 1765.25(1750.4)2858972
HDFCBANK 1772.45(1747)840131
HDFCBANK 1781(1760)458879
HDIL 61.75(59.55)23504923
HEIDELBERG 121.6(123)67445
HEROMOTOCO 3888.9(3888.05)407757
HEXAWARE 269(265.1)960961
HFCL 16.4(15.7)3366082
HIMATSEIDE 312.95(302.65)159433
HINDALCO 230.9(228.9)7189281
HINDCOPPER 62.05(61.1)584875
HINDPETRO 457.9(449.7)3816123
HINDUNILVR 1188.15(1199.6)831796
HINDZINC 286.5(287.05)2253675
HMT 32.2(33)14764
HMVL 270.05(266.25)4691
HONAUT 12757.25(12727.6)688
HOTELEELA 20.4(20.2)181620
HSIL 368.45(360.45)82897
HTMEDIA 91.55(91.7)210297
IBREALEST 233.25(219.1)13403057
IBULHSGFIN 1221.75(1176.35)1275205
ICICIBANK 298.6(293.95)9142592
ICRA 3886.05(3834.5)500
IDBI 54.65(53.7)1998246
IDEA 90.5(87.95)7306222
IDFC 54.85(53.85)1686106
IFBIND 701.35(702.5)8212
IFCI 23.15(22.75)2288655
IGARASHI 998.7(984.35)18106
IGL 1268.25(1259.3)201675
IIFL 594.1(583.45)167593
IL&FSTRANS 77.15(76.4)124663
INDHOTEL 111.65(111.45)1274615
INDIACEM 178.15(174.2)3580978
INDIANB 298.4(290.15)1245249
INDOCO 191(191.9)28562
INDUSINDBK 1660.9(1626.3)1091055
INEOSSTYRO 897.25(897)1693
INFRATEL 382.8(387.85)1201788
INFY 892.8(875.4)30642095
INGERRAND 803.6(778.85)8489
INOXLEISUR 232.4(230.05)30483
INOXWIND 125.1(120.7)361855
INTELLECT 110.75(108.45)382321
IOB 23.1(22.45)1211758
IOC 426.85(423.2)2656918
IPAPPM 293.85(293.95)11943
IPCALAB 412.2(408.8)29633
IRB 212.6(209.85)928285
ITC 282.55(282.9)8747634
J&KBANK 80.7(79.75)252637
JAGRAN 175.8(176.3)30006
JAICORPLTD 78.25(76.5)469034
JBCHEPHARM 285(285.4)53534
JBFIND 155(153.4)58448
JCHAC 2007.65(1999.45)5411
JETAIRWAYS 574.4(556.75)1461328
JINDALPOLY 362.75(357.45)38936
JINDALSTEL 133.1(129)6241441
JISLJALEQS 94.8(93.25)3970578
JKCEMENT 1011.7(1013.4)5390
JKIL 188.65(189.8)193156
JKLAKSHMI 416.85(412.45)176379
JKTYRE 143.3(141.65)1071180
JMFINANCIL 127.25(124.5)1524051
JPASSOCIAT 21.5(21)71932896
JPINFRATEC 14.2(14.7)6977680
JPPOWER 5.65(5.75)7670868
JSWENERGY 61.15(61)5049528
JSWHL 1756.25(1747.85)1720
JUBILANT 719.45(708.4)235496
JUBLFOOD 1380.3(1357.1)665029
JUSTDIAL 359.7(362.7)1248504
JYOTHYLAB 374.4(375.05)23839
KALPATPOWR 360.15(350.3)38809
KANSAINER 457.3(454.85)300607
KEC 299.7(297.3)159019
KESORAMIND 132.15(126.4)308442
KIRLOSENG 384.45(382.8)24723
KITEX 231.55(230.95)16175
KOLTEPATIL 158.15(161.15)90362
KOTAKBANK 980.1(970.8)2354519
KPIT 113.7(110)623487
KRBL 453.15(452.8)32743
KSCL 544.35(531.2)972273
KSK 6.7(6.8)196483
KTKBANK 144.4(140.95)1287326
KWALITY 143.15(139.3)1274006
L&TFH 173.35(169.45)3368752
LAKSHVILAS 175.65(177.9)1092869
LAOPALA 469.1(473.85)3994
LAXMIMACH 6096.55(5950.45)4345
LICHSGFIN 659.7(636.1)1601746
LITL .9(.85)3520406
LT 1124.15(1117.7)1710949
LUPIN 955.85(944.4)1452649
M&M 1374.2(1374.65)789242
M&MFIN 410.5(404.75)1171918
MAGMA 176.15(177.3)87200
MAHINDCIE 240.6(241.1)100830
MAHLIFE 408.8(411.3)8998
MANAPPURAM 92.9(91.6)6140440
MANPASAND 830.85(819.4)60060
MARICO 314.95(315.1)1265870
MARKSANS 37.2(37.25)1056828
MARUTI 7573.05(7496.1)258051
MAYURUNIQ 358.2(358.85)254759
MCDOWELL-N 2469.45(2492.6)192428
MCLEODRUSS 177.6(177.8)105338
MERCK 1170.95(1161.9)7172
MHRIL 354.45(359.9)52731
MINDACORP 109.3(109.45)82693
MINDTREE 460.9(453.95)232458
MMTC 55.45(55.15)339382
MOIL 353.25(351.9)171523
MONSANTO 2475.15(2444.9)2031
MOTHERSUMI 314.25(310.65)2633305
MOTILALOFS 1157.05(1144.8)79659
MPHASIS 591.8(592.8)34396
MRF 62805.85(62555.7)12476
MRPL 125.55(123.45)1889286
MTNL 17.4(17.25)511517
MUTHOOTFIN 444.45(442.9)454308
NATCOPHARM 722.75(736.2)298003
NATIONALUM 69.8(69.65)1263421
NAUKRI 945.55(940.75)47092
NAVKARCORP 184.3(183.15)9293
NCC 86.2(84.15)1405104
NETWORK18 50.35(49.05)180881
NHPC 29.7(29.4)4090092
NIITTECH 495.95(484.2)266265
NITINFIRE 4.15(4.35)474257
NLCINDIA 93.35(93.5)129761
NMDC 123.1(121.9)2241150
NTPC 170.25(167.7)4180417
OBEROIRLTY 377.55(374.85)25528
OFSS 3435.1(3420.25)15457
OIL 278.8(276.1)251186
OMAXE 205.05(200.6)738030
ONGC 159.7(159.45)2344934
ORIENTBANK 123.5(119.65)2483489
ORIENTCEM 151.15(150.15)46196
ORISSAMINE 1647(1639.6)1659
PAGEIND 17203.1(17214.4)18059
PARSVNATH 20(20.4)1689358
PCJEWELLER 361.8(369.95)5224462
PEL 2625.2(2579.35)133168
PERSISTENT 619.1(620.05)204235
PETRONET 230.95(229.1)1711704
PFC 120.65(116.75)3782929
PFIZER 1808.35(1763.3)34902
PFS 36.15(36.1)1569056
PGHH 8118.35(8114.9)2418
PHOENIXLTD 547.7(540.05)59798
PIDILITIND 815.85(819.45)397771
PIIND 734.8(727.2)55418
PNB 142.65(138)9488136
POLARIS 241.1(240.05)34668
POWERGRID 219.75(219.5)2988440
PRAJIND 66.9(66.5)221008
PRESTIGE 258.45(258.9)54680
PRISMCEM 111(107.55)64258
PTC 113.45(110.2)2498204
PUNJLLOYD 19.05(18.8)493540
PURVA 72.15(70.2)122385
PVR 1255.45(1272.35)173261
RADICO 161.65(162.65)473860
RAIN 144.1(137.65)1707061
RAJESHEXPO 719.3(719.15)821371
RALLIS 232.4(227.75)248433
RAMCOCEM 666.2(660.85)196714
RAMCOSYS 357.95(363.8)57097
RATNAMANI 807.05(803.05)4021
RAYMOND 737(731.35)387815
RCF 95.9(92.9)4610245
RCOM 23.05(22.9)13907376
RDEL 52.45(52.4)683924
RECLTD 157.2(152.9)6032661
REDINGTON 146.8(148.9)449638
RELAXO 499.95(494.7)16577
RELCAPITAL 767.3(744.45)4754311
RELIANCE 1582.05(1560.05)1901824
RELINFRA 474.8(465.65)1655184
RENUKA 17.4(17.3)1912575
REPCOHOME 649.5(631.55)109585
RIIL 413.7(408.95)121057
RKFORGE 549.65(538.55)8162
ROLTA 52.95(52.7)183277
RPOWER 39.2(38.5)1636816
RTNPOWER 5.7(5.7)1266374
RUCHISOYA 21.45(21.5)388560
SADBHAV 267.75(263.65)38005
SADBHIN 102.85(101.2)8402
SAIL 60.7(58.8)4200968
SANOFI 3990.3(3957.25)2753
SBIN 279(273.9)11317821
SCHAEFFLER 4241.05(4249.9)4762
SCHNEIDER 116.7(115.8)50833
SCI 93.65(90)1882505
SHARDACROP 435.65(436.85)3725
SHILPAMED 555.5(552.15)19191
SHK 246.95(245.65)66107
SHOPERSTOP 343.45(338.5)88747
SHREECEM 17166.2(17181.1)10735
SHRIRAMCIT 2213.25(2198.85)43222
SIEMENS 1255.65(1262.5)113740
SIMPLEXINF 490.05(484.45)4595
SINTEX 30.3(29.85)24314395
SITINET 24.85(25)1534503
SJVN 31.1(30.25)456359
SKFINDIA 1539.85(1556.15)1172
SMLISUZU 920.85(924.1)10363
SNOWMAN 50.3(48.4)677219
SOBHA 391.7(387.55)204184
SOMANYCERA 779.75(768.65)10238
SONATSOFTW 154.65(155.25)59643
SOUTHBANK 27.2(26.55)9317669
SPARC 425.05(416.85)1076417
SREINFRA 118.75(118.35)1135679
SRF 1463.75(1460.45)148420
SRTRANSFIN 971.3(958.4)438638
STAR 913.55(912.7)258484
STCINDIA 154.9(151.85)119844
SUNDARMFIN 1635(1599.35)5725
SUNDRMFAST 385.95(386.25)56360
SUNPHARMA 469.2(470.45)3682870
SUNTV 714.65(698.15)1148207
SUPREMEIND 1124.65(1129.9)26782
SUVEN 162.5(161.95)78657
SUZLON 16.35(16.05)20574467
SWANENERGY 125.85(118.45)366670
SYMPHONY 1245.6(1241.3)34907
SYNDIBANK 64.6(62.75)2810177
SYNGENE 437.8(441.8)44875
TAKE 135(128.65)425531
TATACHEM 588.1(582.8)513770
TATACOFFEE 134.15(132.9)380574
TATACOMM 637.55(615.25)388436
TATAELXSI 1640.4(1616.2)221184
TATAGLOBAL 196.55(189.85)7522673
TATAMOTORS 379.95(373.6)4448871
TATAMTRDVR 226.55(224)991510
TATAPOWER 78.75(80.05)2065914
TATASPONGE 810.7(804.1)83436
TATASTEEL 634.6(619.6)3918843
TBZ 101.95(101)256067
TCS 2489.45(2497.55)781136
TECHM 430.2(439.35)1576891
TECHNO 361.25(356.9)19473
TEXRAIL 87.05(87.5)141202
THERMAX 866.85(879.85)13848
THOMASCOOK 217(217.95)238797
TIDEWATER 5751(5697.05)1230
TIMKEN 716.8(699.65)13151
TITAN 607.5(615.1)2030608
TNPL 338.35(335.35)50310
TORNTPHARM 1207.5(1222.15)83377
TORNTPOWER 209.35(208.55)782745
TREEHOUSE 14.8(14.75)28668
TRIDENT 86.55(82)3485079
TRITURBINE 130.45(130.2)24340
TTKPRESTIG 6360.85(6365.6)1533
TTML 6.75(6.7)871173
TUBEINVEST 793.2(799.35)203918
TV18BRDCST 36.4(35.5)1751349
TVSMOTOR 584.6(582.6)905000
TVSSRICHAK 3350.15(3344.9)3306
TVTODAY 245.5(242.05)82246
UBL 804.85(805.45)181656
UCOBANK 30.75(30)732314
UFLEX 418.95(410.3)115635
ULTRACEMCO 3951.55(3975.25)142515
UNICHEMLAB 242.25(244)26053
UNIONBANK 134.2(128.95)3664065
UNITECH 7.3(7.15)20909202
UPL 814.1(796.55)772199
VAIBHAVGBL 517(505.9)3026
VAKRANGEE 459.6(446.45)1047727
VEDL 299.6(293.05)8674950
VIDEOIND 17.85(18.25)803796
VIJAYABANK 64.5(63.7)2020756
VINATIORGA 999.35(986.65)8285
VIPIND 206.8(208.3)434197
VOLTAS 522(524.9)838053
VRLLOG 333.15(332.5)31519
VSTIND 2720.85(2734.2)1196
VTL 1171.1(1178.85)13677
WABAG 603.25(608.6)46095
WABCOINDIA 5541.15(5655.2)3344
WELCORP 132(127.6)560162
WELSPUNIND 71(72.45)428500
WHIRLPOOL 1178.2(1184.2)8157
WIPRO 290(290.25)2333779
WOCKPHARMA 558.8(543.3)480374
WONDERLA 333.9(335.4)24381
YESBANK 1723.25(1712.9)2243348
ZEEL 514.9(516.45)1323845
ZEELEARN 42.2(41.2)103197
ZENSARTECH 789.4(783.55)1133
ZYDUSWELL 865.4(865.5)6460

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (ముంబై)	వెండి	రూపాయి Vs డాలర్	ముడి చమురు
▲ 276.16	▲ 86.95	▲ 70	▲ 165	▼	▲
31568.01	9852.50	29,150	39,035	64.12	51.60
		10 గ్రాములు (99.9 స్వచ్ఛత)	కిలో (రూపాయల్లో)		బ్యారల్ ధర (డాలర్లలో..)



ఘనంగా ముగిసిన హెరిటేజ్ ఫుడ్స్ రజతోత్సవాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ సంవత్సరం ఏప్రిల్‌లో ప్రారంభమైన హెరిటేజ్ ఫుడ్స్ రజతోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాలకు హైదరాబాద్ హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్ వేదికైంది. గత పాతికేళ్లుగా కంపెనీతో కలిసి పని చేసిన అందరినీ ఈ ఉత్సవాలకు ఆహ్వానించారు. ముగింపు ఉత్సవంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, హెరిటేజ్ ఫుడ్స్ వైస్ చైర్‌పర్సన్, ఎండి నారా భువనేశ్వరి, ఎపి ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, ప్రముఖ నటుడు బాలకృష్ణ, కంపెనీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'జియోఫోన్' బుకింగ్స్ షురూ..

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రిలయన్స్ 4జి ఫీచర్ ఫోన్ 'జియోఫోన్' ప్రీ బుకింగ్స్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి ముందస్తు బుకింగ్స్ ప్రారంభంకానున్నట్టు కంపెనీ తెలిపింది. ఆన్‌లైన్‌లో మైజియో యాప్‌తోపాటు జియో డాట్‌కామ్ ద్వారా ఈ ఫోన్‌ను బుక్ చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్‌లో భాగంగా జియో రిటైలర్లు, మల్టీ బ్రాండ్ డివైజ్ రిటైలర్లు, రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో బుక్ చేసుకోవచ్చని కంపెనీ పేర్కొంది. 500 రూపాయలు చెల్లించి ఈ ఫోన్‌ను బుక్ చేసుకోవచ్చని, మిగతా 1,000 రూపాయలు ఫోన్ డెలివరీ తీసుకున్నప్పుడు చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. సెక్యూరిటీ డిపాజిట్ కింద మాత్రమే 1,500 రూపాయలు తీసుకుంటున్నట్టు కంపెనీ పేర్కొంది. మూడేళ్ల తర్వాత ఫోన్‌ను తిరిగి ఇచ్చి ఈ మొత్తం వెనక్కి తీసుకోవచ్చని వివరించింది.

జియోఫోన్ ఫీచర్లు..

జియోఫోన్ తెలుగుతోపాటు 22 ప్రాంతీయ భాషలకు సపోర్ట్ చేస్తుంది. ఇందులో 4జిబి ఇంటర్నల్ మెమరీ (128జిబిలకు పెంచుకోవచ్చు)ఉంది. 2.4 అంగుళాల స్క్రీన్, 512 రామ్, వెనుక భాగంలో 2 మెగాపిక్సెల్ కెమెరా, ముందు విజిఎ కెమెరా, 2000 ఎంఎహెచ్ బ్యాటరీ ఉన్నాయి. ముందు కెమెరా ఉండటం వల్ల వీడియోకాల్స్ చేసుకోవచ్చు. గూగుల్ మాప్స్, యూట్యూబ్, ఫేస్‌బుక్, గూగుల్ క్రోమ్, ఫైర్‌ఫాక్స్ వంటి అప్లికేషన్లు కూడా ఉన్నట్టు రిలయన్స్ జియో తెలిపింది. జియో అందిస్తున్న యాప్స్ అన్నీ ఇందులో ఉన్నాయి.



త్వరలో రఘురామ్ రాజన్ పుస్తకం



న్యూఢిల్లీ: భారత రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ రాసిన ఒక పుస్తకం సెప్టెంబర్ 4న మార్కెట్లోకి విడుదల కానుంది. 'ఐ డు వాట్ ఐ డు, ఆన్ రిఫార్మ్, రిటోరిక్ అండ్ రిసోల్వ్' పేరుతో ఈ పుస్తకం విడుదలవుతోంది. 2013 సెప్టెంబర్‌లో తాను ఆర్‌బిఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించే నాటికి నెలకొన్న ఆర్థిక పరిస్థితి, ఆ కష్టాల నుంచి బయట పడేందుకు తీసుకున్న చర్యలను రాజన్ ఈ పుస్తకంలో వివరించినట్టు ప్రచురణ సంస్థ 'హార్పర్ కోలిన్ ఇండియా' పేర్కొంది.

వార్తా పత్రికల ప్రకటనల జిఎస్‌టిపై స్పష్టత

న్యూఢిల్లీ: వార్తా పత్రికల ప్రకటనలపై విధించే జిఎస్‌టిపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టత ఇచ్చింది. ఏదైనా ఏజెన్సీ ఒక పత్రికకు కమీషన్ పద్ధతిలో ఏజెంట్‌గా పని చేస్తూ ప్రకటనల కోసం పత్రికలో కొంత భాగాన్ని అమ్మితే వచ్చే కమీషన్‌పై 18 శాతం జిఎస్‌టి ఉంటుందని తెలిపింది. అయితే ఏదైనా ఏజెన్సీ పత్రికలో కొంత భాగాన్ని ముందుగానే కొనుక్కుని ఆ భాగాన్ని ప్రకటనల కోసం అమ్ముకుంటే వచ్చే ఆదాయంపై మాత్రం ఐదు శాతం జిఎస్‌టి చెల్లిస్తే సరిపోతుందని తెలిపింది. ఉదాహరణకు ఒక ఏజెన్సీ ఒక వార్తా పత్రికలో రూ.100 విలువైన కొంత స్థలాన్ని ప్రకటనల కోసం 15 శాతం డిస్కౌంట్‌తో రూ.85కు కొనుక్కుని దాన్ని రూ.100కు అమ్ముకుంటే పత్రికకు వచ్చే రూ.85 ఆదాయంపై ఐదు శాతం చొప్పున, ఏజెన్సీకి వచ్చే రూ.100 ఆదాయంపై ఐదు శాతం చొప్పున జిఎస్‌టి చెల్లించాలి. అదే ఏదైనా ప్రకటనల ఏజెన్సీ ఒక పత్రికకు కమీషన్ పద్ధతిలో ప్రకటనల ఏజెంట్‌గా పని చేస్తూ ప్రకటనల స్థలం విక్రయిస్తుంటే మాత్రం అమ్మకం కమీషన్‌పై 18 శాతం జిఎస్‌టి చెల్లించాలి. ఈ అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంపైనా పత్రిక ఐదు శాతం జిఎస్‌టి చెల్లించాలి. అయితే తనకు ముట్టిన కమీషన్‌పై ప్రకటనల ఏజెన్సీ చెల్లించే పన్నుపై పత్రిక ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ పొందవచ్చని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రకటనల ఏజెన్సీ ప్రకటనల కోసం పత్రికలో స్థలమే కాకుండా డిజైనింగ్ లేదా ఆ ప్రకటనకు సంబంధించిన డ్రాఫ్టింగ్ వంటి సేవలు అందిస్తే వాటిపైనా 18 శాతం జిఎస్‌టి భారం పడుతుంది. అయితే ఇవన్నీ వార్తా పత్రిక, ప్రకటనల ఏజెన్సీ, క్లయింట్ మధ్య కుదిరే కాంట్రాక్ట్ షరతులపై ఆధారపడి ఉంటాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది.

మేనేజ్‌తో ట్రిపుల్ ఐటి హైదరాబాద్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అగ్రిటెక్ స్టార్టప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించే నిమిత్తం ట్రిపుల్ ఐటి హైదరాబాద్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)లు చేతులు కలిపాయి. ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదిరింది. దేశ వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను టెక్నాలజీలు, ఇన్నోవేషన్స్‌తో పరిష్కరించే ఆలోచనలు కలిగిన ఎంటర్‌ప్రైజ్‌లను గుర్తించి, ప్రోత్సహించి తగిన మద్దతును అందించడం ఈ ప్రోగ్రామ్ ఉద్దేశం. దీని ద్వారా వ్యవసాయ రంగంలో మరిన్ని స్టార్టప్స్ రావడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. తమ ఒప్పందం వల్ల భారత వ్యవసాయ రంగం మరింతగా పురోగతి సాధించే అవకాశం ఉంటుందని, టెక్నాలజీ గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి రావడానికి ఆస్కారం ఉంటుందని ట్రిపుల్ ఐటి హైదరాబాద్ డైరెక్టర్ పిజె నారాయణన్ పేర్కొన్నారు.

సత్యం కేసులో సెబికి మరింత గడువు

న్యూఢిల్లీ: సత్యం కంప్యూటర్స్ కుంభకోణం కేసులో తాజా ఉత్తర్వులు జారీ చేసేందుకు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్) క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబికి మరింత గడువు ఇచ్చింది. ఈ కేసులో కంపెనీ ప్రధాన ప్రమోటర్లయిన బి రామలింగ రాజు, అతడి సోదరుడు రామరాజు, తదితరులను సెబి 14 సంవత్సరాల పాటు స్టాక్ మార్కెట్ లావాదేవీల నుంచి నిషేధించింది. ఇది గాక వీరు అక్రమ లావాదేవీల ద్వారా ఇన్వెస్టర్లకు కలిగించిన నష్టానికి 1,849 కోట్ల రూపాయలు 12 శాతం వడ్డీతో చెల్లించాలని 2014 జూలైలో ఆదేశించింది. దీంతో వీరిద్దరూ సెబి ఆదేశాలను శాట్‌లో సవాల్ చేశారు. కేసును విచారించిన శాట్ వీలైతే నాలుగు నెలల్లో తాజా ఆదేశాలు జారీ చేయాలని మే 12న ఆదేశించింది. ఈ గడువును మరో నాలుగు నెలలు పొడిగిస్తూ ఈ నెల 21న మళ్లీ ఉత్తర్వులు జారీ చేసింది. సరైన కారణాలు పేర్కొనకుండా సత్యం కంప్యూటర్స్ బోర్డు సభ్యులను, ఉన్నతాధికారులు 14 సంవత్సరాల పాటు స్టాక్ మార్కెట్ లావాదేవీల్లో పాల్గొనకుండా నిషేధించడం న్యాయంగా లేదని శాట్ పేర్కొంది.

సెప్టెంబర్ 26 నుంచి ముంబైలో
పర్యావరణ టెక్నాలజీలపై సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నానాటికీ ఇటు ప్రజల్లోను, అటు ప్రభుత్వంలోనూ పర్యావరణంపై ఆసక్తి పెరుగుతున్నందు వల్ల పర్యావరణ సాంకేతిక పరిజ్ఞానాల ఆవశ్యకత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వివిధ వర్గాలు, పర్యావరణంతో ముడిపడి ఉన్న భిన్న రంగాలకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాలను అందిస్తున్న కంపెనీలకు వేదికగా ముంబైలో సెప్టెంబర్ 26, 28 తేదీల మధ్య మూడు రోజుల పాటు ఒక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు ఐఫాట్ ఇండియా సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ భోలా మండల్ తెలిపారు. ఆ ప్రదర్శనకు రోడ్‌షో నిర్వహించేందుకు హైదరాబాద్ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇందులో 160 మంది ఎగ్జిబిటర్లు, 18 దేశాల ప్రతినిధులు పాల్గొంటారని భావిస్తున్నట్టు చెప్పారు.

సౌదీ అరేబియా మార్కెట్లోకి విఎల్‌సిసి

ముంబై: బ్యూటీ, వెల్‌నెస్ సంస్థ విఎల్‌సిసి.. సౌదీ అరేబియాలో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సౌదీ హెల్త్‌కేర్ సర్వీసెస్, సిగలాహ్‌తో చేతులు కలిపింది. జెద్దాతో వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు ప్రక్రియను మొదలుపెడుతున్నట్టు కంపెనీ తెలిపింది.

ఇన్ఫోసిస్ అనిశ్చితి ఎప్పటి దాకా?

తెరపైకి నీలేకని పేరు

ఆయన సవాలును స్వీకరిస్తారా?

బోర్డులో మార్పులకు అవకాశం ఉందా ?



ఇన్ఫోసిస్‌లో ఏం జరుగుతోంది. సిక్కా స్థానంలో నిర్వహణ బాధ్యతలు చేపట్టేదెవరు? కొత్త సిఇఒ ఎంపికలో వ్యవస్థాపక వాటాదారులు నారాయణమూర్తి ఆయన సహచరుల ప్రమేయం ఉంటుందా? ఇన్ఫోసిస్‌కు గత మూడేళ్లలో సిక్కా వల్ల కలిగిన లాభం ఎంత? భారీ వేతన ప్యాకేజీతో వచ్చిన సిక్కా కంపెనీపై ఏ స్థాయిలోనైనా తన ముద్ర వేయగలిగారా? బోర్డుకు, మూర్తి బృందానికి మధ్య భగ్గుమంటున్న విభేదాలను పరిష్కరించేందుకు ఎవరు చొరవ తీసుకుంటారు? వ్యవస్థాపక వాటాదారుల విశ్వాసం కోల్పోయిన ప్రస్తుత బోర్డు సభ్యులు కొనసాగుతారా, వైదొలుగుతారా? రెండు లక్షల వరకు ఉన్న ఉద్యోగులు, లక్షల సంఖ్యలోని ఇన్వెస్టర్లు, సంస్థకు అప్పులిచ్చిన బ్యాంకులు, కస్టమర్లు, ఇతర స్టేక్ హోల్డర్లకు సంబంధించిన ప్రయోజనాలపై తలెత్తుతున్న ఆందోళనకు సమాధానం ఎవరిస్తారు? ఇన్ఫోసిస్‌ను కుదిపేసిన సిఇఒ విశాల్ సిక్కా నిష్క్రమణ తర్వాత తలెత్తుతున్న ప్రశ్నలివి. దేశీయ ఐటి రంగంలో ఇన్ఫోసిస్‌కు ఐకానిక్ సంస్థగా పేరుంది. దేశీయ ఐటి రంగం భవిష్యత్తును ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చేయగల శక్తి ఇన్ఫోసిస్‌కు ఉంది. భారతీయ ఐటి రంగం భవిష్యత్తుకు ఒక సూచీ వంటి సంస్థ కావడం వల్ల ఇన్ఫోసిస్ సంక్షోభంపై ఇప్పుడు అన్ని వర్గాల్లోనూ ఉత్కంఠ కనిపిస్తోంది. సహ వ్యవస్థాపకుల్లో ఒకరైన నీలేకనినే ప్రస్తుత సవాళ్లను అధిగమించడంలో సంస్థకు సహాయపడగలరన్న అభిప్రాయం వినవస్తోంది.

> ఇన్ఫోసిస్ బడా షేర్‌హోల్డర్లతో ఎన్‌ఆర్ నారాయణ మూర్తి టెలిఫోన్ కాన్ఫరెన్స్‌ను ఆగస్టు 29కి వాయిదా వేశారు. ఇన్ఫోసిస్‌లో వాటాలున్న విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లతో బుధవారం నాడు నారాయణమూర్తి టెలికాన్ ఉంటుందని మొదట ప్రకటించారు. అయితే మూర్తికి ఒంట్లో బాగో లేని కారణంగా ఆఖరు నిమిషంలో దీనిని 29వ తేదీకి వాయిదా వేశారు.

తొలిసారిగా బయటవ్యక్తికి..

మూడు దశాబ్దాలపాటు సంస్థను కీలక పాత్రల్లో ఉండి నడిపించిన వ్యవస్థాపక ప్రమోటర్లు రిటైర్ అయిన తర్వాత, మూడేళ్ల క్రితం తొలిసారిగా బయటవ్యక్తికి సారథ్య బాధ్యతలను అప్పగించారు. బాధ్యతలు స్వీకరించినప్పుడు విశాల్ సిక్కాకు, వ్యవస్థాపక ప్రమోటర్లకు మధ్య మంచి సంబంధాలే ఉన్నాయి. అంతర్జాతీయ ఐటి దిగ్గజం ఎస్‌ఎపిలో సుదీర్ఘకాలం పనిచేసిన సిక్కాకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌లో తిరుగులేని ట్రాక్ రికార్డ్ ఉంది. ఏళ్లుగా చౌక సర్వీసులతో మార్కెట్‌ను గెలుచుకుంటూ వచ్చిన ఇన్ఫోసిస్ వ్యాపార వ్యూహాలను మార్చుకోక తప్పని పరిస్థితుల్లో ఉన్నపుడు సిక్కా రంగ ప్రవేశం చేశారు. 3 లక్షల కోట్ల డాలర్ల విలువైన ఐటి మార్కెట్‌ను ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తీవ్రమైన కుదుపునకు గురిచేశాయి. డిజిటల్ టెక్నాలజీస్, క్లౌడ్ సర్వీసులు ఇన్ఫోసిస్ వంటి కంపెనీలు ఇప్పటి వరకు అందిస్తున్న సర్వీసుల ఆవశ్యకత లేకుండా చేశాయి.

సిక్కా కొంత చేశారు..

బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఇన్ఫోసిస్‌లో దూకుడుగానే ముందుకు పోయారు. కమోడిటీలుగా మారిన అప్లికేషన్ మెయింటెనెన్స్, టెస్టింగ్, ప్యాకేజ్ ఇంప్లిమెంటేషన్ వంటి సర్వీసుల్లో వేలాది ఉద్యోగాలను ఎత్తివేశారు. ఐపి ప్లాట్‌ఫామ్స్ డెవలప్‌మెంట్, కంపెనీల కొనుగోలు, కొత్త ఆలోచనలపై పెట్టుబడులకు సిద్ధపడ్డారు. భారతీయ ఐటి కంపెనీలు ముఖ్యంగా ఇన్ఫోసిస్ వంటి కంపెనీలు అభివృద్ధి చేసిన పని సంస్కృతి, అనుసరించే సంప్రదాయాలకు సిక్కా కొత్త. కంపెనీలో మొదటి నుంచీ ఉన్న సీనియర్ ఎగ్జిక్యూటివ్స్‌తో సత్సంబంధాల కోసం ప్రయత్నించలేదు. పైగా తాను పనిచేసి వచ్చిన ఎస్‌ఎపి నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తీసుకువచ్చి భారీ వేతనాలతో కీలక స్థానాల్లో నింపే ప్రయత్నం చేశారు. దీనిపై తీవ్రంగానే అసంతృప్తి మొదలైంది. ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి విమర్శలు మొదలయ్యాయి. ప్రమోటర్లతోనూ మంచి సంబంధాల కోసం ప్రయత్నించలేదు. నిజానికి ఇన్ఫోసిస్‌లో నారాయణమూర్తి వాటా 3.44 శాతం మాత్రమే. కంపెనీపై ఆయన ప్రభావం ఈ వాటాతో నిమిత్తం లేకుండా అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఈ విషయంలో సిక్కా సరైన అంచనాలతో లేని కారణంగా ఆయన అనుకున్నది అనుకున్నట్టుగా చేయలేకపోయారని విశ్లేషకులు అంటున్నారు. సిక్కా హయాంలో ఇన్ఫోసిస్ శరవేగంగా దూసుకుపోతున్న కంపెనీ పేరును మళ్లీ సాధించిందన్న మాట మాత్రం నిజం. ఆయన బాధ్యతలు స్వీకరించినప్పుడు త్రైమాసికంలో రాబడి 213 కోట్ల డాలర్లు ఉండగా రాజీనామాకు ముందు త్రైమాసికంలో రాబడి 265 కోట్ల డాలర్లు ఉంది. నగదు నిల్వలు 490 కోట్ల డాలర్ల నుంచి 610 కోట్ల డాలర్లకు చేరాయి. అనేక కంపెనీలను ఇన్ఫీ టేకోవర్ చేసింది. ఇన్వెస్టర్లకు రూ.20 వేల కోట్ల డివిడెండ్లు పంచింది.

విమర్శలూ ఉన్నాయి..

ఇజ్రాయెల్‌కు చెందిన క్లౌడ్ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ కంపెనీ పనయా కొనుగోలు వివాదాస్పదంగా మారింది. దీని కోసం వెచ్చించిన 20 కోట్ల డాలర్లు చాలా ఎక్కువని, ఈ డీల్‌లో కొందరు ఉద్యోగులు లబ్ది పొందారని ఆకాశరామన్న రాసిన ఉత్తరంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. సిక్కా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అమెరికాలోనే ఉంటున్నారు. ఆయన ఖర్చులు, తరుచూభారీ ఖర్చుతో ప్రైవేట్‌జెట్‌లో ప్రయాణించడం వంటివి విమర్శలకు తావునిచ్చాయి. ఎప్పటి నుంచో సంస్థలో ఉంటున్న పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ రాజీనామాలు చేయడం సిక్కా పట్ల వ్యతిరేకతకు అవకాశం ఇచ్చాయి. వీటన్నింటి మధ్య బోర్డు నుంచి మాత్రం సిక్కాకు పూర్తి మద్దతే లభించింది. సిక్కా రాజీనామాకు పదేపదే మూర్తి నోరుపారేసుకోవడమే కారణమని బోర్డు నేరుగా దుయ్యబట్టడమే ఇందుకు రుజువు. అయితే కో చైర్మన్ రవి వెంకటేషన్‌తో సిక్కాకు పెద్దగా పొసగలేదని కూడా చెబుతున్నారు.

నీలేకనినే బెస్ట్ బెట్..

ఇన్ఫోసిస్ ఎంత ప్రతిష్ఠాత్మకమైన కంపెనీ అయినప్పటికీ ఇప్పుడున్న పరిస్థితుల్లో బయటవ్యక్తులు వచ్చి పగ్గాలు చేపట్టడం కష్టం. అందువల్ల ఇన్‌సైడర్‌కే ఆ బాధ్యతలు అప్పగించాలని పలువురు, సంస్థాగత వాటాదారులు, ఎనలిస్టులు అంటున్నారు. చాలా మంది నోటి నుంచి వినవస్తున్న పేరు నందన్ నీలేకని. సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన నీలేకనికి బాధ్యతలు అప్పగిస్తేనే పరిస్థితులు చక్కబడుతాయన్నది వారి అభిప్రాయం. ఇన్ఫోసిస్‌లో వాటాలున్న డజను ఫండ్ సంస్థలు ఈ మేరకు ఒక లేఖను బోర్డుకు రాశాయి. నీలేకని చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తే నారాయణ మూర్తి కూడా సంస్థ వ్యవహారాల జోలికి వెళ్లకపోవచ్చని భావిస్తున్నారు. 2002-2007 మధ్య ఇన్ఫోసిస్ సారధిగా ఉన్న నీలేకనీ ఆ తర్వాత కాంగ్రెస్ హయాంలో యుఐడిఎఐ చైర్మన్‌గా ఆధార్ ఉద్యమాన్ని సక్సెస్‌ఫుల్‌గా నడిపారు. కాంగ్రెస్ టికెట్‌పై బెంగళూరు నుంచి లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయారు. అయినప్పటికీ ప్రస్తుత ప్రధాని మోదీకి కూడా ఆయన ఇష్టుడే. క్యాష్‌లెస్ ఎకానమీని ప్రోత్సహించేందుకు ఆయన్ను అడ్వైజర్‌గా ఉండమని కూడా మోదీ కోరారు. అనేక రకాలుగా రాటుతేలిన నీలేకని మాత్రమే ఇప్పుడున్న పరిస్థితుల్లో సంస్థకు న్యాయం చేయగలరన్నది మ్యూచువల్ ఫండ్ సంస్థల భావన. ఐసిఐసిఐ, రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి, ఎస్‌బిఐ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, మ్యూచువల్ ఫండ్స్ ప్రతినిధులు బోర్డుకు రాసిన లేఖపై సంతకం చేశారు. సంస్థ మాజీ సిఎఫ్‌ఒ బాలకృష్ణన్ కూడా నీలేకనీనే ప్రస్తుత పరిస్థితుల్లో ఇన్ఫోసిస్ బాధ్యతలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. నీలేకని చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధమైతే ప్రస్తుత చైర్మన్ శేషసాయి, కో చైర్మన్ రవి వెంకటేషన్ ఇద్దరూ తప్పుకోవాల్సి ఉంటుందని అంటున్నారు.

ప్రాంతీయ భాషల్లో బిస్లెరీ లేబుల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మినరల్ వాటర్ బ్రాండ్ బిస్లెరీ.. మరింత ఎక్కువ మంది కస్టమర్లను సంపాదించుకునేందుకు వినూత్న పంథాను అనుసరిస్తోంది. ఇందులో భాగంగా ప్రాంతీయ భాషలతో కూడిన లేబుల్స్‌తో వాటర్ బాటిళ్లను అందుబాటులోకి తెస్తోంది. తొలి విడతలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, యుపిలోని ప్రాంతీయ భాషల లేబుల్స్‌తో వాటర్ బాటిళ్లను మార్కెట్లోకి తెస్తున్నట్టు కంపెనీ తెలిపింది. ప్రాంతీయ భాష ఉండటం వల్ల ప్రజలు త్వరగా గుర్తించడానికి అవకాశం ఉంటుందని, దీన్ని దృష్టిలో ఉంచుకునే తాము వివిధ ప్రాంతీయ భాషల లేబుల్స్‌తో వాటర్ బాటిళ్లను అందుబాటులోకి తీసుకురానున్నామని బిస్లెరీ ఇంటర్నేషనల్ మార్కెటింగ్ డైరెక్టర్ అంజన ఘోష్ తెలిపారు.



సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) కౌన్సిల్ 21వ సమావేశం సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జరగనుంది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హైఐసీసీ)లో జరిగే ఈ సమావేశ నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షత జరిగే ఈ సమావేశంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, అధికారులు పాల్గొంటారు. హైదరాబాద్‌లో తొలిసారిగా ఈ సమావేశం జరగబోతోంది. ఇది జూలై 1 నుంచి జిఎస్‌టి అమలులోకి వచ్చిన తర్వాత జరుగనున్న మూడో సమావేశం. కొన్ని వస్తు, సేవలపై జిఎస్‌టి రద్దద చేయడం లేదా తగ్గించడం చేయాలని కొన్ని రాష్ట్రాలు పట్టుపడుతున్న నేపథ్యంలో ఈ సమావేశం జరగనుంది. తెలంగాణ కూడా బీడీలు, గ్రానైట్, వర్క్ కాంట్రాక్ట్‌లపై విధించిన జిఎస్‌టి తగ్గించాలని కోరుతోంది. దీంతో సెప్టెంబర్ 9న జరిగే సమావేశం వాడివేడిగానే జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఎంఎఫ్‌లకు కలిసొచ్చిన నోట్ల రద్దు

తెలుగు రాష్ట్రాల్లో 'ఈక్విటీ' పథకాలకే ఆదరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పెద్ద నోట్ల రద్దు నిర్ణయం మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలకు బాగా కలిసొస్తోంది. దీంతో పెట్టుబడులకు సంబంధించి మదుపరుల ఆలోచనా విధానంలోనూ మార్పు వచ్చిందని కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ సేల్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్ అలయన్స్ నేషనల్ హెడ్ మనీష్ మెహతా చెప్పారు. చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్లు రియల్టీ, బంగారం వంటి భౌతిక ఆస్తుల కంటే మ్యూచువల్ ఫండ్స్ వంటి ఫైనాన్షియల్ ఆస్తుల్లో ఎక్కువగా మదుపు చేస్తున్నారని తెలిపారు. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు తగ్గడం కూడా ఇందుకు దోహదం చేస్తోంది.

గత మూడేళ్లుగా ఎంఎఫ్ పరిశ్రమ ఏటా సగటున 12-15 శాతం చొప్పున వృద్ధి చెందుతున్న ట్టు మెహతా చెప్పారు. ఈ అనుకూల వాతావరణం వలనే జూలై, 2017నాటికి దేశంలోని ఎంఎఫ్ సంస్థల నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.20 లక్షల కోట్లకు చేరినట్టు తెలిపారు. ఇందులో రూ.7 లక్షల కోట్లు ఈక్విటీ పథకాల్లో ఉన్నట్టు చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణల్లోనూ ఈక్విటీ పథకాలకు మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం ఈ రెండు రాష్ట్రాల్లోని ఇన్వెస్టర్లు ఎంఎఫ్ పథకాల్లో దాదాపు రూ.50,000 కోట్లు ఇన్వెస్ట్ చేస్తే అందులో 52 శాతం పెట్టుబడులు ఈక్విటీ పథకాల్లో ఉన్నట్టు మెహతా చెప్పారు. ప్రస్తుతం 1.5 కోట్ల క్రమానుగత పెట్టుబడి పథకాల(సిప్) ద్వారా దేశ వ్యాప్తంగా ఇన్వెస్టర్లు ఎంఎఫ్ పథకాల్లో రూ.4,500 కోట్లకుపైగా ఇన్వెస్ట్ చేస్తున్నారు.

రియల్టీ, స్టాక్ మార్కెట్లు ఆటుపోట్లలో ఉన్నా గత మూడేళ్లలో ఈక్విటీ పథకాలపై మదుపరులకు సగటున 20 శాతానికిపైగా రాబడులు లభించాయి. 'స్టాక్ మార్కెట్‌లో ఏర్పడే ప్రతి దిద్దుబాటును మదుపరులు ఎంఎఫ్ ఈక్విటీ పెట్టుబడులకు అవకాశంగా ఉపయోగించుకుంటున్నారు' అని మెహతా చెప్పారు.

పెరిగిన అవగాహన

ఎంఎఫ్ పెట్టుబడులపై అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా (యాంఫీ), మ్యూచువల్ ఫండ్ సంస్థలు చేపట్టిన అవగాహనా కార్యక్రమాలూ దేశంలో ఎంఎఫ్ పథకాల పెట్టుబడులకు దోహదం చేస్తు న్నట్టు తెలిపారు. అయితే 125 కోట్ల జనాభాలో 5.5 కోట్ల మంది మాత్రమే ప్రస్తుతం మన దేశంలో ఎంఎఫ్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు.

పెరగనున్న చేపల ఎగుమతులు



గుడివాడ (ఆంధ్రజ్యోతి): చేపల పెంపకందారులకు ఈ సంవత్సరం అన్ని విధాల కలిసి వస్తోంది. ధరలతో పాటు ఎగుమతులు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. కృష్ణా జిల్లాలో దాదాపు 1.50 లక్షల హెక్టార్లలో ఆక్వా సాగు జరుగుతోంది. అందులో 55 శాతానికిపైగా చెరువుల్లో చేపలు పెంచుతున్నారు. నిన్న మొన్నటి వరకు కిలో శీలావతి రకం చేపలు టన్ను రూ.95,000 ఉండగా, ప్రస్తుతం రూ.1.03 లక్షలు పలుకుతోంది. రెండు కిలోల వరకు బరువు ఉండే కట్ల రకం చేపలకూ ఇదే ధర లభిస్తోంది. టన్ను రూప్‌చంద్ రకం చేపల ధరా రూ.80,000 నుంచి రూ.85,000కు చేరింది.

జోరుగా ఎగుమతులు

దిగుబడులతోపాటు ధర పెరగడంతో చేపల పశ్చిమబెంగాల్, ముంబై, బీహార్, సిల్చేర్, హిమాచల్‌ప్రదేశ్ తదితర ప్రాంతాలకు ఎగుమతులు ముమ్మరం అయ్యాయి. వరదల ఉధృతి తగ్గడంతో బిహార్, అసోం, ఒడిశా రాష్ట్రాలకు కూడా త్వరలో ఎగుమతులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు. దీంతో ఆయా రకాల చేపల ధర టన్నుకు మరో రూ.5,000 నుంచి రూ.8,000 వరకు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. అసోం, బిహార్, ఒడిశా రాష్ట్రాల వరదలతో టన్ను ఫంగస్ రకం చేపల ధర రూ.60,000 నుంచి రూ.57,000కు పడిపోయింది. మళ్లీ ఎగుమతులు ప్రారంభమైతే ఈ చేపల ధర రూ.65,000 వరకు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

లారీ యజమానులకు ఊరట

వరదలతో ఎగుమతులు తగ్గిపోవడంతో గత నెల రోజులుగా లారీ ఆపరేటర్లు డీలా పడిపోయారు. ఫైనాన్స్ కిస్తీలు కూడా కట్టలేక దాదాపు 60 శాతం మంది ఆపరేటర్లు దిక్కులు చూస్తున్నారు. త్వరలో ఆయా రాష్ట్రాలకు చేపల ఎగుమతులు ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్నందున లారీ యజమానులు ఒకింత ఊపిరి పీల్చుకోనున్నారు. మరో వైపు ఆయా ఎగుమతుల కంపెనీల్లో పనిచేవారికి కూడా పని లేకుండాపోయింది. త్వరలో ఎగుమతులు ఊపందుకోనున్నందున పనివారు కూడా బిజి కానున్నారు.



153 కిలోల సమోసా

సాధారణంగా సమోసా బరువు ఎంత ఉంటుంది? సుమారు ఓ 50 గ్రాములుంటుంది? మరీ పెద్దదైతే ఓ 100 గ్రాములుంటుంది. అయితే తూర్పు లండన్‌లోని ఓ మసీదులో 12 ముస్లిం కుర్రాళ్లు కలిసి 15 గంటలపాటు శ్రమించి153 కిలోగ్రాముల బరువున్న సమోసాను తయారుచేశారు. గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కారు. ఆ తర్వాత ఆ సమోసాను పేదలకు పంచేసి తమ పెద్ద మనసు చాటుకున్నారు.

తల్లి ప్రేమను చిన్న వీడియోతో కొలుస్తారా?

- కోహ్లి, ధవన్ పోస్ట్ చేసిన వీడియోపై బాలీవుడ్ గాయకులు తోషి, షరీబ్
- ఆ వీడియోలోని పాప తమ మేనకోడలేనని వెల్లడి



తోషి, షరీబ్

న్యూఢిల్లీ, ఆగస్టు 8: 'పిల్లలకు ప్రేమతో నేర్పండి కోపంతో కాదు'.. అంటూ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, శిఖర్ ధవన్, రాబిన్ ఊతప్ప ఓ చిన్నారి వీడియోను ట్విటర్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు గుర్తుందా? ఆ వీడియో తమ మేనకోడలిదేనని బాలీవుడ్ గాయకులు తోషి సబ్రి, షరీబ్ సబ్రి ప్రకటించారు. వీడియోలో ఉన్న చిన్నారి హయ తమ మేనకోడలని, ఆ పాపను చదివిస్తోంది తమ సోదరి అని.. చదువుకోవడానికి హయ ఎంత మొండికేస్తుందో పాప తండ్రికి చూపడానికే తమ సోదరి ఆ వీడియో తీసిందని వారు వివరించారు. హయ అంటే తమ కుటుంబంలో అందరికీ చాలా ఇష్టమని.. ఒకటిన్నర నిమిషాల వీడియో చూసి ఒక తల్లిప్రేమను తక్కువగా అంచనా వేయడం తగదని వారు అభిప్రాయపడ్డారు. పిల్ల మొండికేసినంతమాత్రాన చదువు చెప్పడం ఆపేస్తామా? అని వారు ప్రశ్నించారు. తమ కుటుంబ సభ్యుల వాట్సప్‌గ్రూప్ కోసం తీసిన వీడియో ఇంత వైరల్ అవుతుందనుకోలేదని వారు పేర్కొన్నారు.



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	22.1	31.2
నిజామాబాద్	23.8	30.6
హైదరాబాద్	23.8	32.7
నల్లగొండ	24.0	34.5
వరంగల్	25.0	32.0
ఖమ్మం	25.0	29.0

పూజకొచ్చిన కొత్త కారు భక్తులపైకి ..

- దూసుకెళ్లడంతో ఆరుగురికి తీవ్రగాయాలు
- భద్రకాళి ఆలయంలో ఘటన







ప్రమాదానికి కారణమైన కారు, ఎంజీఎంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మట్టెవాడ (వరంగల్‌అర్బన్), ఆగస్టు 23: ప్రమాదం ఏ రూపంలో ఎప్పుడు, ఎక్కడ, ఎలా వస్తుందో ఎవరు మాత్రం ఊహించగలరు? వరంగల్ భద్రకాళి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులపైకి అక్కడికే పూజ కోసం వచ్చిన ఓ కొత్త కారు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన ఈ ఘటనలో రెండేళ్ల బాలుడు సహా ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హన్మకొండకు చెందిన పరుచూరి శివాజీ అనే వ్యక్తి తన కొత్త కారుకు పూజ కోసం వరంగల్ భద్రకాళి ఆలయానికి వచ్చాడు. పూజ అనంతరం కారును స్టార్ట్ చేయాల్సిందిగా పూజారి చెప్పడంతో.. శివాజీ స్టార్ట్ చేశాడు. అనంతరం ఒక్కసారిగా యాక్సిలరేటర్‌పై కాలు వేయడం, క్లచ్ వదిలేయడంతో అక్కడే ఉన్న భక్తులపైకి, ఇతర వాహనాలపైకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో వరంగల్ జిల్లా భూపాలపల్లి కృష్ణాకాలనీకి చెందిన ప్రశాంత్, గోపి, వీరన్న, ధారావత్ శౌరిక్ (రెండేళ్ల బాలుడు), ప్రవళికలతో పాటు చంద్రమ్మ అనే యాచకురాలికి తీవ్రమైన గాయాలయ్యాయి. వారిని వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చెట్టు సేవ విలువ

3200 కోట్లు

- కేవలం ఒక మెగాసిటీకి చేసే సేవ ఖరీదు ఇది
- ఏడాదికి ఒక వ్యక్తికి చేస్తున్న సేవ రూ.2250

న్యూయార్క్, ఆగస్టు 23: వృక్షో రక్షతి రక్షితః.. చెట్టును మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది. ఓ చిన్న మొక్కను నాటి నీళ్లు పోస్తే చాలు.. పెరుగుతూనే నీడను, చల్లని గాలిని, ఆక్సిజన్‌ను, పూలను, పండ్లను అందిస్తుంది. వేళ్లు, బెరడు, ఆకులు, పూలు, కాయలు, పండ్లు, విత్తనాలు అనే తేడా లేకుండా తన ప్రతీ భాగాన్ని మనిషికి అర్పిస్తుంది. మానవాళికి నిస్వార్థమైన సేవ చేస్తోంది. ఎండిపోయినా ఇంటి ఫర్నిచర్‌గా, అలంకార వస్తువుగా, ఔషధంగా మనకు సేవ చేస్తూనే ఉంటుంది. మరి ఆ సేవకు వెల కట్టగలమా? అంటే కష్టమే. 'అసలు మనం ప్రతీ దానికి లెక్కలు వేసుకుంటాం కదా.. మరి చెట్లు ఎంత సేవ చేస్తున్నాయో? దాని విలువ ఎంతో తెలుసుకుందాం' అని ముంబై సహా 10 మెగాసిటీల్లో అమెరికాకు చెందిన ది స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ కాలేజ్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ అండ్ ఫారెస్ట్రీ శాస్త్రవేత్తలు ఓ సర్వే నిర్వహించారు. ఆ సర్వే ప్రకారం చెట్లు ఒక మెగాసిటీకి చేసే సేవ విలువ ఎంతో తెలుసా.. రూ.3200 కోట్లు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 750కోట్ల జనాభాలో 10% జనాభా మెగాసిటీల్లోనే ఉంది. ఆ మెగాసిటీల్లో భవంతులు చల్లగా ఉండడానికి, వేడిగాడ్పులు ప్రాణవాళిని ఇబ్బందిపెట్టకుండా, ఎండధాటిని తట్టుకునేందుకు, వాతావరణం సమతుల్యంగా ఉంచడానికి, కార్బన్‌డయాక్సైడ్, భూతాపం పెరగకుండా ఉండేందుకు చెట్లు పాటుపడుతున్నాయని వెల్లడించారు. మెగాసిటీల్లోని ఒక్కో మనిషికి చెట్టు చేస్తున్న సేవ విలువ రూ.2,250 అని, బీజింగ్, బ్యూనస్‌ఎయిర్స్, కైరో, ఇస్తాంబుల్, లండన్, లాస్ ఏంజెలిస్, మెక్సికో సిటీ, మాస్కో, ముంబై, టోక్యోల్లో పరోక్షంగానో, ప్రత్యక్షంగానో చెట్టు చేస్తున్న సేవ విలువను లెక్కగట్టి ఆశ్చర్యపోయామని పరిశోధకులు తెలిపారు.



మీ ఇష్టం.. ఎంతైనా వేధించుకోండి

నన్ను వేధించండి.. వెంటాడండి.. మీరు ఎంతవరకు చెయ్యాలనుకున్నారో అంతవరకు చెయ్యండి. అయితే అబద్ధాలు నిజం కావు. రాజస్థాన్ సర్కార్ నన్ను వేధించవచ్చుకానీ, భూ కుంభకోణంలో నా పాత్రను నిరూపించలేరు.

- సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా



బీజేపీ, బీజేడీ చేతులు కలపాలి

"ఒడిసా ప్రజల బాగు కోసం బీజేపీ, బిజూ జనతా దళ్(బీజేడీ) చేతులు కలిపితే బాగుంటుంది. రెండు పార్టీలు కలిసి పనిచేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. ప్రధాని మోదీ, ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్ చేతులు కలపాలి"

- భువనేశ్వర్‌లో పతంజలి డిస్ట్రిబ్యూటర్ల సమావేశంలో యోగాగురు బాబా రాందేవ్

ఆరుగురు ఔట్?

(3వ పేజీ తరువాయి)

నేతృత్వంలోని జేడీ(యూ), అన్నాడీఎంకే పార్టీలకు కేబినెట్‌లో చోటు కల్పించడంతో పాటు 13 ప్రధాన శాఖల్లో భారీగా మార్పుచేర్పులు చేయాలని మోదీ-షా జోడీ కసరత్తు చేస్తోంది. జేడీయూకి ఒక కేబినెట్‌తో పాటు ఒక సహాయ మంత్రి పదవి ఇవ్వాలని, అన్నాడీఎంకెకు ఒక కేబినెట్, రెండు సహాయమంత్రి పదవులు ఇవ్వనున్నారు. కాగా మంత్రులు పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, ప్రకాశ్ జావడేకర్, జితేంద్ర సింగ్‌లకు ప్రమోషన్ ఇవ్వాలని ప్రధాని నిర్ణయించారు. రైల్వే మంత్రి సురేశ్ ప్రభు రాజీనామాను కేబినెట్ పునర్వవస్థీకరణ సమయంలో ఆమోదించే అవకాశాలున్నాయి. సరిగ్గా పనిచేయని మంత్రులకు ఉద్వాసన పలకాలని, ఎన్నికల టీమ్‌ను కేబినెట్‌లోకి చొప్పించాలని ప్రధాని భావిస్తున్నారు. ఉద్వాసనకు గురయ్యే వారిలో కల్‌రాజ్ మిశ్రా, రాజీవ్ ప్రతాప్ రూడీ, నిర్మలా సీతారామన్, నడ్డా, కృష్ణరాజ్, సంజీవ్‌కుమార్ బల్యాన్ ఉన్నట్టు బీజేపీ నేతలు భావిస్తున్నారు. కాగా కొత్త గవర్నర్ల నియామకాలపైనా మోదీ దృష్టి సారించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు ఇద్దరు గవర్నర్లను నియమించాల ని కేంద్రం భావిస్తోంది. గవర్నర్ల రేసులో కల్‌రాజ్ మిశ్రా, లాల్జీ టాండన్, విజయ్‌కుమార్ మల్హోత్రా, కైలాష్ జోషి, సీపీ ఠాకూర్, ఆనందీబెన్ పటేల్, జితిన్ రాం మాంఝీ, మోత్కుపల్లి నర్సింహులున్నారు. ప్రస్తుతం బిహార్, మధ్యప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దాదర్ అండ్ నగర్ హవేలీ కేంద్ర పాలిత ప్రాంతానికి గవర్నర్లు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొంత మంది ప్రస్తుత మంత్రులను గవర్నర్లుగా పంపించొచ్చని విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

యూపీలో మరో రైలు ప్రమాదం

- 100 మందికి గాయాలు
- డంపర్‌ను ఢీకొన్న కైఫియత్ ఎక్స్‌ప్రెస్



యూపీలోని ఔరేయా జిల్లాలో ఓ డంపర్‌ను ఢీకొని పట్టాలు తప్పిన కైఫయత్ ఎక్స్ ప్రెస్

లఖ్‌నవ్, ఆగస్టు 23: ఉత్తర్‌ప్రదేశ్‌లో మరో రైలు ప్రమాదం జరిగింది. ఉత్కల్ ప్రమాద ఘటనను మరువకముందే జరిగిన ఈ దుర్ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. అయితే, 100 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఢిల్లీ నుంచి ఆజంగఢ్ వెళుతున్న కైఫియత్ ఎక్స్‌ప్రెస్ ఔరియా జిల్లాలో బుధవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. రైల్వే పనుల కోసం నిర్మాణ సామగ్రిని తరలిస్తున్న డంపర్‌ను ఢీకొనడంతో రైలుకు చెందిన 10 బోగీలు పట్టాలు తప్పాయి. ఒక బోగీ పూర్తిగా తిరగబడింది. డంపర్ డ్రైవర్ తప్పిదం కారణంగానే ప్రమాదం జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు. ప్రమాదం కారణంగా ఢిల్లీ-హౌరా మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురువారం ఉదయానికి ఈ మార్గాన్ని పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. ఐదు రోజుల వ్యవధిలో యూపీ లో జరిగిన రెండో రైలు ప్రమాదం ఇది. కాగా, శనివారం నాటి ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంపై గవర్నమెంట్ రైల్వే పోలీసులు(జీఆర్పీ) బుధవారం విచారణ ప్రారంభించారు. ఖతౌలి రైల్వే స్టేషన్ సూపరిండెంట్‌తో పాటు 12 మంది రైల్వే గ్యాంగ్‌మెన్‌కు కమిషనర్ ఆఫ్ రైల్ సేఫ్టీ సమన్లు జారీ చేసింది. ఉత్కళ్ ప్రమాద ఘటనకు సంబంధించి ఢిల్లీలో జరిగే విచారణకు హాజరు కావాలని సమన్లలో ఆదేశించింది. కాగా, వరుస రైలు ప్రమాదాలకు బాధ్యతవహించి రైల్వే మంత్రి సురేశ్ ప్రభు రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీశ్ తివారి డిమాండ్ చేశారు.

సురేశ్ ప్రభు రాజీనామా!

- శాస్త్రి, నితీశ్, మమత బాటలో రైల్వే మంత్రి
- వరుస రైలు ప్రమాదాలకు నైతిక బాధ్యత
- రైల్వే బోర్డు ఛైర్మన్ మిత్తల్‌దీ అదేదారి



న్యూఢిల్లీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వరుస రైలు ప్రమాదాలకు నైతిక బాధ్యత వహించి రైల్వే మంత్రి సురేశ్ ప్రభు రాజీనామా చేశారు. గతంలో ఇలాగే రాజీనామా చేసిన రైల్వే మంత్రులు లాల్ బహదూర్ శాస్త్రి, నితీశ్‌కుమార్, మమత బెనర్జీల సరసన ఆయనా చేరారు. ప్రధాని మోదీని బుధవారం కలిసి.. గత నాలుగు రోజుల్లో జరిగిన రైలు ప్రమాదాలకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తున్నట్లు ప్రభు చెప్పారు. రాజీనామా లేఖను సమర్పించారు. దానిని వెంటనే ఆమోదించకుండా కొన్నాళ్లు వేచి చూడాలని మోదీ సూచించారు. కొద్దిరోజుల్లో కేంద్ర కేబినెట్ విస్తరణ జరుగుతుందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభు రాజీనామాను ప్రధాని ఆమోదించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభు రాజీనామాను మోదీ పరిశీలిస్తున్నారని, త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ఈ నెల 19న యూపీలోని ముజఫర్‌నగర్‌లో కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి 23 మంది ప్రయాణికులు దుర్మరణం పాలయ్యారు. మళ్లీ బుధవారం యూపీలోని ఔరియా వద్ద కైఫియత్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఈ రెండు సంఘటనల దరిమిలా ప్రభుపై విపక్షాల విమర్శలు తీవ్రమయ్యాయి. రాజీనామాకు ఒత్తిడి పెరిగింది. 'దురదృష్టకర రైలు ప్రమాదాలు, ప్రాణనష్టం నన్ను కలచివేశాయి. అయితే రెండు దశాబ్దాలుగా రైల్వే శాఖను సంస్కరించేందుకు అహర్నిశలు శ్రమించాను. ఈ శాఖను గాడినపెట్టేందుకు మూడేళ్లుగా నా రక్తం, స్వేదం ధారపోశాను' అని ప్రభు ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మరోవైపు.. ప్రమాదాలకు బాధ్యత వహిస్తూ రైల్వే బోర్డు ఛైర్మన్ అశోక్ మిత్తల్ మంగళవారమే రాజీనామా చేయగా.. బుధవారం దానిని ఆమోదించారు. ఆయన స్థానంలో ఎయిరిండియా సీఎండీ అశ్వనీ లోహానీని రైల్వే బోర్డు ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

ప్రమాదాలకు కారణం సిబ్బంది కొరతే..!


- రెండు లక్షల పోస్టుల భర్తీకి రైల్వే శాఖ చర్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక నైపుణ్యాన్ని ఎంతగా వినియోగించుకుంటున్నా రైల్వే శాఖకు ప్రమాదాలు సవాల్ విసురుతూనే ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం భద్రత విభాగంలో సిబ్బంది కొరతేనని రైల్వే శాఖ గుర్తించింది. ఉత్తరప్రదేశ్‌లో వరుసగా ప్రమాదాలు జరగడంతో తాజాగా భద్రతపై దృష్టి సారించింది. పోస్టుల భర్తీ, కార్మికుల నియామకానికి చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ప్రస్తుతం భద్రత విభాగంలో 16 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో అత్యధికంగా క్షేత్రస్థాయిలో ఉండాల్సిన పోస్టులే కావడంతో 64 వేల కిలోమీటర్ల ట్రాక్‌ను పర్యవేక్షించడం కష్టంగా మారింది. ఈ మేరకు భద్రత, పెట్రోలింగ్ భాగంలో రానున్న మూడేళ్లలో రెండు లక్షల పోస్టుల భర్తీకి ప్రణాళిక రూపొందిస్తున్నారు. సెన్సార్ టెక్నాలజీతో పని చేసే వంద ట్రాక్ ఇన్‌స్పెక్షన్ వాహనాలు కొనుగోలు చేయనున్నారు. ట్రాక్ నెట్‌వర్క్ పటిష్టానికి రూ.15 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు రైల్వే శాఖ వర్గాలు తెలిపాయి.

పెరుగుతున్న వానలు

హైదరాబాద్, విశాఖపట్నం ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వానలు లేక తీవ్ర దుర్భిక్షంలో వున్న తెలంగాణలో గత వారం మంచి వర్షపాతం నమోదు కావడంతో కొంత ఊపిరి పీల్చుకునే పరిస్థితి నెలకొంది. మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో వర్షాభావం కొనసాగుతుంది. అయితే, పలు జిల్లాల్లో లోటు కొనసాగుతోంది. ఈశాన్య బంగాళాఖాతంలో వున్న రెండు ఉపరితల ఆవర్తనాలు ఒకదానిలో మరొకటి విలీనమయ్యాయి. బుధవారానికి ఈశాన్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుంది. ఇదే సమయంలో కోస్తాపై ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. వీటి ప్రభావంతో రుతుపవనాలు కోస్తాలో చురుగ్గా మారాయి. ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో రాష్ట్రంలో శుక్రవారం నుంచి అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

విటమిన్-బీ ఎక్కువైతే ఊపిరితిత్తుల కేన్సర్



వాషింగ్టన్, ఆగస్టు 23:మోతాదుకు మించి విటమిన్ బీ6, బీ12 ఎక్కువ కాలం తీసుకుంటే పురుషుల్లో ఊపిరితిత్తుల కేన్సర్ వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. జీవక్రియను మెరుగుపర్చడానికి, బలం పెంచేందుకు విటమిన్-బీని వైద్యులు సిఫారసు చేస్తుంటారు. అయితే, పొగ తాగే పురుషులు రోజుకు 20మిల్లీగ్రాముల బీ6, 55మిల్లీగ్రాముల బీ12 కంటే ఎక్కువ మోతాదులో 10ఏళ్ల పాటు తీసుకుంటే కేన్సర్ వచ్చే అవకాశాలు మూడు రెట్లు ఎక్కువవుతుందని అమెరికాలోని ఓహియో స్టేట్ వర్సిటీ పరిశోధకులు తెలిపారు.

తొలిదశలోనే చర్మ కేన్సర్‌ను గుర్తించే కృత్రిమ మేధస్సు

టొరంటో, ఆగస్టు 23: పుట్టుకురుపు లాంటి చర్మ కేన్సర్ వ్యాధిని తొలినాళ్లలోనే గుర్తించే కృత్రిమ మేధస్సును కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ వాటర్లూ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. చర్మంపై ఉన్న పుండ్ల చిత్రాలను విశ్లేషించి ముందుగానే గుర్తించే ఈ వ్యవస్థతో వ్యాధి ముదరకముందే సరైన చికిత్స అందించవచ్చని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చర్మానికి సంబంధించిన 10వేల చిత్రాలను ఉపయోగించి ఈ వ్యవస్థను రూపొందించామని శాస్త్రవేత్తలు తెలిపారు.

శశికళపై నేడు వేటు!

- దినకరన్ దూకుడుకు చెక్
- ఎమ్మెల్యేలూ తక్షణం చెన్నై రండి: ఈపీఎస్
- నేడు అన్నాడీఎంకే అత్యవసర కార్యవర్గ భేటీ



ఎంజీఆర్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న ఓపీఎస్, ఈపీఎస్

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తమిళ తెరపై రసవత్తర సినిమా నడుస్తోంది. తమను అధికారపీఠం నుంచి దూరం చేసేందుకు దినకరన్ చేస్తున్న ప్రయత్నాలకు చెక్‌పెట్టేందుకు సీఎం ఈపీఎస్, డిప్యూటీ సీఎం ఓపీఎస్‌లు వ్యూహాలకు పదునుపెడుతున్నారు. శశికళకు పార్టీ నుంచి ఉద్వాసన పలకడం ద్వారా దినకరన్ దూకుడుకు చెక్ పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేలను తక్షణం చెన్నై చేరుకోవాలని సీఎం ఈపీఎస్ బుధవారం ఆదేశించారు. గురువారం పార్టీ అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించి, శశికళపై వేటు వేయాలని ఈపీఎస్, ఓపీఎస్‌లు భావిస్తున్నారు. శశికళతోపాటు పార్టీలో పాతుకుపోయిన ఆమె కుటుంబసభ్యులందరిపైనా వేటు వేయనున్నట్లు సమాచారం. అదే సమయంలో అసెంబ్లీలో బలపరీక్షకు సిద్ధం కావాల్సి వస్తే తమ వర్గం ఎమ్మెల్యేలు జారిపోకుండా చూసుకునేందుకే చెన్నైలో తమ వర్గం ఎమ్మెల్యేలతో శిబిరం ఏర్పాటుకు ఈపీఎస్, ఓపీఎస్ సిద్ధమవుతున్నారు. "ఎంజీఆర్, జయలలిత ఆత్మలు మాతోనే ఉన్నాయి. ఆ ఆత్మలు మాతో ఉన్నంత వరకూ మా ప్రభుత్వాన్ని కూల్చడం ఎవ్వరి తరం కాదు" అని సీఎం ఎడప్పాడి పళనిస్వామి, డిప్యూటీ సీఎం ఓ.పన్నీర్‌సెల్వం దీమా వ్యక్తం చేశారు. అరియలూరులో బుధవారం ఎంజీఆర్ శతజయంతి వేడుకల్లో వీరు పాల్గొన్నారు. కాగా, అన్నాడీఎంకే బహిష్కృత నేత టీటీవీ దినకరన్ బుధవారం పార్టీ నుంచి పలువురు మంత్రులు, సీనియర్ నేతలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దినకరన్ సస్పెండ్ చేసిన మంత్రుల్లో.. ఆర్‌బీ ఉదయకుమార్, విజయభాస్కర్, వీరమణి, కామరాజ్ ఉన్నారు. మరోవైపు ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్న ధనపాల్‌ను సీఎంని చేస్తామని దినకరన్ మామ దివాకరన్ ప్రకటించారు. కాగా, తమిళనాడులో అనిశ్చితిపై చర్చించేందుకు ఇన్‌చార్జి గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు గురువారం కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ కానున్నారు.

ఆంధ్రజ్యోతి స్పోర్ట్స్
నిజామాబాద్ గురువారం 24 ఆగస్టు 2017

ప్రో కబడ్డీలో నేటి మ్యాచ్
maa movies యోధా X తెలుగు టైటాన్స్ రాత్రి 8.గం STAR SPORTS 2

ఢిల్లీలో జాతీయ క్రీడా మ్యూజియం

న్యూఢిల్లీ: ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జాతీయ క్రీడా మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ నిర్ణయించింది. తమ దగ్గర ఉన్న క్రీడా జ్ఞాపికలను శాశ్వతంగా భద్రపరిచేందుకు మ్యూజియానికి అందజేయాలని ప్రస్తుత, గత క్రీడాకారులను మంత్రి కోరారు. మ్యూజియం తొలి దశ పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు.

బీసీసీఐకి సుప్రీం షాక్

● ఆఫీసు బేరర్లకు షోకాజ్ ● బోర్డు కొత్త రాజ్యాంగానికి ఆదేశాలు


అమితాబ్ చౌదరి

న్యూఢిల్లీ: బీసీసీఐ పెద్దలకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. జస్టిస్ లోధా సంస్కరణలు ఎందుకు అమలు చేయడంలేదంటూ బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరి, కోశాధికారి అనిరుధ్ చౌదరిలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అంతేకాదు బీసీసీఐ రాజ్యాంగానికి సంబంధించి కొత్త ముసాయిదాను తయారు చేసి సెప్టెంబరు 19న జరిగే తదుపరి విచారణకల్లా తమకు అందజేయాలని క్రికెట్ పాలక కమిటీ (సీవోఏ)కి సూచించింది. లోధా సంస్కరణల అమలుకు చొరవ చూపని బీసీసీఐ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారిని ఆ పదవులనుంచి తొలగించాలని ఈనెల 16న సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో సీవోఏ కోరిన సంగతి తెలిసిందే. అయితే సంస్కరణల అమలులో జరుగుతున్న ఆలస్యానికి గల కారణాలను కోర్టుకు విన్నవించనున్నట్టు పేరు చెప్పేందుకు ఇష్టపడని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. బీసీసీఐలో జస్టిస్ లోధా సంస్కరణల అమలుకు బాధ్యులైన ఖన్నా, అమితాబ్, అనిరుధ్ చౌదరిలు ఆ దిశగా ఇప్పటివరకూ ఎలాంటి ప్రయత్నం చేయలేదని అమికస్ క్యూరీ గోపాల్ సుబ్రమణ్యం సుప్రీం దృష్టికి తెచ్చారు. బోర్డు యాజమాన్యం, పరిపాలనను తమకు అప్పగించాలని సుప్రీంకోర్టుకు సమర్పించిన ఐదో నివేదికలో సీవోఏ కోరింది. అదే విధంగా.. బీసీసీఐ పరిపాలనా వ్యవహారాల్లో తమకు సాయం చేసేందుకు సీఈవో రాహుల్ జోహ్రీ లాంటి ప్రొఫెషనల్‌తో కూడిన బృందం అవసరమని తెలిపింది.



సోనీ సిక్స్, సోనీ టెన్-3, డీడీ నేషనల్‌లో

వరుస విజయాల జోరు.. భీకర ఫామ్‌లో ఉన్న ఆటగాళ్ల హుషారు.. అన్ని విభాగాల్లోనూ ఎదురేలేని పోరాటం.. అంతకుమించిన ఆత్మవిశ్వాసం.. ఇదీ లంక పర్యటనలో భారత్ పరిస్థితి..!
టెస్టు సిరీస్ కోల్పోయి... తొలి వన్డేలో చిత్తుగా ఓడి.. సొంత అభిమానుల ఆగ్రహానికి గురై.. ఆత్మస్థయిర్యం సన్నగిల్లి.. జట్టులో అంతర్గత విభేదాలు పొడసూపి.. అసలు గెలుస్తామన్న ఆశలే అడుగంటిన దుస్థితి శ్రీలంకది..!
ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య నేటి రెండో వన్డే ఆసక్తి కలిగిస్తోంది..! మరి, జోరు మీదున్న కోహ్లీసేనకు ఆతిథ్య జట్టు ఈ మ్యాచ్‌లో అయినా పోటీ ఇస్తుందా..? ఏకపక్షంగా సాగుతున్న సిరీస్‌ను రసవత్తరం చేస్తుందా?

లంక పోటీ ఇచ్చేనా?

● జోరు మీద భారత్
● తీవ్ర ఒత్తిడిలో ఆతిథ్య జట్టు
● రెండో వన్డే నేడు

పల్లెకెలె: శ్రీలంక పర్యటనలో భారత్ తన హవా కొనసాగించాలని భావిస్తోంది. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా గురువారం ఇక్కడ జరిగే రెండో మ్యాచ్‌లో ఆతిథ్య లంకపై గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. టెస్టు సిరీస్‌ను 3-0తో ఖాతాలో వేసుకున్న కోహ్లీసేన.. తొలి వన్డేలో తొమ్మిది వికెట్లతో ఆతిథ్య జట్టును చిత్తు చేసి ఘనమైన బోణీ కొట్టింది. మరోవైపు లంక మాత్రం పేలవ ప్రదర్శనతో అత్యంత గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. దంబుల్లాలో లంక ప్రదర్శన అభిమానులకు తీవ్రంగా ఆగ్రహం తెప్పించింది. కొంతమంది అభిమానులు జట్టు బస్సును అడ్డుకొన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక, జట్టు వ్యవహారాల్లో మేనేజర్ అసాంక గురుసిన్హా అతిగా తలదూరుస్తున్నాడని చీఫ్ కోచ్ నిక్ పోథాస్ పరోక్షంగా చెప్పడం చూస్తుంటే లంక టీమ్‌లో అంతర్గత సమస్యలు మొదలైనట్టు స్పష్టం అవుతోంది. మరో ఓటమి ఎదురైతే మాత్రం అవి మరింతగా పెరిగే అవకాశం ఉంది. దాంతో, ఇప్పుడు ఆతిథ్య జట్టుకు విజయం అత్యవసరమే.

మార్పుల్లేకుండానే..: తొలి వన్డేలో భారత్ అన్ని విభాగాల్లోనూ అదరగొట్టింది. అశ్విన్, జడేజాల గైర్హాజరీలో వచ్చిన అవకాశాన్ని యువ స్పిన్నర్లు అక్షర్, చాహల్ రెండు చేతులా ఒడిసిపట్టుకున్నారు. పేసర్ బుమ్రా, పార్ట్ టైమర్ కేదార్ జాదవ్ కూడా లంక బ్యాట్స్‌మెన్‌ను నిలువరించారు. భారత్ మరోసారి సమష్టిగా ఆడితే విజయం నల్లేరుమీదే నడకే అనొచ్చు. ఇక, ఈ మ్యాచ్‌కు తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం కనిపించడం లేదు.

లంక ఆట మారితేనే..: లంక డ్రెస్సింగ్ రూమ్ విషయాలు సవ్యంగా లేవని తెలుస్తోంది. కోచ్, కెప్టెన్‌పై ఇతరుల అజమాయిషీ పెరిగిందన్న వార్తలు వస్తున్నాయి. మేనేజర్ గురుసిన్హాతో పాటు చీఫ్ సెలెక్టర్ సనత్ జయసూర్య జట్టును ప్రభావితం చేస్తున్నారని తెలుస్తోంది. అయితే, లంక ఆటతీరే ఈ అనిశ్చితికి ప్రధాన కారణం. ఆట మారితేనే పరిస్థితులు మారతాయని ఆతిథ్య జట్టు గుర్తుంచుకోవాలి. అందువల్ల ఆతిథ్య జట్టు మరింత బాధ్యతతో ఆడాలి. బ్యాటింగ్‌లో స్థిరత్వం చూపాలి.

పిచ్/వాతావరణం

డే/నైట్ మ్యాచ్‌ల్లో పల్లెకెలె పిచ్ సీమర్లకు అనుకూలంగా ఉంటుంది. అదే సమయంలో స్పిన్నర్లకు సహకారం లభించదని చెప్పలేం. ఇక, గురువారం ఇక్కడ కొద్దిపాటి వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా.


మలింగ, గుణతిలక

జట్లు (అంచనా)

భారత్: రోహిత్, ధవన్, కోహ్లీ, రాహుల్, ధోనీ (కీపర్), కేదార్, హార్దిక్/కుల్దీప్, అక్షర్, భువనేశ్వర్, చాహల్, బుమ్రా.

శ్రీలంక: డిక్‌వెలా (కీపర్), గుణతిలక/చాందిమల్, కుశాల్ మెండిస్, తరంగ (కెప్టెన్), మాథ్యూస్, కపుగెదర, సిరివర్దన, హసరంగ, ధనంజయ, మలింగ, విశ్వ ఫెర్నాండో.



వన్డే కెప్టెన్సీకి ఏబీ గుడ్‌బై

● టెస్టులూ ఆడతానని స్పష్టీకరణ

జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా స్టార్ క్రికెటర్ ఏబీ డివిల్లీర్స్ తన టెస్టు కెరీర్‌పై వస్తున్న పుకార్లకు పుల్‌స్టాప్ పెట్టాడు. టెస్టులు సహా అన్ని ఫార్మాట్లలోనూ కొనసాగుతానని స్పష్టం చేసిన ఏబీ వన్డే జట్టు కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. గతేడాది స్వదేశంలో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో పాల్గొన్న డివిల్లీర్స్ తర్వాత ఈ ఫార్మాట్‌కు దూరంగా ఉంటూ వచ్చాడు. దాంతో, ఏబీ టెస్టులకు వీడ్కోలు పలుకుతున్నాడన్న వార్తలు వచ్చాయి. అయితే, వీటిని ఖండిస్తూ సౌతాఫ్రికా స్టార్ ట్విటర్‌లో వీడియో సందేశాన్ని పోస్ట్ చేశాడు. 'ఆరేళ్ల నుంచి జట్టుకు సారథ్యం వహించడం గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఇప్పుడు వన్డే జట్టును వేరే వారు నడిపించే సమయం ఆసన్నమైంది. కొత్త సారథి ఎవరైనా వారికి నా పూర్తి మద్దతు ఉంటుంద'ని తెలిపాడు.



ఇంగ్లండ్ సాకర్ స్టార్ రూనీ రిటైర్మెంట్

లండన్: ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ వేన్ రూనీ అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పాడు. 31 ఏళ్ల రూనీ అంతర్జాతీయ సాకర్‌లో 119 మ్యాచ్‌లాడి 53 గోల్స్ చేశాడు. ఇంగ్లండ్ తరపున అత్యధిక గోల్స్ రికార్డు రూనీ పేరిటే ఉంది. 2003లో తొలిసారిగా ఇంగ్లండ్ జట్టుకు ఎంపికైన రూనీ ఆ దేశం తరపున అత్యధిక మ్యాచ్‌లాడిన రెండో ఆటగాడిగా రికార్డుల్లోకి ఎక్కాడు. కాగా రూనీ ఇటీవలే మాంచెస్టర్ క్లబ్ నుంచి ఎవర్టన్‌కు మారిన విషయం తెలిసిందే.


లాస్‌ఏంజెల్స్‌లో కొనార్ మెక్‌గ్రెగర్‌తో ఈ నెల 26న జరిగే బౌట్‌ను పురస్కరించుకొని బుధవారం మీడియా సమావేశంలో ఫొటోలకు పోజిచ్చిన అమెరికా బాక్సింగ్ దిగ్గజం ఫ్లాయిడ్ మేవెదర్

ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం సహా పలు పతకాలపై కన్నేసిన భారత్ ఆ దిశగా ఒక్కో అడుగేస్తోంది.. సింగిల్స్‌లో ముగ్గురు ప్లేయర్లు ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకుపోయారు.. బుధవారంనాటి రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో కిడాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్, సాయిప్రణీత్ విజయాలు సాధించారు..ఈ ఏడాది ఆస్ట్రేలియన్, ఇండోనేసియన్ టైటిళ్లు నెగ్గిన శ్రీకాంత్ ఇక్కడా అదే జోరును ప్రదర్శిస్తున్నాడు..రెండో రౌండ్‌ను సునాయాసంగా అధిగమించాడు..సైనా సైతం అలవోకగా ప్రీక్వార్టర్స్‌కు చేరుకోగా..సాయి ప్రణీత్‌మాత్రం ఒకింత చెమటోడ్చాల్సి వచ్చింది.

ప్రీక్వార్టర్స్‌లో సైనా

● శ్రీకాంత్, ప్రణీత్ కూడా.. ● సిక్కిరెడ్డి జోడీ ఓటమి



సైనా నెహ్వాల్

గ్లాస్గో: వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత షట్లర్ల జోరు కొనసాగుతోంది. లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్, తెలుగుతేజం కిడాంబి శ్రీకాంత్, సింగపూర్ ఓపెన్ చాంపియన్ సాయిప్రణీత్ ప్రీక్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు. మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డి జోడీ, సింగిల్స్‌లో తన్వీలాడ్ పరాజయం చవిచూశారు. బుధవారంనాటి రెండో రౌండ్‌లో ఎనిమిదో ర్యాంక్ శ్రీకాంత్ 21-9, 21-17తో ఫ్రాన్స్ షట్లర్ లుకాస్ కోర్వీపై వరుస గేముల్లో అనాయాసంగా విజయం సాధించాడు. శ్రీకాంత్ ప్రీక్వార్టర్స్‌లో వరల్డ్ 18వ ర్యాంకర్ ఆండర్స్ ఆంటోన్‌సెన్ (డెన్మార్క్)ను ఢీకొంటాడు. 27 ఏళ్ల సైనా 21-11, 21-12 స్కోరుతో వరుస గేముల్లో స్విట్జర్లాండ్‌కు చెందిన సబ్రినా జాక్వెట్‌పై కేవలం 33 నిమిషాల్లో గెలుపొందింది. సబ్రినాపై సైనాకిది రెండో విజయం కావడం విశేషం. 2012 లండన్ ఒలింపిక్స్‌లోనూ ఆమెపై నెహ్వాల్ గెలుపొందింది. జకార్తాలో జరిగిన గత ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో రజతం కైవసం చేసుకున్న సైనాకు..ఈ పోటీల తొలిరౌండ్‌లో బై లభించిన సంగతి తెలిసిందే. ప్రీక్వార్టర్స్‌లో రెండోసీడ్ సంగ్ జీ హ్యూన్ (దక్షిణ కొరియా)తో తలపడనుంది. అయితే సంగ్‌పై సైనా ముఖాముఖి పోరులో 7-2 ఆధిక్యంలో ఉండడం గమనార్హం. ఇటీవల ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో హ్యూన్‌పై సైనాదే పైచేయి అయింది.

శ్రీకాంత్ సులువుగా: లుకాస్‌తో మ్యాచ్‌లో శ్రీకాంత్‌కు నల్లేరుపై బండి నడకలా సాగింది. 32 నిమిషాల్లోనే మ్యాచ్ ముగిసింది. తొలి గేమ్ మరీ సునాయాసమైంది. అయితే మొదట్లో ప్రత్యర్థి ఒకింత పోటీ ఇవ్వడంతో ఇద్దరూ 6-6తో సమమయ్యారు. అయితే ఈ దశలో గేరు మార్చిన 24 ఏళ్ల శ్రీకాంత్ వరుసగా పది పాయింట్లు కైవసం చేసుకొని 16-6తో దూసుకుపోయాడు. ఆపై పదునైన స్మాష్‌లతో విరుచుకుపడి 19-9తో తిరుగులేని ఆధిక్యం ప్రదర్శించాడు. ఈ తరుణంలో లుకాస్ రిటర్న్ షాట్‌ను తప్పుగా కొట్టడంతో శ్రీకాంత్ గేమ్ పాయింట్‌పై నిలిచాడు. అయితే లుకాస్ డ్రాప్‌షాట్ నెట్‌ను తాకడంతో 12 నిమిషాల తొలిగేమ్ శ్రీకాంత్ పరమైంది.


శ్రీకాంత్

రెండో గేమ్‌లో శ్రీకాంత్ అటాకింగ్ స్ట్రోక్‌లు, ఫోర్‌హ్యాండ్ డ్రైవ్‌లతో ప్రత్యర్థిని బెంబేలెత్తించి 11-7 ఆధిక్యంలోకి దూసుకు పోయాడు. కానీ లుకాస్ పుంజుకొని స్కోరును 15-15 సమం చేశాడు. అయితే లుకాస్ ప్రతిఘటన కొద్దిసేపే. ఆపై శ్రీకాంత్ విజృంభించి గేమ్‌ను, మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

చెమటోడ్చిన సాయి: ఇక పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్ రెండోరౌండ్ మ్యాచ్‌లో శ్రమకోర్చాల్సి వచ్చింది. తొలి గేమ్‌లో పరాజయం చవిచూసిన సాయి..ఆపై తేరుకొని ఆంథోని సునిసుక గింటింగ్ (ఇండోనేసియా)పై 14-21, 21-18, 21-19తో గెలుపొంది ఊపిరిపీల్చుకున్నాడు. ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో మార్క్ జ్విబ్లెర్ (జర్మనీ), చౌ తీన్ చెన్ (చైనీస్ తైపీ)లలో ఒకరితో ప్రణీత్ తలపడతాడు. మహిళల సింగిల్స్‌లో తన్వీలాడ్ 9-21, 19-21తో దక్షిణ కొరియాకు చెందిన సంగ్ జీ హ్యూన్ చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ రెండోరౌండ్‌లో అశ్వినీపొన్నప్ప-సిక్కిరెడ్డి జోడీ 22-24, 21-17, 15-21తో కమిల్లా-కిస్టినా (డెన్మార్క్) ద్వయం చేతిలో ఓడింది.

చెలరేగిన అఫ్రీది



లండన్: పాకిస్థాన్ మాజీ ఆటగాడు షాహిద్ అఫ్రీది టీ-20ల్లో శతకంతో చెలరేగిపోయాడు. డెర్బీషైర్‌తో మంగళవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో హాంప్‌షైర్ తరపున బరిలోకి దిగిన అఫ్రీది కేవలం 42 బంతుల్లో 101 పరుగులు (10 ఫోర్లు, 7 సిక్సర్లు) చేశాడు. దీంతో హాంప్‌షైర్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 249 పరుగులు చేసింది. అనంతరం ప్రత్యర్థి జట్టు కేవలం 148 పరుగులకే ఆలౌటైంది. కాగా అఫ్రీది తన హాఫ్ సెంచరీని 20 బంతుల్లో పూర్తి చేశాడు.



వచ్చేసింది...10 ఓవర్ల క్రికెట్

● పాల్గొననున్న సెహ్వాగ్, గేల్

బెంగళూరు: పది ఓవర్ల క్రికెట్ లీగ్ వచ్చేసింది. యూఏఈ వేదికగా త్వరలో జరగనున్న టీ-10లీగ్‌లో వీరేంద్ర సెహ్వాగ్, క్రిస్ గేల్, షాహిద్ అఫ్రీది, కుమార సంగక్కర మెరుపులు మెరిపించనున్నారు. పంజాబీస్, పక్తూన్స్, మరాఠా, బంగ్లాస్, లంకన్స్, సింధీస్, కేరళైట్స్ తదితర జట్లు తలపడనున్నాయి. అఫ్రీది పక్తూన్స్ జట్టుకు సారథ్యం వహిస్తాడు. ఈ డిసెంబరు 21న షార్జా క్రికెట్ స్టేడియంలో మొదలయ్యే టోర్నీ 24న ముగియనుంది. మ్యాచ్ సమయం 90 నిమిషాలు. యూఏఈలో త్వరలో ఆటగాళ్ల వేలం జరగనుంది.

ఐరోపా పర్యటనకు రజని ఎంపిక


రజని

న్యూఢిల్లీ: ఐరోపా పర్యటనకు వెళ్లే భారత మహిళా హాకీ జట్టుకు తెలుగు క్రీడాకారిణి రజని యతిమరపు ఎంపికైంది. రాణి నాయకత్వంలో 18 సభ్యుల జట్టును బుధవారం ప్రకటించారు. ఈ టూర్‌లో వచ్చే నెల 5న తొలి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో భారత్ తలపడనుంది.

జట్టు: గోల్ కీపర్లు: సవిత (వైస్ కెప్టెన్), రజని; **డిఫెండర్లు:** దీపా గ్రేస్ ఎక్కా, గుర్జిత్ కౌర్, నవదీప్ కౌర్, సునీత లక్రా, రష్మిత మిన్జ్; **మిడ్‌ఫీల్డర్లు:** నమిత టొప్పో, నిక్కీ ప్రధాన్, మోనిక, కరిష్మా యాదవ్, లిలిమా మిన్జ్, నేహ గోయల్; **ఫార్వర్డ్‌లు:** రాణి (కెప్టెన్), పూనమ్ రాణి, వందన కటారియా, రీనా ఖోఖర్, లాల్‌రెమ్సియామి.



యూపీ-తమిళ్ మ్యాచ్ టై

లఖ్‌నవ్: ప్రొ కబడ్డీ లీగ్ లఖనవ్ అంచెలో బుధవారం నాటి రెండో మ్యాచ్ అభిమానులకు మస్తు మజా పంచింది. తొలి అర్ధ భాగంలో యూపీ పైచేయి ప్రదర్శిస్తే.. సెకండ్ హాఫ్‌లో తమిళ్ తలైవాస్ అనూహ్యంగా పుంజుకుంది. ఫలితంగా ఈ జోన్ -బి మ్యాచ్ 33-33తో టై అయింది. చివరి నిమిషంలోని మూడు రైడ్లు ఆట స్వరూపాన్నే మార్చివేశాయి. అప్పటిదాకా గెలుపు తమదేనన్న ధీమాలో ఉన్న యూపీ నివ్వెరపోయింది. తమిళ జట్టులో అజయ్ ఠాకూర్ విజృంభించి పది పాయింట్లు స్కోరు చేయగా అమిత్ హుడా (6), దర్శన్ (4), వినీత్ కుమార్ (3) రాణించారు. యూపీలో రిషాంక్ ఏకంగా 16 పాయింట్లు రాబట్టినా మిగతా వారి నుంచి పెద్దగా సహకారం లభించలేదు. నితిన్ తోమర్ (4), జీవన్ కుమార్ (3) ఫర్వాలేదనిపించారు. అంతకుముందు జోన్ ఏలో హర్యానా స్టీలర్స్ హోరాహోరీ పోరులో 27-25 స్కోరుతో దబాంగ్ ఢిల్లీని చిత్తుచేసింది.

ఆ ఘోరానికి డబ్బులిచ్చింది మేడమే

- కేరళ నటిపై అత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు పల్సర్ సుని వెల్లడి
- కావ్యామాధవన్‌కు తాను తెలుసని స్పష్టీకరణ


పల్సర్ సుని



కావ్యామాధవన్

తిరువనంతపురం, ఆగస్టు 23: కేరళ నటిపై అత్యాచారం కేసులో నిందితుడైన పల్సర్ సుని పోలీసు విచారణలో సంచలన విషయాన్ని బయటపెట్టాడు. ఈ ఘోరాన్ని చేయడానికి తనకు 'మేడం' డబ్బులిచ్చారని తెలిపాడు. సదరు 'మేడం' పేరు చెప్పడానికి అతడు నిరాకరించాడు. ఆమె పేరు తర్వాత చెబుతానన్నాడు. అతడు చెబుతున్న 'మేడం' అనే వ్యక్తి.. హీరో దిలీప్ రెండో భార్య కావ్యామాధవనే అని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, పల్సర్ సుని ఎవరో తనకు తెలియదని కావ్యామాధవన్ గతంలో పోలీసు విచారణలో పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనిపైనా సుని స్పందించాడు. ఆమె చెబుతోంది పచ్చిఅబద్ధమని.. కావ్యకు తానెవరో తెలుసునని అతడు స్పష్టం చేశాడు.

భారత్‌కు వెళ్లిపో..!

- భారత సంతతి సీఈవోపై జాతి విద్వేష దాడి
- అమెరికాలో ట్రంప్ మద్దతుదారుల నిర్వాకం

న్యూయార్క్, ఆగస్టు 23: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు జాత్యాహంకారంతో రెచ్చిపోయారు. భారత సంతతికి చెందిన ఓ కంపెనీ సీఈవోను ఁగో బ్యాక్ టు ఇండియా' అంటూ జాతి విద్వేష వ్యాఖ్యలతో అవమానించారు. రావిన్ గాంధీ అమెరికాలో జీఎంఎం నాన్‌స్టిక్ కోటింగ్స్ కంపెనీ సీఈవోగా వ్యవహరిస్తున్నారు. వర్జీనియా హింసాకాండలో శ్వేతజాతీయులను వెనకేసుకొచ్చిన ట్రంప్ వైఖరిని తప్పుబడుతూ ఓ పత్రికలో వ్యాసం రాశారు. ట్రంప్ ఆర్థిక ఎజెండాను కూడా తూర్పారబట్టారు. దీన్ని జీర్ణించుకోలేని ట్రంప్ అభిమానులు రావిన్‌ను దూషిస్తూ కామెంట్లు చేశారు. భారత్ వెళ్లిపోవాలని హూంకరించారు. ఐక్యరాజ్యసమితిలో అమెరికా ప్రతినిధి నిక్కీ హెలీపైనా విమర్శలు గుప్పించారు. కాగా, ఁమీడియాలో నిజాయితీలేని వాళ్లు ఉన్నారు. తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. నేను జాతి విద్వేషాన్ని వ్యతిరేకించిన విషయాన్ని ప్రచారం చేయడం లేదు' అంటూ అమెరికా మీడియాపై ట్రంప్ ఒంటికాలిపై లేచారు. మరోవైపు అమెరికాలో జాతి విద్వేషం పెరుగుతోందని ఐక్యరాజ్యసమితిలో వర్ణ వివక్షపై పోరాట కమిటీ హెచ్చరించింది. వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సూచించింది. కాగా మాంచెస్టర్ దాడి నేపథ్యంలో స్కాట్లాండ్‌కు చెందిన ఓ వ్యక్తి భారత సంతతికి చెందిన నేత్ర వైద్యుడి వద్ద పరీక్షకు నిరాకరించాడు. తాను శ్వేత జాతీయుడి వద్దే పరీక్ష చేయించుకుంటానంటూ ఎరిక్ గ్రీనే(58) మొండికేశాడు.



బ్యాక్టీరియాతో ఇంధనం

లాస్ ఏంజెలిస్, ఆగస్టు 23: కిరణజన్య సంయోగక్రియ.. మొక్కలు సూర్యకాంతిని వాడుకుని కార్బన్‌డయాక్సైడ్, నీటితో ఆహారాన్ని తయారు చేసుకునే ప్రక్రియ. దాన్ని ఆధారంగా చేసుకుని శాస్త్రవేత్తలు సైబోర్గ్ అనే బ్యాక్టీరియాను సృష్టించారు. ఈ బ్యాక్టీరియా అచ్చం మొక్కల్లాగే సూర్యకాంతి సహాయంతో పర్యావరణహిత ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తుంది. సహజంగా దొరికే మూరెల్లా థర్మోఅసెటికా కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహించి ఎసిటిక్ ఆమ్లాన్ని ఉత్పత్తి చేస్తుంది. దాంతో ఇంధనం, ప్లాస్టిక్‌ను తయారు చేయొచ్చు. అయితే, మరింత సమర్థంగా అది పనిచేసేందుకు కాలిఫోర్నియా, బర్కిలీ యూనివర్సిటీల పరిశోధకులు ఆ బ్యాక్టీరియాకు కాడ్మియంను సిస్టైన్ సమ్మేళనాన్ని తినిపించారు. అది సూక్ష్మఅణువులుగా మారి సోలార్ ప్యానెళ్లలా పనిచేస్తుంది. ఈ కొత్త హైబ్రిడ్ జీవి కార్బన్‌డయాక్సైడ్‌తోనే కాదు నీరు, సూర్యకాంతితోనూ ఎసిటిక్ ఆమ్లాన్ని ఉత్పత్తి చేస్తుందట.

నరమాంసం బోర్ కొట్టింది

- పోలీస్ టేబుల్‌పై నరికేసిన కాలు, చెయ్యి
- మరో ముగ్గురితో కలిసి తిన్నానని వెల్లడి
- నలుగురు నిందితులూ అరెస్ట్

డర్బన్, ఆగస్టు 23: అదేదో హాలీవుడ్ సినిమాలో మనుషులను చంపి వారి మాంసాన్ని వండుకు తింటుంటారు సైకోలు! దక్షిణాఫ్రికాలోని పీటర్‌మారిట్జ్‌బర్గ్‌లో అలాంటి సైకోలు నిజంగానే ఉన్నారు. వారిలో ఒకడు తనంత తానే వచ్చి పోలీసులకు లొంగిపోయేదాకా ఈ విషయం బయటకు రాలేదు. ఆ వ్యక్తి గత శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి 'నర మాంస భక్షణతో విసుగెత్తింది' అంటూ ఒక కాలు, చెయ్యి టేబుల్ మీద పెట్టడంతో పోలీసులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కాస్త తేరుకున్నాక అతణ్ని అదుపులోకి తీసుకున్నారు. తనలాగే మరో ముగ్గురు ఉన్నారని చెప్పడంతో అతణ్ని వెంటబెట్టుకుని వెళ్లి ఎస్ట్‌కోర్ట్‌లో గల వారి స్థావరాన్ని కనుగొన్నారు. అక్కడ తనిఖీ చేసిన పోలీసులకు దిమ్మతిరిగిపోయింది. ఆ ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ ఉన్న శరీరావయవాలు చూసి వారు ప్రమాన్పడిపోయారు. ఆ అవయవాలన్నీ ఒక వ్యక్తివేనా లేకపోతే చాలా మంది వ్యక్తులవా అని తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ నిపుణులను పిలిపించి పరీక్షలను చేయిస్తున్నారు. ప్రస్తుతం ప్రధాన నిందితుడు నినో ఎంబతా (32), స్తెంబిసో సిథోల్ (31), లిండోకుహ్లె మసోండో (32), లంగిసాని మగుబానే (30)లను అదుపులోకి తీసుకున్నారు. అయితే, హత్యకు గురైన ఆ మహిళ వివరాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. నినో ఎంబతా తాను నివసించే ప్రాంతంలో ఫెయిత్ హీలర్ (భూత వైద్యుడు)గా పనిచేస్తున్నట్టు తెలిపారు. వీరి వెనక నరమాంస ముఠా ఉన్నట్టు అనుమానిస్తున్న పోలీసులు ఆ దిశగా కూడా కేసును దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటి దాకా కనిపించకుండా పోయిన వ్యక్తుల వివరాలను బయటకు తీస్తున్నారు. వారి వారి బంధువులను పిలిపించి ఆరా తీస్తున్నారు. కాగా, వారి అరెస్టుల తర్వాత ఎస్ట్‌కోర్ట్ స్థానికుల నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. విచారణలో భాగంగా పోలీసులు నోరెళ్లబెట్టే విషయాలు వెలుగు చూశాయి. దాదాపు 300 మంది స్థానికులు తాము కూడా నరమాంసాన్ని తిన్నట్టు ఒప్పుకొన్నారు. ఫెయిత్ హీలర్ (భూత వైద్యుడు)గా చెప్పుకొనే ఎంబతా ప్రోద్బలంతోనే తాము నరమాంసాన్ని తిన్నామని.. అలా చేస్తే అంతా మంచే జరుగుతుందని అతడు చెప్పేవారన్నారు. కాగా, నలుగురిని నిందితులను పోలీసులు సోమవారం కోర్టులో ప్రవేశపెట్టారు.

ఇంజనీరింగ్ కామన్ ఎగ్జామ్ ప్రస్తుతానికి లేనట్టే

న్యూఢిల్లీ, ఆగస్టు 23: నీట్ తరహాలో ఇంజనీరింగ్‌కూ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షను (కామన్ ఇంజనీరింగ్ ఎగ్జామ్) నిర్వహించాలన్న నిర్ణయాన్ని కేంద్ర మానవ వనరుల శాఖ ప్రస్తుతానికి పక్కన పెట్టింది. 2018 నుంచి ఇంజనీరింగ్‌కు కూడా జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షను నిర్వహించబోతున్నట్టు గత మార్చిలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఐ) ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, నీట్ నిర్వహణ తీరుతెన్నుల ఫలితం ఆధారంగానే కామన్ ఇంజనీరింగ్ ఎగ్జామ్‌ను నిర్వహించాలని హెచ్‌ఆర్డీ నిర్ణయించింది. కామన్ ఎగ్జామ్ సాధ్యాసాధ్యాలపై ఏఐసీటీఐ సమర్పించే నివేదికకు అనుగుణంగా దానిపై నిర్ణయం తీసుకోబోతున్నట్టు ప్రకటించింది.

వ్యాధులను గుర్తించే పేపర్ పరికరం



న్యూయార్క్, ఆగస్టు 23: రక్తహీనత లాంటి వ్యాధులను గుర్తించే పేపర్ ఆధారిత విద్యుత్ రసాయనిక పరికరాన్ని శాస్త్రవేత్తలు తయారుచేశారు. రాపిడి లేదా నొక్కడం ద్వారా సొంతంగా శక్తిని పుట్టించుకుని ఈ పరికరం పనిచేస్తుందని అమెరికాలోని పర్డ్యూ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారు. ఇది శరీరంలోని బయోమార్కర్లను కనుగొని రోగాన్ని గుర్తిస్తుందని వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.-